మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 3 | శుక్రవారం | 28-11-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00


### కలెక్టర్‌కు కెటిఆర్ క్షమాపణ చెప్పాలి

సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌పైన బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల 'ది తెలంగాణ ఐఎఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్ (టిజిఐఎఎస్‌ఒఐ)' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కలెక్టర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని కెటిఆర్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు టిజిఐఎఎస్‌ఒఐ చేసిన తీర్మానాన్ని గురువారం విడుదల చేసింది. ప్రభుత్వ కార్యాలయాలను ఆక్రమించే వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులపై దుష్ప్రచారం చేయడం ఆనవాయితీగా మారడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

## పౌష్టికాహారం అందించడంలో
# అలక్ష్యం తగదు



సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వసతిగృహాల్లో తరచూ ఘటనలు చోటుచేసుకోవడంపై సిఎం ఆగ్రహం
- ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవు
- ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సిఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే తరువాయి 2లో



## బంగ్లాదేశ్ పరిణామాలపై
# సిపిఐ ఆందోళన

తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులను, ఇతరులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులపట్ల భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పార్టీ జాతీయ సమితి గురువారం ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ హిందువులు, ఇతర మైనారిటీల రక్షణకు, వారి హక్కుల పరిరక్షణకు వీలుగా వెంటనే హింసాత్మక ఘటనలను నిలిపివేసేందుకు నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను స్వప్రయోజనాలకోసం తరువాయి 2లో



## ఫిబ్రవరిలో
# స్థానిక సమరం

- జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు బిల్లు
- రిజర్వేషన్‌లలో మార్పులు చేర్పులపై కసరత్తు
- వచ్చేనెల 10నాటికి బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక

ప్రజాపక్షం/హైదరాబాద్

మరో నెలన్నర రోజుల్లో స్థానిక సంస్థల సమరంతో తెలంగాణ వేడెక్కే అవకాశం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సంబంధించి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా ఇద్దరు పిల్లల నిబంధనల ఎత్తివేతతో పాటు రిజర్వేషన్‌లలో మార్పులపై వేగం పెంచినట్లు సమాచారం. ఇందులో భాగంగా డిసెంబర్ 10 నాటికి బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రభుత్వానికి అందనున్నట్లు తెలిసింది. మొత్తం మూడు ఫేజ్‌లలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే తాజా సమాచారం ప్రకారం జనవరి 14వ తేదీన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లపై తుది నిర్ణయమని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్‌లు ఉంటాయని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే శాసనసభ ఎన్నికల జాబితాల ఆధారంగా వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించింది.

**ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు బిల్లు**

కనీసం ఐదుగురు ఎంపిటిసి సభ్యులతో ఒక మండల ప్రజాపరిషత్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఎంపిటిసిలతో ఎంపిపి లున్న మండలాల్లో తరువాయి 2లో

## ఆహార నాణ్యత పరిశీలనకు టాస్క్‌ఫోర్స్

పాఠశాలల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు ● ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

గురుకులాలు, హాస్టళ్లు, అంగన్‌వాడి కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ కమిటీలను సైతం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో ఇటీవల ఆహారం కలుషిత వరస ఘటనలు చోటు చేసుకుంటుండడంతో వీటిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీతో తరువాయి 2లో

## ఫుడ్ పాయిజన్ వెనుక భారీ కుట్ర



- త్వరలోనే వెలుగులోకి తెస్తాం
- అన్ని అలజడుల వెనుక బిఆర్‌ఎస్
- మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

బిఆర్‌ఎస్ పార్టీపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. గురుకులాల్లో జరిగే కుట్రలన్నీ త్వరలోనే బయటపెడతామని అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే సర్కారును బద్నాం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గాంధీ భవన్‌లో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గురుకులాల్లో తరువాయి 2లో



## టెన్త్‌లో ఇంటర్నల్
# మార్కులు రద్దు

- ఇక వంద మార్కులకు పరీక్షలు
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పదో తరగతి మార్కుల విధానంలో విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఇంటర్నల్ మార్కుల విధానాన్ని రద్దు చేసి, ఇకపై వంద మార్కులకు తుది పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2024–2025 విద్యా సంవత్సరం) నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి తరువాయి 2లో

## జార్ఖండ్ 14వ సిఎంగా
# హేమంత్ సోరెన్

జెఎంఎం నేతతో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్



**రాంచి:** జార్ఖండ్ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జెఎంఎం నేత, హేమంత్ సోరెన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. రాంచీలోని మొరహాబాదీ మైదానంలో గురువారం సాయంత్రం ఘనంగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అలాగే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్కమార్క, ఆప్ తరువాయి 2లో

## ఎంపిగా ప్రియాంకా గాంధీ ప్రమాణం



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తొలిసారి గురువారం లోక్‌సభలో అడుగు పెట్టారు. ఇటీవల కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో భారీ విజయం సొంతం చేసుకున్న ఆమె రాజ్యాంగాన్ని చేబూని ఎంపిగా ప్రమాణం చేశారు. గురువారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓమ్ బిర్లా కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో ప్రజాప్రతినిధిగా ఐదేళ్లపాటు ఆమె ప్రయాణం కొనసాగనుంది. పార్లమెంట్ సభ్యులుగా ప్రమాణం చేయడంతో ఇప్పటికే ఎంపిలుగా ఆమె తల్లి సోనియాగాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ సరసన ప్రియాంక గాంధీ కూడా చేరారు. ఒకే కటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఏక కాలంలో పార్లమెంట్ సభ్యులుగా ఉండడం చాలా అరుదుగా కనిపించే అంశంగా భావిస్తున్నారు. కాగా, రాహుల్‌గాంధీ ఇటీవలి కాలంలో బహిరంగ సభల్లో ప్రదర్శించిన ఎర్రరంగుతో కూడిన రాజ్యాంగాన్ని ప్రతిని ప్రియాంకాగాంధీ కూడా చేబూని కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'కసావు' చీర ధరించి హిందీలో పార్లమెంట్ సభ్యులుగా ప్రమాణం చేశారు. ఆమె ప్రమాణం చేస్తున్న సమయంలో 'జోడో జోడో, భారత్ జోడో' అంటూ కాంగ్రెస్ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ తరువాయి 2లో

## కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

**న్యూఢిల్లీ :** కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం అక్కడ ఉన్నటువంటి ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌ను మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అప్‌గ్రేడ్ చేయాలని 2023 జూలై 5న దక్షిణ మధ్య రైల్వే జిఎంకి రైల్వే బోర్డు లేఖ రాసింది. అప్‌గ్రేడ్ చేసినటువంటి యూనిట్‌లో ఎల్‌హెచ్‌బి, ఇఎంయు కోచ్‌లు తయారు చేసేందుకు వీలుగా యూనిట్‌ని అభివృద్ధి చేయాలని ఈ ఏడాది (2024) సెప్టెంబరు 9న రైల్వే బోర్డు ఆదేశాలు జారీచేసింది. కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో ఎల్‌హెచ్‌బి, ఇఎంయు కోచ్‌ల తయారీకి సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించాలని ఈ మేరకు రైల్వే బోర్డు సూచించింది. విభజన హామీల అమలుపై తెలంగాణ రాష్ట్ర అధికారులు, కేంద్ర అధికారులతో హోం శాఖ నిర్వహించిన భేటీలో ఈ విషయం వెల్లడైంది.

## మూడో రోజూ తగ్గని విపక్షం



- అదానీ, సంభల్ ఘటనలపై అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు
- చర్చ జరగకుండానే నేటికి వాయిదా పడిన సభలు

**న్యూఢిల్లీ :** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముడుపుల వ్యవహారం, ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో హింసాత్మక ఘటనలు తదితర అంశాలపై విపక్షల సభ్యుల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు గురువారం కూడా అట్టుడికాయి. మూడవరోజూ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం లోక్‌సభ, రాజ్యసభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు అదానీ, సంభల్ ఘటనలపై చర్చకు పట్టుబడుతూ ఆందోళనకు దిగారు. దీంతో ఉభయసభలను కూడా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తరువాత కూడా ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించడంతో ఉభయసభలను స్పీకర్, చైర్మన్ శుక్రవారానికి వాయిదా వేశారు. ఉదయం లోక్‌సభ ప్రారంభమైన తరువాత ఇటీవల కేరళలోని వయనాడ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ప్రియాంకాగాంధీ వాద్రా, మహారాష్ట్ర నాందేడ్ నుంచి గెలిచిన రవీంద్ర చవాన్‌లు ఎంపిలుగా ప్రమాణం చేశారు. వీరి ప్రమాణ స్వీకారం జరిగిన వెంటనే కాంగ్రెస్ సభ్యులు సహా అనేక మంది ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల వద్ద నిల్చోని అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు ఇతర అంశాలపై చర్చించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీకి చెందిన కొంత మంది సభ్యులు వెల్‌లోకి వెళ్లి, మరికొంత మంది సభ్యులు తమ స్థానాల్లో నిల్చోని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాలకు అనుమతించాలని, ఆ తరువాత ఇతర అంశాలను చేపడుదామని స్పీకర్ ఓమ్‌బిర్లా విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై చర్చకు కావాల్సినంత సమయం ఇస్తామని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. కానీ, సభా కార్యకలాపాలను తరువాయి 2లో

## ఖేలో ఇండియా గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్

2026లో నిర్వహించేందుకు కేంద్రం సుముఖం

ప్రజాపక్షం / హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఖేలో ఇండియా – 2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజానికి వచ్చే ఏడాది ఇక్కడ నిర్వహించాలని సిఎం రేవంత్ కోరగా ఇప్పటికే 2025లో బీహార్‌లో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిందని, ఈ క్రమంలో 2026లో అయినా హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరడంతో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ సింగ్ మాండవీయ ఇందుకు సానుకూలంగా తరువాయి 2లో



## ఎసిబికి చిక్కిన
# పిఆర్ ఎఇ

రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కార్తీక్

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి

వరంగల్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతికి పంచాయతీరాజ్ ఎఇ చిక్కాడు. వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కార్తీక్ రూ.5వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం తరువాయి 12లో

## 'మిడ్ డే మీల్స్' నాణ్యతపై కమిటీలు



- కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యాకమిషన్ నిర్ణయం
- రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు
- ప్రత్యేక 'యాప్' ద్వారా ఆహార నాణ్యత పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్

మధ్యాహ్న భోజనం పథకంలో (మిడ్ డే మీల్స్) నాణ్యతను పెంచేందుకు జిల్లా స్థాయిలోనే కలెక్టర్ అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ప్రతినిధులనూ 'మధ్యాహ్న భోజనం' అమలులో భాగస్వాములను చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు. గురుకులాలు, ప్రభుత్వ విద్యాసంస్థలలో తాజా పరిస్థితులను అధ్యయనం చేసేందుకు తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అకస్మిక తనిఖీలను ప్రారంభించింది. డిసెంబర్ 7 వరకు కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను చేపట్టనుంది. అంతకుముందు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారం విషయంలో హైదరాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఆధ్యక్షతన కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై ప్రత్యేక కమిటీలు, మానిటరింగ్ టీమ్‌లు , తరువాయి 12లో

## భారత్‌కు లష్కరే ఉగ్రవాది

- ఇంటర్‌పోల్ సమన్వయంతో రువాండా నుండి సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌ను ఇండియాకు తీసుకొచ్చిన ఎన్ఐఎ



**న్యూఢిల్లీ :** ఇంటర్‌పోల్ రెడ్ నోటీస్‌ను ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) సభ్యుడిని రువాండా దేశం గురువారంనాడు భారత్‌కు అప్పగించగా ఇక్కడికి తీసుకువచ్చారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ), సిబిఐ సమన్వయంతో ఎల్‌ఇటి సభ్యుడిని ఇండియాకు తీసుకువచ్చినట్లు అధికారులు తెలియజేశారు. అంతర్జాతీయంగా నిషేధించబడిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన సల్మాన్ రెహ్మాన్‌ఖాన్ బెంగళూరులో మరింతగా ఉగ్రవాద కార్యకలాపాలను ఉధృతం చేసేందుకు ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను సహాయం చేసినట్లు వారు చెప్పారు. 'సిబిఐకి సంబంధించిన గ్లోబల్ ఆపరేషన్స్ సంస్థ ఎన్ఐఎ, ఇంటర్‌పోల్ నేషనల్ సెంట్రల్ బ్యూరో రువాండో రాజధాని కిగాలీతో సన్నిహిత ంగా సమన్వయం చేసుకుంది.తీవ్రవాద సంబంధిత నేరాలలో భాగస్వామై వాంటెడ్‌గా ఉన్న సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌ను రువాండా నుండి భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి ఎన్ఐఎ కిగాలీని కోరింది' అని సిబిఐ అధికార ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరులో ఉగ్రవాదాన్ని విస్తరించడానికి అతడు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారన్న అభియోగాలపై 2023సంవత్సరంలో సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌పై ఎన్ఐఎ కేసునమోదు చేసింది. బెంగళూరులోని హెబ్బాల్ పోలీస్ స్టేషన్‌లో సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని సిబిఐ తెలియజేసింది. గతంలో (2018–2022 కాలంలో) సల్మాన్ పోక్సో తరువాయి 12లో

# 200 క్షిపణులు, డ్రోన్లతో
# ఉక్రేన్‌పై రష్యా ప్రతీకార దాడి

**10లక్షల ఇళ్ళల్లో అంధకారం.. ఆగేదిలేదు: పుతిన్ హెచ్చరిక**





**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా సామూహిక దాడి చేసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు 10 లక్షలమందిపైగా ఉక్రేన్ ప్రజలు చీకట్లో మగ్గిపోతున్నారు. ఉక్రేన్ ఇంధన వ్యవస్థలపై రష్యా దాడులు చేసింది. ఏకంగా 200 క్షిపణులను, డ్రోన్లను ఉక్రేన్‌పైకి రష్యా ప్రయోగించి 17 ఇంధన లక్ష్యాలను దెబ్బ తీసిందనీ, ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందనీ ఉక్రేన్ అధికారులు ప్రకటించారు. ఈ ఏడాదిలో దీంతో ఇప్పటి వరకూ ఈ విధంగా రష్యా సైన్యం 11 సార్లు ఉక్రేన్ ఇంధన వ్యవస్థలపై భారీ దాడులు చేసింది. అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను ఉపయోగించి మారుమూల రష్యా ప్రాంతాలలోకి ఉక్రేన్ దాడులు చేసినందుకు ప్రతీకారంగా ఈ సామూహిక దాడి చేసినట్లు రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ఒక ప్రకటన చేశారు. అమెరికా, బ్రిటన్ సరఫరా చేసిన ఎటిఎసిఎంఎస్ క్షిపణులను బైడెన్ ప్రోత్సాహంతో ఉక్రేన్ ఈనెల 23, 25 తేదీలలో రెండుసార్లు రష్యాపై ప్రయోగించిందని, దానికి ప్రతీకారం తీర్చుకున్నామని పుతిన్ చెప్పారు. ఏకకాలంలో తమ దళాలు ఉక్రేన్‌లోని 17 లక్ష్యాలపై దాడులు చేశాయని చెప్పారు. సైనిక కేంద్రాలపై దాడులు చేశామన్నారు. ఇక ఉక్రేన్ రాజధాని కీవ్‌లో ఉన్న అత్యంత కీలకమైన కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున తదుపరి దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు.

గడచిన రెండు వారాల స్వల్ప వ్యవధిలో ఉక్రేన్ విద్యుత్ గ్రిడ్స్ వ్యవస్థలపై రష్యా రెండుసార్లు భారీ దాడులు చేసింది. ఒకవైపునుండి శీతాకాలం కమ్ముకొచ్చిన తరుణంలో విద్యుత్ కోత ఉక్రేన్‌కు శాపంగా మారింది. ''ఉక్రేన్ అంతటా ఇంధన వనరుల వ్యవస్థలపై రష్యా దాడి చేసింది'' అని ఉక్రేన్ ఇంధనశాఖామంత్రి హెర్మన్ హాలుశ్చెంకో చెప్పారు.శీతాకాలంలో ఉక్రేన్ ప్రజలను సామూహికంగా సమస్యల్లో నెట్టేందుకే రష్యా ఈచర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో ఒక పోస్టింగ్ పెట్టారు. ఇంతకుముందు కూడా ఉక్రేన్ విద్యుత్ సరఫరా వ్యవస్థలపై రష్యా దాడులు చేసింది. భయంకరమైన శీతాకాలం నుండి రక్షణ పొందడానికి ఉక్రేన్ ప్రజలకు హీటర్లు ఒక్కటే శరణ్యం. త్రాగునీటి సరఫరాకు విద్యుత్ ప్రధాన వనరు. క్షిపణులను




ఉత్పత్తి చేసే రక్షణ పరిశ్రమలకు కూడా దీనివల్ల సమస్యలు వస్తాయి. గురువారంనాడు కొన్ని ఉక్రేన్ ప్రాంతాలలో కలిబ్రి క్రూయిజ్ క్షిపణులు పౌర ప్రాంతాలలోకి దూసుకువచ్చాయి. ఇదెంతో వంచనతో కూడిన విధ్వంసమని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శించారు. ఒక బాంబు నుండి అనేక బాంబులల విస్ఫోటనం జరిగిందని, దీనివల్ల భారీ నష్టం జరిగిందని చెప్పారు. క్లస్టర్ బాంబుల తరహాలో ఈ దాడులు జరిగాయి.

# అరెస్టు వారెంట్లను తొక్కిపెట్టండి: ఇజ్రాయెల్ మొర



**టెల్‌అవీవ్ :** ప్రధానమంత్రి నేతన్యాహూ, మాజీ రక్షణమంత్రి గాలంట్‌లపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంటుల అమలును జాప్యం చేయాలని ఇజ్రాయెల్ మొరపెట్టుకుంది. వీరిద్దరితోపాటు హమాస్‌కు చెందిన మిలిటరీ అధిపతి డైఫ్‌కు కూడా అరెస్టు వారెంటును గతవారంలో ఐసిసి జారీ చేసింది. ఈ అరెస్టు వారెంట్లతో నేతన్యాహూకు సాంకేతికంగా అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయి. యూరప్ దేశాలతో, దేశీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో రాజీ పడటం మంచిదని నేతన్యాహూ ప్రభుత్వం భావించి ఈ విజ్ఞప్తి చేసినట్లు కనిపిస్తున్నది. ఈ అరెస్టువారెంటువల్ల నేతన్యాహూకు తక్షణ సమస్యలు లేకపోయినప్పటికీ సాంకేతికంగా దేశాలతో జరిపే లావాదేవీలలో, పాలనాపరంగా ఆయనకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో వీలైనంతవరకూ ఈ అరెస్టు వారెంట్లను అమలు చేయకుండా జాప్యం చేయడం లేదా కాలయాపన చేయడం, తొక్కిపెట్టి ఉంచడం వంటి చర్యలద్వారా కాలం గడపాలని ఐసిసికి పరోక్ష సలహా ఇచ్చింది. ఐనా గానీ తాము ఐసిసి సభ్యదేశం కాదని బుకాయిస్తున్నది.

**గాజా ఒప్పందంపై ఒత్తిడి తెస్తాం : బైడెన్**

గాజాలో కూడా త్వరలో కాల్పుల విరమణ జరిగే విధంగా ఒత్తిడి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. టర్కీ, ఈజిప్టు, ఖతార్, ఇజ్రాయెల్ తదితర దేశాలతో కలిసి గాజాలో కూడా కాల్పుల విరమణ జరిగేందుకు అందరిపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. జో బైడెన్ మరో 57 రోజులు పదవిలో కొనసాగుతారు. ట్రంప్ అధికారంలోకి రాకముందుగానే అంతర్జాతీయంగా కొన్ని పనులు చక్కబెట్టి డెమోక్రటిక్‌పార్టీపై మధ్యాసియాలో ఉన్న వ్యతిరేకతను కొంతమేరకైనా తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు హమాస్ కూడా తాము కాల్పుల విరమణకు సిద్ధమేనని ప్రకటించింది. ఐతే ఇజ్రాయెల్ చేస్తున్న డిమాండ్లను తాము తిరస్కరిస్తున్నామని కూడా ప్రకటించింది. కానీ అటు ఇజ్రాయెల్, ఇటు హమాస్ కూడామంకుపట్టుతో ఉండటంతో ఇటీవలికాలంలో ఖతార్ తన మధ్యవర్తిత్వ చర్యలను విరమించుకుంది.ఒకవైపు గాజాలో శాంతికి పాటుపడతామని చెబుతున్న జో బైడెన్ ఈ ఒప్పందం తర్వాత ఇజ్రాయెల్‌కు 680 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేసేందుకు అంగీకారం తెలియజేశారని ఆయన పాలనాయంత్రాంగం తెలియజేయడం వివాదాస్పందగా, బైడెన్ ప్రకటనలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

**ధ్వంసమైన ఇళ్ళకు చేరుకున్న లెబనాన్ ప్రజలు**

ఇజ్రాయెల్-హిజ్బొల్లామధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత వేలాదిమంది పారిపోయిన ప్రజలు తిరిగి ఇళ్ళకు చేరుకుంటున్నారు. శిథిలావస్థలో, ధ్వంసమైన ఇళ్ళను చూసి భోరున విలపిస్తున్నారు. ఒప్పందం బుధవారంనాడు అమలులోకి రాగానే వేలాదివాహనాలలో లెబనీయులు సిరియా నుండి బీరూట్ ప్రాంతాలకు చేరుకున్నారు. ధ్వంసమైన ఇళ్ళను చూసి విస్తుపోతూ భవిష్యత్ కర్తవ్యాలకు సిద్ధపడుతున్నారు. 60 రోజులపాటు నిఖార్సుగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉండటంతో ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారు. ఐతే ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లో రాత్రిపూట కర్ఫ్యూను కొనసాగిస్తున్నది. ఇజ్రాయెల్‌పై తమదేశం విజయం సాధించిందని నినాదాలు చేస్తున్నారు. లెబనాన్‌లో 14నెలల యుద్ధంలో 3,853 మందిమరణించారు. దాదాపు 16 వేలమంది గాయపడ్డారు. ఈ పరిస్థితులమధ్య ఇజ్రాయెల్-లెబనాన్ దేశాలు రెండూ కాల్పుల విరమణను మీరు ఉల్లంఘించారంటే, మీరు ఉల్లంఘించారంటూ గొడవలు పడుతున్నాయి. వీరిమధ్య కాల్పుల విరమణ ప్రాథమికంగా 60 రోజులపాటు నిఖార్సుగా అమలులో ఉంటుంది. ఈ కాల్పుల విరమణ కేవలం ఉపశమనమే తప్ప పూర్తి పరిష్కారం కాదని నిపుణులు, లెబనాన్ ప్రజలు కూడా భావిస్తున్నారు.



## ఫుడ్ పాయిజన్ వెనుక భారీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఫుడ్‌పాయిజన్ వెనుక కుట్ర ఉందన్నారు. రాజకీయ కుట్ర ఉందని తాము అనుమానిస్తున్నామన్నారు. కుట్ర వెనుక ఎవరు ఉన్నారనేది బయటపెడుతామన్నారు. అన్ని అలజడుల వెనుక బిఆర్ఎస్ కుట్ర ఉందన్నారు. కుట్రదారుల వెనుక అధికారులు ఉంటే, వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని తెలిపారు. కుట్ర వెనక ఎవరున్నా వదలేది లేదని హెచ్చరించారు. అన్ని ఘటనలపై పూర్తి వివరాలు త్వరలోనే బయటపెడుతామన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చనిపోతే ఎవ్వరి దగ్గరికి పోలేదన్నారు. వాంకిడిలో అమ్మాయి చనిపోవడం దురదుష్టకరమన్నారు. తాము నలుగురు మంత్రులం అక్కడే ఉన్నామన్నారు. ఆ అమ్మాయికి రూ.4 లక్షలు ఖర్చు పెట్టామన్నారు. కార్డియాక్ అరెస్ట్‌తో అమ్మాయి చనిపోయిందన్నారు. ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. తాము చేసిన ప్రగతి మీద సంబురాలు చేస్తున్నామన్నారు. వాళ్లలెక్క(బిఆర్ఎస్) మేకలు కోసి అలాయ్ బలాయ్ చేయట్లేదన్నారు.

## నాణ్యత పరిశీలనకు టాస్క్‌ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)

పాటు పాఠశాలల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇటీవల హాస్టళ్లలో జరిగిన ఫుడ్ పాయిజన్ గల కారణాలను తెల్చి బాధ్యులను గుర్తించనుంది. అదేవిధంగా పాఠశాల ఫుడ్ సేఫ్టీ కమిటీలో సంబంధిత పాఠశాల హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బందితో ఏర్పాటు చేయనున్న ఫుడ్ సేఫ్టీ కమిటీలు రోజువారిగా వంట చేసే ముందు కిచెను పరిశీలించి పరిశుభ్రతను నిర్ధారించడంతో పాటు వండిన ఆహార పదార్థాలను ఈ కమిటీ రుచి చూశాకే విద్యార్థులకు ఆహారం వడ్డించాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

## ఎంపిగా ప్రియాంకాగాంధీ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక తల్లి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చీఫ్ సోనియాగాంధీ, భర్త రాబార్ట్ వాద్రా, కుమారుడు రెహాన్, కుమార్తె మిరయ గ్యాలరీలో కూర్చొని ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. దేశానికి సంబంధించిన అతి ముఖ్యమైన అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతానని, దేశం కోసం, తన పార్టీ కోసం పారాటం చేస్తానన్నారు. ప్రమాణం అనంతరం ప్రియాంకాగాంధీ అన్ని ఫార్మాలిటీలను పూర్తిచేసుకుని తన సోదరుడు, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో కరచాలనం చేసి నాల్గొవ వరుసలో కూర్చున్నారు. అంతకు మందు పార్లమెంట్‌లో సిపిపి కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపిలు శుభాకాంక్షలు తెలియజేశారు.

**తొలి అడుగులోనే భారీ విజయం**

ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ.. తొలి అడుగులోనే భారీ విజయాన్ని నమోదు చేశారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో తన సమీప ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు. ఎంపి హోదాలో మొదటిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. వయనాడ్‌లో విజయంతో.. నెహ్రూగాంధీ కుటుంబంలో దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించిన మూడో వ్యక్తిగా ప్రియాంక గుర్తింపు పొందారు. ఇదివరకు ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించారు. సోనియా గాంధీ కూడా కర్ణాటకలోని బళ్లారి నుంచి పోటీ చేసి విజయం సాధించినప్పటికీ.. అమేథీ లోనూ గెలిచిన ఆమె ఆ తర్వాత దాన్ని వదులుకున్నారు.

## టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

బి.వెంకటేశం గురువారం మెమోను జారీ చేశారు. గతంలో పదవ తరగతి పరీక్షల్లో 80 మార్కులకు పరీక్షలు నిర్వహించి, మరో 20 మార్కులకు ఇంటర్‌నల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాల విద్య గ్రేడింగ్ విధానంలో ఇచ్చే మార్కులు పారదర్శకంగా ఉండటం లేదనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసుకున్నట్టు తెలిసింది. నూతన విధానం ద్వారా విద్యార్థులకు 24 పేజీల సమాధాన బుక్‌లెట్స్‌ను ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది.

## గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 32వ జాతీయ క్రీడలు (2002లో), ఆఫ్రో ఆషియన్ గేమ్స్, 7వ మిలిటరీ గేమ్స్ సహా అనేక జాతీయ స్థాయి పోటీలు జరిగిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అంతే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో పది రెట్ల మేర క్రీడల కోసం కేటాయింపు చేసినట్లు వెల్లడించిన విషయాన్ని సిఎం రేవంత్ గుర్తు చేశారన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జితేందర్ రెడ్డితో పాటు ఎంపిలు డాక్టర్ మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు

## శ్రీలంక, మలేసియా, ఉగాండాలలో
## ప్రకృతి వైపరీత్యాలు

**కౌలాలంపూర్ :** మలేసియాలో వరదల కారణంగా ఆరులక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. తూర్పు, ఉత్తర తీర ప్రాంతాలలో ఉన్న పలు రాష్ట్రాలలో ప్రజలు తీవ్ర వరదలకు గురయ్యారు. వరదల వల్ల కెలంటన్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఈ రాష్ట్రంలో 49,000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారికోసం 207 ప్రత్యేక నివాస కేంద్రాలు తెరిచారు. అదేవిధంగా ఉగాండాదేశం తూర్పు నైరోబీలో కూడా వర్షాలవల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ విలయం కారణంగా 40 ఇళ్ళు శిథిలాల్లో కూరుకుపోయాయి. ఇప్పటివరకు రెడ్‌క్రాస్ సిబ్బంది మరణించిన 13 మంది మృతదేహాలను వెలికితీశారు. మొత్తం 30 మంది మృతులు ఉంటారని స్థానిక మీడియా పేర్కొంది. ఇండోనేసియాలో కూడ కొండచరియలు విరిగిపడి ఏడుగురు మరణించారు. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. మరో పదిమంది గాయపడ్డారు. ఇక శ్రీలంకలో తీవ్రమైన వర్షాలు, వ్యతిరేక వాతావరణ పరిస్థితులు కారణంగా 12 మంది మరణించారు. ఈ వాతావరణ పరిస్థితులవల్ల 3.30 లక్షలమంది ప్రజలు తీవ్ర ప్రభావానికి గురయ్యారు. అంపారాజిల్లాలో వర్షాలవల్ల ఎనిమిదిమంది మరణించారు. మొత్తం 21 జిల్లాలో ఉన్న 98,000 కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి.

## సిరియా ఘర్షణల్లో 132 మంది మృతి: రెబల్స్ పైచేయి



**అలెప్పో :** సిరియాలో ప్రభుత్వదళాలకు, తిరుగుబాటుదారులకు మధ్య జరిగిన భీకరపోరాటంలో దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత జీహదిస్ట్ రెబల్స్ పైచేయి సాధించారు. అలెప్పో ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ పోరులో సైన్యం భారీగా నష్టపోయింది. ఈ భీకర పోరాటంలో దాదాపు 132 మందికిపైగా మరణించారు. ఆర్మీ స్వాధీనంలో ఉన్న అలెప్పోరాష్ట్రంలోని ప్రాంతాలను తిరుగుబాటుదారులు తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. జీహదిస్టు హయత్ తహరిన్ అల్ సామ్ (హెచ్‌టిఎస్) వారి మిత్రులైన తిరుగుబాటుగ్రూపులు కలిసి బుధవారంనాడు దిగ్భ్రాంతి కలిగించే రీతిలో అలెప్పోప్రాంతంలో సైన్యంపై దాడులు చేశాయి. గడచిన 24 గంటల్లో తిరుగుబాటుదారులు, సైన్యం తరపున మృతుల సంఖ్య 132కు పెరిగింది. ఇంకా పెరిగే అవకాశం ఉందని బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న మానవహక్కుల సిరియన్ అబ్జర్వేటరీ గురువారంనాడు ఒక ప్రకటనలో తెలియజేసింది.ఈ దాడుల్లో 49 మంది ప్రభుత్వ సైనికులు మరణించారు. 65 మంది హెచ్‌టిఎస్ తిరుగుబాటుదారులు మరణించగా, మరో 18 మంది హెచ్‌టిఎస్ తిరుగుబాటు మిత్ర దళాలకు చెందిన వారు మరణించారు. అలెప్పో నగరశివారుకు దాదాపు 10 కి.మీ కంటే తక్కువదూరంలోనే ఇడ్లిబ్, అలెప్పో ప్రాంతాలలో సైనికులు, తిరుగుబాటుదారులమధ్య భీకరపోరు జరిగింది. ఇడ్లిబ్ ప్రాంతంలో బుధవారం ఉదయం నుండీ ఎడతెగకుండా పోరు కొనసాగుతూనే ఉందని అంతర్జాతీయ మీడియా తెలియజేసింది. హెచ్‌టిఎస్‌కు అల్‌ఖైదా బ్రాంచ్ మాజీ నాయకులు నాయకత్వం వహిస్తున్నారు.

## ఫిబ్రవరిలో స్థానిక సమరం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిటిసిల సంఖ్యను ఐదుకు పెంచాలని నిర్ణయించింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంపిపి సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. వచ్చే పంచాయితీ ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధనను ప్రభుత్వం ఎత్తివేయనుంది. ఆ మేరకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టనుంది. రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చెప్పారు. దీనికి అనుగుణంగానే కుల గణన కోసం ముందుగా కొత్త బిసి కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతమున్న కమిషన్ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. కొత్త కమిషన్ ఛైర్మన్, సభ్యులపై సిఎం రేవంత్ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. త్వరలో కొత్త కమిషన్‌ను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మీడియాతో చెప్పారు.

**పంచాయతీ ఎన్నికలపై ఊపందుకున్న చర్చ..**

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. కాగా బిసి కమిషన్ ఏర్పాటైన వెంటనే యుద్ధ ప్రాతిపదిక కుల గణన చేపడుతుంది. కుల గణనకు అవసరమైన విధివిధానాలు, నమూనాలు, పద్ధతులు, సర్వే ప్రశ్నలపై ప్రభుత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. ఆయా రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై సమాచారాన్ని కూడా తెప్పించుకున్నారు. బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై అధ్యయనం చేశారు. కుల గణనకు అవసరమైన నిధుల్ని సమకూర్చాలని ఆర్థిక శాఖకు సమాచారాన్ని చేరవేసినట్లు తెలిసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే తలమునకలైంది. గురువారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు.

**15 రోజుల ముందుగా షెడ్యూల్..**

ఎన్నికలకు 15 రోజుల ముందుగా షెడ్యూల్ వెలువడుతుంది. ఈ లెక్కన జనవరి నెల చివరి వరకు రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రాష్ట్రంలో పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేసిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఒకటి రెండు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తే, కాంగ్రెస్‌కు ప్రజల నుంచి సానుకూలత ఉంటుందని, ఆ దిశగా ముందుకెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## ''ధరణి'' పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

స్థాయి అధికారి అర్జీలను పరిశీలించాలని రెవెన్యూ శాఖ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ధరణి' పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ధరణి కమిటీ సిఫారసుల మేరకు ఆర్‌డిఒ,అదనపు కలెక్టర్లకు (రెవెన్యూ) మరిన్ని బాధ్యతలను, అధికారాలను ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి దరఖాస్తులు లక్షకు పైగానే పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారాలను వికేంద్రీకరించారు. దీనికి సంబంధించి సిసిఎల్ఎ నవీన్ మిట్టల్ సర్క్యులర్‌ను జారీ చేశారు. గతంలోనూ ప్రతి దరఖాస్తును ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో స్పష్టం చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఈ సర్క్యులర్ జారీ చేసిన నేపథ్యంలో నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్జీలను తహసీల్దార్ స్థాయి అధికారులు స్వీకరించాలని, అనంతరం ఆర్‌డిఒ స్థాయి అధికారి అర్జీలను పరిశీలించాలని చారు. ఎంఆర్ఒలు, ఆర్‌డిఒలు పంపిన వివరాల ఆధారంగా అర్జీలను అదనపు కలెక్టర్ ఆమోదం, లేదా తిరస్కరించవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సార్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినప్పటికీ దరఖాస్తులు మాత్రం క్లియర్ కాలేదు. ప్రత్యేకంగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రిలోనే ఎక్కువ దరఖాస్తులు పెంఒడింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## అలక్ష్యానికి తావివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సిఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని, అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సిఎం కలెక్టర్లను ఆదేశించారు. పలు మార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లి దండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**సర్వే వివరాలు నమోదు చేయించుకున్న రేవంత్‌రెడ్డి**

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గురువారం సిఎం రేవంత్‌రెడ్డి కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్, అధికారులు నమోదు చేసుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్వే పురోగతిపై వివరాలను సిఎం ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని సిఎం అధికారులను ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వివిఐపిలు, ఐఎఎస్, ఐపిఎస్, ఎంపిలు, ఎంఎల్ఎలు ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సిఎం ఆదేశింశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఖచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేయాలని అధికారులను సిఎం రేవంత్‌రెడ్డి దేశించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు.

## 14వ సిఎంగా హేమంత్ సోరెన్

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, కర్ణాటక డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తమిళనాడు డిప్యూటీ సిఎం ఉదయనిధి స్టాలిన్, ఆర్‌జెడి నేత, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్, సహా తదితర ఇండియా కూటమి నేతలు హాజరయ్యారు. తెల్లటి కుర్తా, పైజామా, నెహ్రూ జాకెట్ ధరించిన సోరెన్ ప్రమాణ స్వీకారానికి ముందు తన తండ్రి శిబు సోరెన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. హేమంత్ సోరెన్ బార్‌హెయిత్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థి గమ్లియెల్ హెంబ్రోమ్‌పై 39,791 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జెఎంఎం నేతృత్వంలోని కూటమి భారీ విజయం సాధించింది. ఈ కూటమి రాష్ట్రంలో 81 స్థానాలలో 56 చోట్ల గెలుపొందగా, బిజెపి కూటమి 24 స్థానాలలో మాత్రమే గెలుపొందిందిఒ. జెఎంఎం 34 చోట్ల విజయం సాధించగా, కాంగ్రెస్ 16 సీట్లు, ఆర్‌జెడి 4 ,సిపిఐ (ఎంఎల్) రెండు సీట్లు సొంతం చేసుకున్నాయి. బిజెపి 21 సీట్లు, ఎజెఎస్‌యుపి, లోక్ జనశక్తిపార్టీ (రాం విలాస్), జెఎల్‌కెఎం, జెడియు ఒక్కో స్థానం చొప్పున గెలుచుకున్నాయి.

సిఎంగా నాలుగోసారి :ఇప్పటి వరకు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన హేమంత్ సోరెన్ గురువారం నాలుగో సారి సిఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఈడీ అధికారులు హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. ఆ తర్వాత సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. ఐదు నెలల అనంతరం జైలు నుంచి విడుదలయిన ఆయన, మళ్లీ ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. తన సతీమణి కల్పనా సోరెన్‌తో కలిసి విస్తృతంగా ప్రచారం చేపట్టి ఘన విజయం సాధించారు.

## మూడో రోజూ తగ్గని విపక్షం

(మొదటి పేజీ తరువాయి)

స్తంభింపజేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుంటూ ఆందోళన చేస్తున్న సభ్యులపై మండిపడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు సభ కార్యకలాపాలను స్తంభింపచేసే ప్రయత్నం చేస్తున్నాయని, దీనిని ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్షాల డిమాండ్లు అయిన వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ కమిటీ పదవీకాలం పొడిగింపు, తగిన అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరిస్తుందని చెప్పారు. అయినా ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ బిర్లా ఒక ప్రశ్నను చేపట్టారు. అయినా ప్రతిపక్షాలు తమ ఆందోళనను ఆపలేదు. దీంతో సభను తొలుత మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఈ తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మరుసటి రోజుకు స్పీకర్ స్థానంలో ఉన్న టిడిపి సభ్యుడు కృష్ణ ప్రసాద్ వాయిదా వేశారు. అంతకు ముందు వక్ఫ్ సవరణ బిల్లుపై వేసిన జాయింట్ కమిటీ గడువును వచ్చే ఏడాది జరిగే బడ్జెట్ సమావేశాలు ముగింపు తేదీ నాటికి పెంచుతూ తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇదిలా ఉండగా, అటు రాజ్యాసభలోనూ అదానీ గ్రూపు, సంభాల ఘటనపై చర్చకు చేపట్టాలని ఇచ్చిన నోటీసులను తిరస్కరించడంతో ప్రతిపక్ష ఎంపిలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ఏజెండా ప్రతులను సభ్యుల ముందు పెట్టిన తరువాత చైర్మన్ జగదీప్ ధనఖర్ మాట్లాడుతూ 267 నిబంధన కింద సభా కార్యకలాపాలను వాయిదా వేయాలని 16 నోటీసుల వచ్చాయని, వాటిని తరస్కరింస్తున్నట్లు ఆయన చెప్పారు. అదానీ గూపుపై వచ్చిన ఆరోపణలపై చర్చించాలని నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ సభ్యులు ప్రమోద్ తివారీ నోటీసు తిరస్కరణపై పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు. అనేక మంది ప్రతిపక్షఎంపిలు కూడా తమ స్థానాల వద్ద నిలబడి ఆందోళనకు దిగగా, చైర్మన్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

## బంగ్లాదేశ్ పరిణామాలపై సిపిఐ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించుకునే ప్రయత్నాలు సాగకుండా పార్టీ కార్యకర్తలను, సానుభూతిపరులు అప్రమత్తంగా వ్యవహరించాలని, తదుపరి దేశంలో ఎలాంటి మతపరమైన ప్రతికూల సంఘటనలూ జరగకుండా చూడాలని కోరింది.'హిందువులను, ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని బంగ్లాదేశ్‌లో ఇటీవల జరుగుతున్న సంఘటనలు, పరిణామాలపట్ల సిపిఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ విధమైన విద్వేష, దాడుల చర్యలు కేవలం లౌకిక, సమానత్వ సూత్రాలను, న్యాయాన్ని ఉల్లంఘించడం మాత్రమేకాదు, బంగ్లాదేశ్ బహుళత్వ సమాజ స్థిరత్వానికి, ఆ దేశంలో మత సామరస్యానికీ తీవ్ర ప్రమాదకరం. దీనికి ఎప్పటికప్పుడు తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంవల్ల సంభవించే ఈ విధమైన పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతలు సృష్టించి సరిహద్దుల్లో ఉన్న దేశంలో కూడా ప్రతికూల ప్రభావాలు పెరగడానికి దారితీస్తాయి, ఈ ప్రాంతంలో శాంతి-స్థిరత్వాలకు తీవ్రమైన హాని కలగజేస్తాయి, బంగ్లాదేశ్-భారతదేశం రెండూ ప్రగతిమార్గంలో ప్రయాణం చేయడానికి మతసామరస్యం చాలా ముఖ్యం అని భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి బలంగా విశ్వసిస్తున్నది. ఈ ఘటనలను అరికట్టేందుకు తక్షణం బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలి. హింసాత్మక చర్యలకు పాల్పడేవారిని న్యాయస్థానం ముందు నిలబెట్టేలా మైనారిటీలకు భరోసా ఇవ్వాలి'' అని ఆ ప్రకటనలో సిపిఐ జాతీయ సమితి కోరింది. అదేవిధంగా మనదేశంలో అధికారపార్టీగానీ లేదా ఇతర మతోన్మాద శక్తులుగానీ ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు చేయకుండా ప్రగతిశీల, లౌకిక శక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలని కూడా పిలుపు ఇచ్చింది. పార్టీ సానుభూతిపరులు, పార్టీ సభ్యులు ఇలాంటి ఘటనలు రేకెత్తకుండా నివారించేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరింది.

## పోలీసు వ్యవస్థ బలోపేతానికి..

# 'తెలంగాణ పోలీసు అకాడమీ' మార్గదర్శకం

బిరుదరాజు వాసుదేవరాజు

అత్యుత్తమ శిక్షణా సంస్థ 'తెలంగాణ పోలీసు అకాడమీ'
రాష్ట్ర ఆవిర్భావం నుంచి 47,612 మందికి శిక్షణ
'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో మొదటి మహిళా డైరెక్టర్, డిజిపి అభిలాష బిస్త్



బహుళ అంతస్థుల భవనం నిలబడాలంటే పునాది ఎంత గట్టిగా ఉండాలో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బలంగా ఉండాలంటే తాము ఇక్కడ ఇచ్చే శిక్షణ పైనే ఆధారపడి ఉంటుంది. సమాజంలో వస్తున్న కొత్తకొత్త నేరాలకు అనుగుణంగా పోలీసు శాఖను కూడా అప్రమత్తం చేసుకుంటూ ఆ దిశగా అకాడమీలో కొత్త ఒరవడితో శిక్షణ అందిస్తున్నాము. పోలీసు వ్యవస్థ బలోపేతం ద్వారానే రాష్ట్రం అభివృద్ధికి మార్గం. రంగారెడ్డి జిల్లా మంచిరేవుల సమీపంలో ఉన్న రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ (ఆర్‌బివిఆర్‌టిజిపిఎ) ఐదు స్టార్‌ల రేటింగ్ రావడం తెలంగాణ ప్రభుత్వానికే గర్వకారణమని అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ పేర్కొన్నారు. ప్రస్తుతం అకాడమీలో తనతో పాటు డిప్యూటీ డైరెక్టర్లు సునీతా మోహన్, నర్మద, వెంకటేశ్వర్లు, మురళీధర్, శ్రీరామమూర్తిలు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అకాడమీకి డైరెక్టర్‌గా కొనసాగుతున్న తొలి మహిళా ఐపిఎస్ అధికారి అభిలాష్ బిస్త్ (డిజిపి)తో ప్రజాపక్షం ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

**ప్రశ్న: అకాడమీలో ఎవరెవరికి శిక్షణ ఇస్తారు ?**

**అభిలాష్ బిస్త్ :** కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు(ఎస్ఐ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డిఎస్‌పి), ప్రొబేషనర్ ఐపిఎస్‌లు, పదోన్నతులు పొందిన బ్యాచ్‌లకు, కస్టమ్స్ అధికారులు, సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు, ఫారెస్ట్, ఎఎంవిఐలకు శిక్షణ ఇస్తాము.

**ప్రశ్న: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎంత మందికి శిక్షణ ఇచ్చారు?**

**అభిలాష్ బిస్త్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లుగా విభజించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని షెడ్యూల్ 10లో ఈ అకాడమీ జాబితా చేయబడి, ఆ తర్వాత రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీగా పేరు మార్చబడింది. తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు వివిధ హోదాలు కలిగిన 47,612 మందికి పూర్తి స్థాయి శిక్షణ అందించాము.

**ప్రశ్న: అకాడమీ అభివృద్ధి, శిక్షణా అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఏమిటి ?**

**అభిలాష్ బిస్త్ :** మే 19, 1986 నాడు అప్పటి సిఎం ఎన్‌టిఆర్ ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీకి శంకుస్థాపన చేశారు. ఐపిఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి ఈ అకాడమీ ఏర్పాటుకు కృషిచేశారు. ఐపిఎస్ అధికారులు ఎ.వి సుబ్బారావు, హెచ్.జె దొర, ఎం.వి.కృష్ణారావు, జస్పాల్ సింగ్, ఎ.కె.మొహంతి, ఎం.రతన్, సి.ఎన్.గోపినాథరెడ్డి, నండూరి సాంబశివరావు, డాక్టర్ ఎం.మాలకొండయ్య ఈ అకాడమీకి సేవలు అందించారు. 148.20ఎకరాలు విస్తరించి ఉన్న అకాడమీలో శిక్షణా అభ్యర్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాము. 24మంది డైరెక్టర్లు అకాడమీలో పనిచేశారు. శిక్షణ షెడ్యూల్ ఇన్‌డోర్, అవుట్‌డోర్ భాగాలను మిళితం చేస్తుంది. శిక్షణ పొందిన వారికి వసతి, మెస్, అత్యవసర పరిస్థితుల కోసం వైద్య సదుపాయాలు ప్రత్యేక ఆసుపత్రి, లైబ్రరీ, పరిశోధనా కేంద్రం, ఇంటర్నేషనల్ ఆఫీసర్స్ మెస్, ఆడిటోరియం, బ్యాంకు, రవాణా, వెల్ఫేర్ స్టోర్, స్టేడియం, అథ్లెటిక్ ట్రాక్, పరేడ్ మైదానాలు, వ్యాయామశాల, క్రీడలు, స్విమ్మింగ్‌పూల్, ఆటలు, వినోద ప్రదేశాలు, స్టడీ మెటీరియల్స్, శిక్షణకు అవసరమైన ఇతర వనరులు అందించబడతాయి. తెలంగాణ పోలీస్ అకాడమీ 'బెంచ్‌మార్క్' శిక్షణా సంస్థగా కూడా గుర్తింపు పొందింది.

**ప్రశ్న: ఇతర అకాడమీలకు మన అకాడమీకి వ్యత్యాసం?**

**అభిలాష్ బిస్త్ :** దేశంలోనే అన్ని పోలీసు అకాడమీలకంటే తెలంగాణ పోలీసు అకాడమీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ అకాడమీ మూడుసార్లు ఉత్తమ శిక్షణా సంస్థగా కేంద్ర హోంమంత్రి ట్రోఫీని కైవసం చేసుకోవడం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో మెస్ సౌకర్యాలు, ఆడిటోరియం, అవుట్‌డోర్ యాక్టివిటీస్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, పరేడ్ గ్రౌండ్స్, స్విమ్మింగ్ పూల్ పరంగా అకాడమీ స్థాయికి భిన్నంగా ఉంటుంది. ఇటీవలే భారతదేశంలో ప్రతిష్టాత్మకమైన 5స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ కూడా లభించడం గర్వకారణం. దీంతో పాటు ఐఎస్ఒ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్, ఎన్విరాన్మెంటల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్‌లలో కూడా సర్టిఫికెట్ ప్రదానం చేసింది. దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ పోలీసు అకాడమీ నిలిచింది. భారతదేశంలో ఒక మోడల్ సంస్థగా దాని స్థానాన్ని పునరుద్ఘాటించాయి. ఇది ప్రభుత్వం, అధికారులు, సిబ్బంది కృషి కారణంగా జరిగింది.

**ప్రశ్న: మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల అధికారులు, సిబ్బందికి సైతం శిక్షణ ఇస్తారా?**

**అభిలాష్ బిస్త్ :** అవును ఇస్తాము. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, త్రిపుర, బీహార్, జార్ఖండ్, లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు భారతదేశం అంతటా శిక్షణ పొందిన వారికి ఈ అకాడమీలో వృత్తిపరమైన శిక్షణ అందిస్తున్నాము.

**ప్రశ్న: అభ్యర్థులకు ఎలాంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తారు ?**

**అభిలాష్ బిస్త్:** ఇండక్షన్ కోర్సు ప్రాథమిక కోర్సులు, ప్రీప్రమోషన్ కోర్సులు, ఓరియంటేషన్ కోర్సు ఉంటాయి. అలాగే ఇన్‌సర్వీస్ కోర్సుల్లో ఇన్వెస్టిగేషన్లో మొదటి కోర్సు, స్టేషన్ హౌస్ నిర్వహణ, పోలీసు అధికారులకు అవసరమైన చట్టం, ఫోరెన్సిక్ సైన్స్ ఫోరెన్సిక్ మెడిసిన్లో మొదటి కోర్సులు అందిస్తాము

**ప్రశ్న: ఫ్యాకల్టీ విభాగాలు..?**

**అభిలాష్ బిస్త్ :** పోలీస్ సైన్స్, లా, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్ టాక్సికాలజీ, కంప్యూటర్ల నిర్వహణ.

**ప్రశ్న: అకాడమీలో అదనపు ఆకర్షణలు ?**

**అభిలాష్ బిస్త్ :** ఇక్కడ డాక్టర్ హాంకిన్స్ తెలంగాణ పోలీస్ మ్యూజియం ఉంది. నిజాం రాష్ట్రం సమయంలో నిజాం 1880లో పోలీసు మొదటి ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేసిన హాంకిన్స్ డాక్టర్ పేరు మీదుగా దీనికి పేరు పెట్టబడింది.

**అలాగే గ్యాలరీలు..**

ఎడ్జ్ ఆరమ్స్ గ్యాలరీ,ఫైర్ ఆరమ్స్ గ్యాలరీ, పోలీసు గ్యాలరీ,ఫోరెన్సిక్ గ్యాలరీ,కమ్యూనికేషన్ గ్యాలరీతో పాటు ఈ మ్యూజియంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుకు చెందిన జుల్ఫికర్ ఖడ్గం కూడా ఉంది.

# దిలావర్ పూర్‌లో రైతులతో చర్చకు వస్తారా?

కెటిఆర్‌కు మంత్రి సీతక్క సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దిలావర్ పూర్‌లో రైతులతో చర్చకు వస్తారా? అని కెటిఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. దిలావర్ పూర్‌లో ఇథనాల్ పరిశ్రమకు అన్ని అనుమతులు కెసిఆర్, కెటిఆర్ ఇచ్చారని మంత్రి సీతక్క తెలిపారు. దిలావర్ పూర్‌లో ఇథనాల్ కంపెనీకి అనుమతులు గత ప్రభుత్వంలో ఇచ్చి తమను (కాంగ్రెస్ ప్రభుత్వాన్ని) బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చిల్లర, కుళ్లు రాజకీయాలు బిఆర్‌ఎస్ చేస్తుందని మండిపడ్డారు. తప్పులు చేసింది మీరే( బిఆర్‌ఎస్), విధ్వంసం చేసింది మీరే, ప్రజలకు రెచ్చగొట్టేది మీరేనంటూ బిఆర్‌ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనుమతులిచ్చే సమయానికి ఇథనాల్ కంపెనీ డైరెక్టర్‌గా తలసాని సాయి కిరణ్ ఉన్నారన్నారు. ఆ కంపెనీ మరో డైరెక్టర్‌గా పుట్టా సుధాకర్ కుమారుడు ఉన్నారని, పుట్టా సుధాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకులని సీతక్క వెల్లడించారు. తాము ఎక్కడ కంపెనీలు పెట్టినా గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో గ్రామసభ నిర్వహించకుండానే అనుమతులిచ్చారన్నారు. గ్రామ సభలు నిర్వహించకుండా ఎలా కంపెనీలకు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ నాయకులు తప్పు చేసి రెచ్చగొట్టి విధ్వంసాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే కెటిఆర్ దిలావర్‌పూర్ రావాలన్నారు. కంపెనీకి అనుమతులు ఎవరిచ్చారనేది అక్కడే తేలుస్తామన్నారు. ఇథనాల్ కంపెనీకి 2022 నుంచి బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు ఇచ్చిందన్నారు. ఆనాటి బిఆర్‌ఎస్ సర్కారు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ధర్నాలు చేస్తుంటే దాన్ని నిస్సిగ్గుగా ఎక్స్‌లో పోస్టులు పెట్టి మమ్మల్ని (కాంగ్రెస్ ప్రభుత్వాన్ని) బద్నాం చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని, అప్పటి సిఎం కెసిఆర్ సంతకాలను అన్నింటినీ సమన్వయం చేసి పరిశ్రమకు సంపూర్ణమైన అనుమతులు ఇప్పించింది కెటిఆర్ అన్నారు. ఈ పర్మిషన్లు వచ్చే నాటికి ఆ కంపెనీ డైరెక్టర్‌గా తలసాని సాయికిరణ్ ఉన్నారన్నారు. దాదాపు 10 మంది డైరెక్టర్‌లతో ఆ సంస్థ ఉందన్నారు. కడప జిల్లాకు చెందిన పుట్టా సుధాకర్ కుమారుడు ఇందులో డైరెక్టర్ అని తెలిపారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చపెట్టి స్పీకర్ ముందు అన్ని అధారాలు ఉంచి చర్చ ఏర్పాటు చేస్తామన్నారు.

### నా కుటుంబానికి సంబంధం లేదు

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

ఇథనాల్ కంపెనీతో తమ కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇథనాల్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని స్పష్టం చేశారు. తామే ఆ కంపెనీని ఏర్పాటు చేస్తే, తామే రైతులను రెచ్చగొడుతామా? అని ప్రశ్నించారు. ఇథనాల్ కంపెనీ విషయంలో తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాజమండ్రిలో నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో తన కుమారుడు కంపెనీని ఏర్పాటు చేయాలని అనుకున్న మాట వాస్తవమేనని, కానీ మూడు నెలలకే ఆ కంపెనీ డైరెక్టర్ పదవికి సాయి కిరణ్ యాదవ్ రాజీనామా చేశారని తలసాని వివరించారు. ప్రజల సమస్యను పరిష్కరించకుండా కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, తనను, బిఆర్‌ఎస్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని సూచించారు. తన కుటుంబంపైన పిసిసి అధ్యక్షుడు, మంత్రి సీతక్క, ఎంపి చామల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

# 'బన్యన్ నేషన్' నుండి రూ.200 కోట్ల పెట్టుబడులు

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమతో సర్క్యులర్ ఎకానమీ (వృత్తాకార ఆర్థిక వ్యవస్థ)కి తోడ్పడుతున్న అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటి, పరిశ్రమలశాఖ మంతి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సచివాలయంలో సంస్థ ప్రతినిధులు గురువారం తనను కలిసిన అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం పటాన్‌చెరువు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోంది. దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న 'బన్యన్ నేషన్' లాభాల్లో నడుస్తోందని చెప్పారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టిజిఐఐసి నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటి సలహాదారు సాయికృష్ణ, టిజిఐఐసి సిఇఓ వి. మధుసూదన్, బన్యన్ నేషన్ సిఇఓ మణివాజిపేయ్, సిఓఓ రాజ్ కిరణ్ మదనగోపాల్ లు పాల్గొన్నారు.





## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన ట్రైనీ ఐపిఎస్ అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధుల నిర్వహణలో నిజాయితీ, అంకితభావం, నిక్కచ్చితో వ్యవహరించాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శిక్షణ పూర్తిచేసుకున్న ఐపిఎస్ అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ ఆఫీసర్ ట్రైనీలు గురువారం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపిఎస్‌లను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ ప్రజలతో అధికారులు బలమైన అనుబంధాన్ని పెంపొందించుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రజలతో మమేకం కావడం ద్వారా వారి ఆందోళనలను అర్థం చేసుకోవడం అవసరమన్నారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండటమే సమర్థవంతమైన పాలనకు మూలాధారమని గవర్నర్ అన్నారు. పోలీసింగ్, ప్రభుత్వ పరిపాలనలో ఆవిష్కరణలు, వృద్ధికి అపారమైన అవకాశాలను గవర్నర్ వివరించారు. తెలంగాణకు కేటాయించిన శిక్షణ పొందిన ఐపిఎస్ అధికారులకు గవర్నర్ అభినందనలు తెలిపారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నా సిఎంకి సమీక్ష చేసే సమయం లేదా? : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకులాలు, ఆదర్శపాఠశాలలలు, హాస్టళ్లలో ఉంటూ బడుల్లో పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులు పాలకులు అలసత్వం, అధికారులు అవినీతి కారణంగా కలుషిత ఆహారం కారణంగా తీవ్ర అనారోగ్యం బారినపడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం దారుణమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు విమర్శించారు. తరుచు ఫుడ్ పాయిజాన్ ఘటనలు చోటు చేసుకుంటుండడంతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రజాప్రతినిధులు కనీసం వారిని పరామర్శించకుండా విద్యార్థుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'పోటు' మరణం రాజకీయాలకు తీరని లోటు





**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం ఖమ్మం జిల్లా రాజకీయాలకు ప్రత్యేకించి ప్రగతిశీల రాజకీయాలకు తీరని లోటని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మమత ఆసుపత్రిలో అజయ్‌కుమార్ సతీమణి వసంతలక్ష్మితో కలిసి పోటు ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటు ప్రసాద్ అభ్యుదయ భావాలతో ఖమ్మం జిల్లా రాజకీయాలలో ఒక చెరగని ముద్ర వేశారని, నిస్వార్థంతో జీవిత కాలం రాజకీయాలు నడిపిన ఆయన సమకాలీన రాజకీయాల్లో ఆదర్శవంతుడన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కమ్యూనిస్టు శ్రేణులు ప్రసాద్ మరణం తర్వాత మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. పువ్వాడ అజయ్‌కుమార్ వెంట సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె జానిమియా, పోటు ప్రసాద్ సోదరి పోటు కళావతి, పలువురు కుటుంబ సభ్యులు ఉన్నారు. పోటు ప్రసాద్‌కు సిపిఐ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు, ప్రముఖ విశ్లేషకులు దేవభక్తుని పాపారావు నివాళులర్పించారు. ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం ప్రసాద్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**బిఆర్‌ఎస్ నేతల పరామర్శ :**

బిఆర్‌ఎస్ రాష్ట్ర నేత, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు గురువారం పోటు ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సతీమణి నిర్మల, తల్లి సక్కుబాయి పోటు ప్రసాద్ సోదరుడు, సోదరీమణులను ఓదార్చారు. మనోధైర్యంతో ఉండాలని కోరారు.

**ఐఎఎల్ ఆధ్వర్యంలో :**

ఐఎఎల్ ఆధ్వర్యంలో పోటు ప్రసాద్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోటు ప్రసాద్‌తో అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశలోనూ, ట్రేడ్ యూనియన్ రంగంలోనూ ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ బాధ్యునిగా పోటు ప్రసాద్ చేసిన కృషి అజరామరమన్నారు. ఆయన మృతి ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు పార్టీకే కాదు రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ప్రసాద్ కుటుంబం మనోధైర్యంతో ముందుకు సాగాలని కమ్యూనిస్టు శ్రేణులు సైతం ప్రసాద్ ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని ప్రభాకర్ కోరారు. నివాళులర్పించిన వారిలో ఐఎఎల్ నాయకులు కెవిఎల్, కదారు ప్రభాకర్ రావు, ఓరుగంటి శేషగిరి, షేక్ లతీఫ్, బొమ్మగాని శ్రీనివాస్, పెమ్మసాని పట్టాభి, నస్రీన్, సతీష్, శివ కుమారి, మధు, వెంకటరెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

### 'నేడు' పోటు ప్రసాద్ సంతాప సభ



దివంగత సిపిఐ నేత, కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా ఉద్యమ సారధి పోటు ప్రసాద్ సంతాప సభ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రసాద్ మృతదేహన్ని పార్టీ కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారని సురేష్ తెలిపారు. సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సహ సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొంటారన్నారు. 11 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డు ఎన్‌టిఆర్ సర్కిల్, ఐటి హబ్ సెంటర్, మమత రోడ్డు మీదుగా అంతిమ యాత్ర మమత ఆసుపత్రికి చేరుకుంటుందని సురేష్ తెలిపారు. ప్రసాద్ మృతదేహన్ని కుటుంబ సభ్యులు వైద్య పరీక్షల నిమిత్తం మమత ఆసుపత్రికి బహూకరించారన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు, ప్రసాద్ అభిమానులు పాల్గొని ప్రసాద్‌కు కడసారి నివాళులర్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.





## ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు తోడు నిత్యం పనిఒత్తిడి కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం జరిగింది. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నూతన నిర్వహణ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ కన్వీనర్‌గా వాణి రమావత్, కో కన్వీనర్లుగా ఎన్.కవిత, కె.రజిని, సభ్యులుగా సరళ, అశ్విని, జ్యోతి, సరస్వతిలు ఎన్నికయ్యారు.


తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా
ఫారం - VII

రూఢి ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసిడింగ్స్ నెం. తేది. . .2024
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం. B1/50/2023 తేది. . .2024
జిల్లా రాజ పత్రం నెం. /2024

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము గల సంగాల గ్రామము విస్తీర్ణము ఎ. 1.80 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా Additional land acquisition for Surplus Course of Sangala Balancing Reservoir under Package No.101 నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.

కావున జోగులాంబగద్వాల జిల్లా, గద్వాల మండలము గల సంగాల గ్రామము విస్తీర్ణము ఎ. 1.80 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

| క్ర. సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | చెట్లు రకం / సంఖ్య కట్టడం రకం/ విస్తీర్ణం చ.గజాలలో |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 183 | పట్టా | మెట్ట | 1.80 | 1) వాకిటి తిములమ్మ భర్త సవారన్న 2) వాకిటి శేషమ్మ భర్త వాకిటి నారాయణ 3) వాకిటి పెద్ద భీమన్న తండ్రి నారాయణ 4) చిన్న భీముడు తండ్రి దాసరి నారాయణ 5) వాకిటి ఆంజనేయులు తండ్రి వాకిటి నారాయణ అనుభవదారులు 1) వాకిటి తిములమ్మ భర్త వాకిటి సవారన్న 2) వాకిటి శేషమ్మ భర్త నారాయణ 3) ఆంజనేయులు తండ్రి నారాయణ 4) పెద్ద భీమన్న తండ్రి నారాయణ 5) చిన్న భీమన్న తండ్రి నారాయణ | లేవు |
| మొత్తం విస్తీర్ణము | | | | 1.80 | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

భూసేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోతమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరు. జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) జోగులాంబ గద్వాల జిల్లా
సం/- జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO. 398/LA/PP/Advt/Pub/2024-25




# త్వరలో రైతులందరికీ రైతు భరోసా

*డిసెంబర్ 7 సిఎం చేతుల మీదుగా బ్రాహ్మణ వెల్లంల డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, మెడికల్ కళాశాలలో ప్రారంభోత్సవం

*జిల్లాలో మిగిలిపోయిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** కెసిఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని ఏడు లక్షల కోట్లు అప్పు చేసి ఫామ్ హౌస్‌లో పండుకున్నాడని, బిఆర్‌ఎస్‌లో ప్రతిపక్ష నాయకుడు ఎవరో చెప్తే వారు మాట్లాడితే తాను సమాధానం చెప్తానని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అల్లుడు హరీష్‌రావు, కొడుకు కెటిఆర్ గురుకులాల గురించి మాట్లాడితే తాను సమాధానం చెప్పనని, వాళ్లు నా స్థాయి కాదన్నారు. దమ్ముంటే కెసిఆర్ వచ్చి మాట్లాడాలని అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా గురువారం నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని అన్నారు. కెసిఆర్ తెలంగాణను అప్పులపాలు చేయగా వాటిని భరిస్తూ పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుంటే మోడీ విమర్శించడం శోచనీయమన్నారు. త్వరలో రైతులందరికీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాలో జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా త్వరలో రైతు సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ 7న బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, నల్లగొండలోని మెడికల్ కళాశాలకు సిఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎన్జీ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. నల్లగొండ పట్టణంలో రూ.110 కోట్లతో స్పెషల్ డెవలప్‌మెంట్ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తోపాటు పలు అభివృద్ధి పనులు, రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన, రూ.275 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు అన్నిటినీ కూడా పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. మూసీతో ఎక్కువ నష్టపోయేది, అనారోగ్యం పాలయ్యేది నల్లగొండ జిల్లా ప్రజలేనని అన్నారు. మూసీ ప్రక్షాళనతో న్యాయం జరుగుతుందన్నారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగ మార్గానికి సంబంధించి రెండు మిషన్లు త్వరలో జిల్లాకు చేరుకుంటాయని, 20 నెలల్లోనే సొరంగ మార్గాన్ని పూర్తిచేస్తామని అన్నారు. దీంతో ఎంత ఖర్చు లేకుండా నీళ్లు వస్తాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బుగోని రమేష్ గౌడ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ జెడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సౌత్ జోన్.

NIT.No. 06/SE(P)SZ/GHMC/2024-25, 2nd Call 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 27.11.2024

పని పేరు: కిషన్‌బాగ్ నాలా-2పై కల్వర్ట్ నిర్మాణం @4288 ch. బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం / డౌన్‌లోడ్ ప్రారంభ తేది : డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 02.12.2024న మ.12.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 09.12.2024న మ.02.30 గం.ల వరకు. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నం.: సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) కార్యాలయం, సౌత్ జోన్. జిహెచ్‌ఎంసి. సెల్: 7337364207. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సౌత్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 7214-PP/CL/ADVT/1/2024-25, Date: 28-11-2024

ఫోకస్

# వ్యవసాయం



## ఎంఎస్‌పిపై దాగుడుమూతలు

పంటలకు,ప్రత్యేకించి ధాన్యానికి కనీస మద్దతుధర (ఎంఎస్‌పి) అంశంలో కేంద్ర ప్రభుత్వం ఇటదేశంలో, అటు అంతర్జాతీయ విప ణిలో దాగుడుమూతలు ఆడుతున్నది. ఎంఎస్‌పిపై వాస్తవాలను దాస్తున్నదని, తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నదని ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్/ డబ్ల్యుటిఒ) వేదికగా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, అర్జెంటీనా, ఉ క్రేన్ దేశాలు ఆరోపించాయి. నవంబర్ 11న అధికారికంగా ఒక ప్రకటనను కూడా విడుదల చేశాయి. అయితే, 26వ తేదీనాటి కౌంటర్‌లో భారత్ ఈ అరోపణలను తోసిపుచ్చింది. ఎంఎస్‌పిపై పారదర్శకతను పాటిస్తున్నామని వాదించింది. అయితే, భారత్ వివరణను ఆరోపణ ప త్రాన్ని విడుదల చేసిన దేశాలు అంగీకరించడం లేదు.




డబ్ల్యుటిఒ నిర్ణయాల ప్రకారం, ఉత్పత్తి పూర్తి విలువ (విఒపి)లో 10 శాతానికి మా త్రమే మద్దతు ధర లేదా ఇతరత్రా సహాయాన్ని అందించాలి. అంతర్జాతీయంగా అన్ని దేశాల్లో ఆహార భద్రతను కల్పించడానికి ఈ చర్యలు దోహదపడతాయి. కాగా, ధాన్యం విలువలో 67–75 శాతం ఎంఎస్‌పిగా చెల్లిస్తున్నట్టు భారత ప్రభుత్వం లిఖితపూర్వక సమాచారాన్ని ఇచ్చిం ది. అయితే, 87 శాతం వరకూ ఉత్పత్తులకు దీనిని వర్తింప చేస్తున్నది. ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలంటూ రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు. ఈనెల 26న రైతులు, కార్మికులు దేశ వ్యాప్త నిరసనలు చేపట్టగా, అదేరోజు డబ్ల్యుటిఒలో వివిధ దేశాలు చేసి న ఆరోపణలను కొట్టివేస్తూ భారత్ కౌంటర్‌ను దాఖలు చేయడం గమనార్హం. దేశంలో ఎంఎస్‌పి ని పెంచడమే గాక, విధివిధానాలను ఖరారు చే యాలని రైతులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పికి చట్టబద్ధతపై లిఖితపూర్వంగా హామి ఇచ్చి రెండేళ్లు గడిచినా, ఇప్పటి వరకూ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని సేకరిస్తున్నది. ఫలితంగా, గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమతమ ఉత్పత్తులను ప్రైవేటు డీలర్లకు అమ్ముకోవాల్సి వస్తున్నది.

## ఎగుమతులకు ప్రోత్సాహం..



బియ్యం ఎగుమతులకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఏర్పడింది. ఉడకపెట్టిన బియ్యం (పార్‌బాయిల్డ్ రైస్)పై ఎగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) తాజా నోటిఫికేషన్ ప్రకారం, బాస్మతీయేతర వైట్ రైస్ విదేశీ షిప్మెంట్లపై టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధర (ఎంఇపి)ను రద్దు చేసింది. ఈ నిర్ణయం తక్షణమలే అమల్లోకి వచ్చింది. కాగా, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తుది అంచనాల ప్రకారం, గత ఏడాది జులై నుండి ఈ ఏడాది జూన్ వరకు జరిగే 2023–24 వ్యవసాయ సంవత్సరంలో భారతదేశం రికార్డు స్థాయిలో 332.29 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తిని సాధించనుంది. ఇది గత సంవత్సరం మొత్తం 329.68 మెట్రిక్ టన్నుల నుండి 2.61 మెట్రిక్ టన్నుల పెరుగుదలను సూచిస్తుంది. వరి, గోధుమలు మరియు మినుములు వంటి కీలక కేటగిరీలలో ఉత్పత్తి అనుకూలించడమే ఈ వృద్ధికి కారణం. 2023–24లో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో 137.83 మిలియన్ టన్నులు, అంతకుముందు సంవత్సరం 135.76 మిలియన్ టన్నుల నుండి 2.07 మిలియన్ మెట్రిక్ టన్నులు (1.52 శాతం) పెరిగింది. గోధుమ ఉత్పత్తి కూడా 2022–23లో 110.55 మిలియన్ టన్నుల నుండి 2.74 మిలియన్ మెట్రిక్ టన్నుల్లు (2.48 శాతం) పెరిగి 113.29 మిలియన్ మెట్రిక్ టన్నులు వద్ద కొత్త గరిష్ట స్థాయిని అందుకుంది. బాస్మతీయేతర బియ్యంపై ఎగుమతులపై విధించిన ఆంక్షలను ఈ ఏడాది సెప్టెంబర్ మాసంలో ఎత్తివేసిన ప్రభుత్వం ఇప్పుడు పార్‌బాయిల్డ్ రైస్ ఎగుమతి సుంకాన్ని రద్దు చేయడం గమనార్హం. ఈ చర్యలతో బియ్యం ఎగుమతులు జోరందుకునే అవకాశాలు ఉన్నాయి.

దేశ వ్యాప్తంగా మార్కెట్లలోకి కందులు వస్తున్నాయి. కందుల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్, కర్నాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ ముందు వరుసలో నిలుస్తున్నాయి. గత ఏడాది దేశ వ్యాప్తంగా 3.6 మిలియన్ మెట్రిక్ టన్నుల కందులు ఉత్పత్తి జరిగింది. అయితే, అంతకు ముందు సంవత్స రంతో పోలిస్తే అది 19 శాతం తక్కువ. ఈసారి కందుల ఉత్పత్తి ఆశాజనంగానే ఉంటుందని అంటున్నారు.



# పర్యావరణం



## కాలుష్య కోరల్లో సట్లెజ్ నది

ఎంతో చారిత్రక ప్రధాన్యం ఉన్న సట్లెజ్ నది కాలుష్యం కోరల్లో చిక్కుకొని అల్లాడుతుంది. రాజస్థాన్ జిల్లాలోని శ్రీగంగానగర్ జిల్లా వాసులు సెట్లెజ్ నది కాలుష్యమయంకావడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది. పొరుగున ఉన్న పంజాబ్‌లోని కర్మాగారాల నుంచి రసాయన వ్యర్థాలు వచ్చిచేరడం వల్ల ఈ నదిది కాలుష్య బెడద పెరిగిందని శ్రీగంగానగర్ ప్రాంత ప్రజల ఆరోపణ. సింధు నది ఐదు ఉపనదుల్లోకి పొడవైనది సట్లెజ్. దీనిని 'సతద్రీ' అని కూడా అంటారు. వింధ్య శ్రేణికి ఉత్తరాన , పాకిస్తాన్ సెంట్రల్ మక్రాన్ శ్రేణికి తూర్పున, హిందూ కుష్ ప్రాంతానికి దక్షిణంగా సట్లెజ్ ఉంది. ఇది నైరుతి టిబెట్లోని రక్షస్తాల్ సరస్సులో హిమాలయాల ఉత్తర వాలుపై 15,000 అడుగుల (4,600 మీటర్లు) ఎత్తులో ఉంటుంది. ఎత్తైన టిబెటన్ పీఠభూమిలో ఉద్భవించే మూడు హిమాలయ నదులలో ఇది ఒకటి, ఇది శక్తివంతమైన హిమాలయ శ్రేణులను దాటుతుంది . మిగిలిన రెండు నదుల్లో ఒకటి సింధుకాగా, మరొకటి బ్రహ్మపుత్ర. సట్లెజ్ 6,608 మీటర్ల ఎత్తులో హిమాచల్ ప్రదేశ్‌లోని షిప్కి లా పాస్ మీదుగా, పశ్చిమ, నైరుతి దిశగా ప్రవహించి, భారతదేశంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం నంగల్ దగ్గర పంజాబ్ చేరుకొని బియాస్ నదిని కలుస్తుంది. ఈ రెండు నదుల కలయిక భారత్–పాకిస్థాన్ సరిహద్దులో 105 కిలోమీటర్ల వరకూ ఉంటుంది. ఈ నది చీనాబ్ నదిలో కలిపే ముందు మరో 350 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తూనే ఉంది. సట్లెజ్, చీనాబ్ నదుల కలయిక ద్వారా పంజాబ్ ప్రాంతం ఏర్పడింది. సింధు నదిలోకి ప్రవహించే ఈ నది పొడవు 1550 కిలోమీటర్లు. ఇందులో 529 కిలోమీటర్లు పాకిస్థాన్‌లో ఉంది. సట్లెజ్ ఎక్కువగా హిమాలయాల్లో వసంత రుతువు, వేసవి మంచు కరగడం, దక్షిణాసియా రుతుపవనాలపై ఆధారపడి ఉంటుంది. ఉపనదుల్లో బస్పా, స్పితి, నోగ్లీ ఖాడ్, సోన్ ప్రధానమైనవి. 1960 సింధు జలాల ఒప్పందం ప్రకారం సట్లెజ్ నది నుండి నీటిని భారతదేశానికి కేటాయించారు. సట్లెజ్‌పై 1,000 మెగావాట్ల భాక్రానంగల్ డ్యామ్, 1,000 మెగావాట్ల కర్చామ్ వాంగ్టూ జలవిద్యుత్ ప్లాంట్, 1,530 మెగావాట్ల నాత్పా ఝక్రి డ్యామ్‌తోసహా అనేక ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. సింధు జలాల ఒప్పందం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కుదిరింది. అప్పటి భారత ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఆ ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వం వహించి, సంతకం చేసింది. దీని ప్రకారం సింధుతోపాటు దాని ఉపనదులు సట్లెజ్, బియాస్, రావి, జీలం, చీనాబ్, నీటిని రెండు దేశాల మధ్య సమానంగా విభజించాలి. మూడు తూర్పు నదుల నుండి, బియాస్, రావి, సట్లెజ్ నుండి నీరు భారతదేశానికి, మూడు పశ్చిమ నదుల నుండి చీనాబ్, సింధు, జీలం నుండి నీరు పాకిస్తాన్‌కు కేటాయించారు. ఈ ఒప్పందం సక్రమంగా అమలు చేయడం లేదని ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలకు దిగడం ఆనవాయితీగా మారింది. తాజాగా రెండు దేశాలు తాత్కాలికంగా ఒక అవగాహనకు వచ్చినప్పకీ, శాశ్వత పరిష్కారం అసాధ్యంగా మారింది. దీనికితోడు నదుల కాలుష్యమయం కావడం ఆందోళన కలిగిస్తోంది.



## ప్రకృతే చర్య తీసుకుంటున్నదా?



అధిక జనాభా పర్యవసానాలు పేర్కొంటూ, ఒకవేళ నియంత్రణకు మనిషి సుముఖత వ్యక్తం చేయకపోతే, ప్రకృతే చర్య తీసుకుం టుందని మాల్థస్ అంటాడు. ఈ సిద్ధాంతంపై సానుకూల, వ్యతిరేక వాదానలు ఉన్నాయి. అయితే, మాల్థస్ సిద్ధాంతం జనాభా పెరుగుదలకు ఎంత వరకూ వర్తిస్తుందో చెప్పలేంగానీ, పెరుగుతున్న కాలుష్యానికి తప్పకుండా వరిస్తుందని ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న అనేకానేక పరిణామాలు, సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. అకాల వర్షాలు... ఆకస్మిక వరదలు.. భూకంపాలు.. అంతం లేకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. జల, వాయు కాలుష్యం.. ఇలా, ఎన్నో రకాలుగా భూగోళం సమస్యలు ఎదుర్కొంటున్నది. వీటి బారిన పడి వేలాది మం ది ప్రాణాలు కోల్పోతున్నారు. మెక్సికోలో కొండ చెరియలు విరిగిపడడంతోపాటు, ఆకస్మిక వరదలు కూడా పోటెత్తడంతో కొన్ని గ్రామాల ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకు పోయాయంటే, విలయం ఏ స్థాయిలో కొనసాగిందో ఊహించుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు, ప్రధానంగా అభివృద్ధి చెందిన దేశాలు చేస్తున్న కృషి శూన్యమనే చెప్పాలి. గాలిలో కర్బనం (కార్బన్‌డైయాక్సైడ్) శాతం ప్రమాదకర స్థాయికి చేరుతున్నది. ఇప్పటికే లాహోర్, న్యూఢిల్లీ వంటి ఎన్నో నగరాలు వాయు కాలుష్యంతో అల్లాడుతున్నాయి. 1990 సంవత్సరంతో పోలిస్తే గాలిలో కర్బన వాటా 59 నుంచి 64 శాతానికి పెరిగింది. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల వల్ల ఎక్కువగా కర్బనం గాల్లోకి విడుదలవుతున్నది. విద్యుత్ ఉత్పాదనలో బొగ్గు వాడకం సంవత్సరంలో రెండు బిలియన్ టన్నులు. దీని వల్ల కర్బన ఉద్గారాలు 36.3 బిలియన్ టన్నులకు చేరింది. వాయువులో మీథేన్ 18 శాతం, నైట్రస్ ఆక్సైడ్ 4 శాతం పెరగ్గా, ఫ్లోరినేటెడ్ వాయువులు 2 శాతం పెరిగాయని వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముంచుకొస్తున్న ముప్పుపై క్రమం తప్పకుండా సమావేశాలు, సదస్సులు జరుగుతునే ఉన్నాయి. కానీ, వాటిలో తీసుకుంటున్న నిర్ణయాలు అమలవుతున్న దాఖలాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయి. మనిషి మేలుకోకపోతే, ప్రకృతే తగిన చర్య తీసుకుంటుందన్న వాదన బలపడుతున్నది.

---

### పోరాట ఫలితమే..
## కాస్మోటిక్, మెస్‌చార్జీల పెంపు

ఎఐటియుసి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భూక్య రమేష్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పోరాట ఫలితమే తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థులకు కాస్మెటిక్, మెస్ చార్జీలను పెంచిందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన ధరలతో అటు విద్యార్థులు, ఇటు వంట కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ఎఐటియుసి పోరాటంతోనే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్మికులు సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వాల మెడలు హక్కులు సాధించుకోవచ్చని సూచించారు. సమావేశంలో సంఘం నాయకులు చిట్యాల లక్ష్మి , మల్లేష్, సాయవ్వ రజిత, సుల్తానా, హసీనా, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ అవుతున్నా విద్యార్థులను పట్టించుకోరా?

ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి రమేష్ ధ్వజం



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నారాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల హాస్టళ్లలో 49 మంది విద్యార్థులు చనిపోతే ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గురుకుల హాస్టల్‌లో విధ్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువుల నాణ్యతపై ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు నిత్యం తనిఖీలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో చలిలో గజగజ వణుకుతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు దుప్పట్లను పంపిణీ చేయాన్నారు. అధికారులు సంక్షేమ హాస్టళ్లలో సందర్శించి వాటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న సిఎం విద్యాశాఖపై సమీక్షించకపోవడంతో సమస్యలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని డిమాండ్ ఆయన చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాకేష్, విష్ణు, శ్రీనివాస్, అనిల్, చరణ్, సంజయ్, హరీష్, సాత్విక్, అజిత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంఘాలతో పార్టీ బలోపేతం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు కీలకమని, ప్రజా సంఘాలతో పార్టీ బలోపేతమవుతుందని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రిన్సిపాల్‌గా సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల స్టడీ సర్కిల్ జరిగింది. స్టడీ సర్కిల్‌లో సిపిఐ పార్టీ ప్రజా సంఘాలు అనే అంశంపై రాజారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ, ఎఐటియూసి, ఎఐఎస్ఎఫ్, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషించి ఉద్యమ పోరాటాలు నిర్వహించాయన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన చరిత్ర సిపిఐదని, ఆ పోరాటంలో అనేక గ్రామాలు విముక్తి పొంది, భూములు పంచపడ్డాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ, ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రజా పోరాటాలను నిర్మించేందుకు ప్రజా సంఘాలు కీలకమన్నారు. కమ్యునిస్టు పార్టీ విస్తరణకు ప్రజా సంఘాలు కీలకమని, దానితో పాటు ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో ప్రజా సంఘాలు కీలక పాత్ర వహించాలని అన్నారు. స్టడీ సర్కిల్ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్‌వి స్టాలిన్, పార్టీ ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఉట్కూరు రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, మంచాల రమాదేవి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్, శంకర్ నాయక్, మంచాల తిరుపతి, గడ్డం లలిత, రసమల్ల దీనా, గుంటి రాజేందర్, లావుద్య రమాదేవి, రసమల్ల కుమార్, భూక్యా స్వరూప, దర్మల రాంమూర్తి, వేల్పుల చరణ్, సిపతి వినయ్ తదితరులు పాల్గొన్నారు.






## దేశాభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర కీలకం

ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** దేశాభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమైందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రబాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంతోమంది అమరవీరుల పోరాటం రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిందన్నారు. చట్టపరమైన మార్పులతో పాటు అభివృద్ధి చట్టాల మార్పుపై అవగాహన ఎంతో అవసరమన్నారు. చట్టాపలపై న్యాయవాదులకు పూర్తి అవగాహన ఉన్నప్పుడే కేసులు సత్వర పరిష్కారం లభించి కక్షిదారులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 30న వరంగల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలలో న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి దప్పు మల్లయ్య, కెవిఎల్, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, బొమ్మగాని శ్రీనివాస్, తొగిటి మురళి, సత్యనారాయణ పిళ్లై, భిక్షమయ్య గౌడ్, లింగయ్య, రాంరెడ్డి, మహిళా న్యాయవాదులు పెండెం వాణి, కూచిపూడి శశిరేఖ, బి సుజాత, కాసం సరిత తదితరులు పాల్గొన్నారు.

## రెండో ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించరా?

సమస్యల పరిష్కారానికి 2న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా

మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్







**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ సవరించి రెండో ఎఎన్‌ఎంల పోస్టులు పెంచి మళ్ళీ కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. సెకండ్ ఎఎన్‌ఎం పోస్టులు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 2న కమిషనర్ కార్యాలయంలో ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమ నోటీసును మంగళవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయ డిపిఎంఒ శ్రీనివాస్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో ఎఎన్‌ఎంలు ఉద్యోగ భద్రత లేక, శ్రమ దోపిడికి గురువుతున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించడంలో రెండో ఎఎన్‌ఎంల కృషి వెలా కట్టలేనిదన్నారు. గత ప్రభుత్వం 1931 పోస్టులతో 2023 సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదల చేసిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్ పడని కారణంగా అనేకమందికి వయోపరిమితి సమస్య ఎదురవుతున్నదన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 2న జరిగే కమిషనర్ కార్యాలయ ముట్టడికి ఎఎన్‌ఎంలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెండో ఎఎన్‌ఎం ఎఐటియుసి యూనియన్ జిల్లా నాయకురాలు గిరిజారెడ్డి, జయమ్మ, వెంకటేశ్వరమ్మ, అరుణ, హేమలత, సుజాత, మహేష్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** రెండో ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. రెండో ఎఎన్‌ఎంల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం డిఎంహెచ్‌ఒ సీతారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఎఎన్‌ఎంల నోటిఫికేషన్‌లో అదనంగా 5 వేల పోస్టులను పెంచి, డిసెంబర్ 2 నుండి 28 వరకు ప్రిపరేషన్ హాలిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండో ఎఎన్‌ఎంలు గత 20 సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబ పోషణ కష్టం అయినప్పటికి, పేద, బడుగు బలహీన వర్గాలకు వైద్యం అందించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, రెండో ఎఎన్‌ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, రెండో ఎన్‌ఎంలు రజని, సునిత, భాగ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**ములుగు ప్రతినిధి :** సెకండ్ ఎఎన్‌ఎంల పోస్టులను పెంచి నియామకాలు చేపట్టాలని ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. సెకండ్ ఎఎన్‌ఎంల సమస్యలపై డిఎంహెచ్‌ఒకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ డిసెంబర్ 29న నిర్వహించే పరీక్షలకు గతంలో విడుదల చేసిన పోస్టులకు అదనంగా పెంచి నియామకాలు చేపట్టాలని కోరారు. వయసు రీత్యా అవకాశం లేని రెండవ ఎఎన్‌ఎంలకు రూ.10లక్షలు లైఫ్ టైం గ్రాట్యూటీ కింద రిటైర్డ్‌మెంట్ సమయంలో ఇవ్వాలని, వంద శాతం గ్రాస్ శాలరీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పిహెచ్‌సిలలో ఒక ఓపిఓఎన్‌ఎం ఉండేలా ఏర్పాటు చేసి తద్వారా ఏర్పడిన ఖాళీలలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు పి సరోజన, కోడి సుజాత, కొమురం సుజాత, సంపూర్ణ, లక్ష్మి , స్వప్న, శోభారాణి, పావణి, భాగ్య, ధనలక్ష్మి , ఆదిలక్ష్మి , కవిత, తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్లను ఎదుర్కొనేందుకు
# భారత్ సిద్ధంగా ఉండాలి

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు



**ఉదగమండలం(తమిళనాడు) :** సైబర్‌యుద్ధం, ఉగ్రవాదం వంటి జాతీయ భద్రత సవాళ్లు సహా వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ వాతావరణ కాలంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. అలాగే, భౌగోళిక, రాజకీయ డైనమిక్స్ భద్రతా దృశ్యాన్ని మార్చినందున జాతీయ, ప్రపంచ దృశ్యాలపై లోతైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. గురువారం నీలగిరి జిల్లా వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. 'వాతావరణ మార్పు ఒక కొత్త కోణాన్ని పొందుతోంది. దీనిని మనం అర్థం చేసుకోవాలి.నవీకరించబడిన జ్ఞానం, అత్యాధునిక సాంకేతికత పరిశోధన ఆధారంగా అన్వయించబడాలి. మా సాయుధ సిబ్బంది భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొంటుందని నేను విశ్వసిస్తున్నాను' అని ముర్ము తెలిపారు. భారతదేశం అభివృద్ధి చెందుతోందని, రక్షణ సహా వివిధ రంగాలలోదేశం పాత్రను ప్రపంచం గుర్తిస్తోందని నొక్కిచెప్పారు. అవసరాలు, సవాళ్లను ఎదుర్కొనే స్థితిలో సాయుధ బలగాలను ఉంచడానికి దేశం స్వదేశీకరణ , స్వావలంభన దిశగా పయనిస్తోందని వివరించారు. భారతదేశం ఒక ప్రధాన రక్షణ తయారీ కేంద్రంగా పురోగతిని సాధిస్తోందని, విశ్వసనీయ రక్షణ భాగస్వామిగానే కాకుండా రక్షణ ఎగుమతిదారుగా భారత్ మారుతోందని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అనుగుణంగా ముందుకు సాగుతోందని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ అధ్యాపకులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

# తప్పుడు అంకెలతో ద్రవ్యోల్బణం తగ్గింపు : కాంగ్రెస్

### ప్రజలపై పన్నులతో చమురు కంపెనీలకు రూ.36 లక్షల కోట్ల రెవెన్యూ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ దృష్టంతా ద్రవోల్బణాన్ని తగ్గించటం కంటే మోసపూరితంగా ద్రవ్యోల్బణ అంకెలను తక్కువగా చూపించడంపైనే ఉన్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. ప్రచారం, అంకెలను మార్చడం ద్వారా ప్రజల సంక్షేమం కోసం పనిచేయలేరని ఎద్దేవా చేశారు. గడిచిన పదేళ్ళలో 'మోదీ సృష్టించిన ద్రవ్యోల్బణాన్ని' భారతదేశం చవి చూసిందని, ప్రభుత్వ తప్పుడు విధానాల ఫలితమే ఇది అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరలను తగ్గించకుండా వినియోగదారుల ధరల సూచి(సిపిఐ), టోకు ధరల సూచి(డబ్ల్యుపిఐ) అంకెలను అవకతవకలతో మార్చి ,ద్రవ్యోల్బణం అదుపులో ఉందని చెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం సామాన్య ప్రజలు నిరంతరాయం ధరల పెరుగుదలను ఎదుర్కుంటున్నాడని చెప్పారు. ఆహారం, ఇంధనం, నిత్య వినయియోగ వస్తువుల ధరలు అధికంగా ఉంటున్నాయని, దీంతో భారత శ్రామిక వర్గం , మధ్య తరగతిపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధర తగ్గినప్పటికీ పెట్రలు, డీజిల్ ధరలు భారత్‌లో ఎక్కువగానే ఉన్నాయని, ఈ ప్రభావం రవాణా ఖర్చు ఇతర సేవలపై పడుతున్నాయన్నారు. సిపిఐ అంకెలు తప్పుడువని, వీటి ప్రభావం ప్రభుత్వం, అర్ధ ప్రభుత్వ ఉద్యోగుల మీద పడుతుందని, వారి డిఎ, ఇంక్రిమెంట్‌లు యుపిఎ ప్రభుత్వం నాటి కంటే తగ్గిపోయాయని చెప్పారు. అంకెల గారడీతో మోదీ ప్రభుత్వం పదే పదే దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. గతంలో ఎన్‌డిఏ కంటే తక్కువ జిడిపి వృద్ధి రేటు ఉండడంతో బిజెపి ప్రభుత్వం బేస్ ఇయర్‌ను మార్చి ఎక్కువగా చూపిస్తుందని, అలాగే ఉద్యగాల విషయంలో కూడా ముద్ర లోన్ కింద రుణాలు తీసుకొన్న వారిని, తాత్కాలిక ఉద్యోగులను , స్వయం ఉపాధి చేసుకుంటున్న వారి లెక్కలను కలిపి ఇపిఎఫ్ఒ అంకెలతో రికార్డు స్థాయి ఉద్యోగ వృద్ధి కనిపిస్తోందని చెప్పుకుంటున్నారని అన్నారు. మోసపూరిత బహు ముఖీణ పేదరిక సూచి పేరుతో భారీగా పేదరికం తగ్గిందని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ముడి చమురు ధరలు పడిపోయినప్పటికీ పెట్రోలు, డీజిల్, ఎల్‌పిజి ధరలను తగ్గించలేదని, చమురు , గ్యాస్ కంపెనీలు రికార్డు స్థాయిలో రూ.36 లక్షల రెవెన్యూను ప్రజలపై పెట్రోలు, డీజిల్ పన్నుల మోపడం ద్వారా పోగేసుకున్నాయని జైరామ్ రమేశ్ వివరించారు.

# ఫలించిన ప్రతిపక్షాల ఒత్తిడి

### 'వక్ఫ్' జెపిసి గడువు పెంపు
### వచ్చే బడ్జెట్ సమావేశాల చివరి దాకా కొనసాగింపు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జెపిసి) గడువును పెంచుతూ లోక్‌సభ గురువారం నాడు తీర్మానాన్ని ఆమోదించింది. దీని ప్రకారం జెపిసి గడువును వచ్చే ఏడాది పార్లమెంటు బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకు పెంచారు. ఈ మేరకు లోక్‌సభలో జెపిసి చైర్మన్ జగదాంబికాపాల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ కమిటీ సమావేశాలలో సభ్యులు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధాలు జరిగాయి. ముసాయిదా నివేదిక సిద్ధం చేసినట్లు చైర్మన్ జగదాంబికా పాల్ ప్రకటించడంతో బుధవారం జరిగిన జెపిసి సమావేశం నుంచి ప్రతిపక్ష సభ్యులు మూకుమ్మడిగా వాకౌట్ చేశారు. దీంతో చైర్మన్, కమిటీలో బిజెపి సభ్యులంతా ప్రతిపక్షాల వద్దాకు వెళ్ళి బుజ్జగించారు. కమిటీ గడువును నవంబర్ 29 నుంచి పెంచేందుకు సానుకూలతను వ్యక్తం చేశారు. లోక్‌సభ ఆగస్టు 8న జెపిసిని ఏర్పాటు చేసి శీతాకాల పార్లమెంటు సమావేశాలలో మొదటి వారం చివరి రోజున నివేదిక సమర్పించాలని కోరింది. నవంబర్ 21న జరిగిన సమావేశంలో నివేదిక సిద్ధమైందని జెపిసి చైర్మన్ పాల్ ప్రకటించడం ద్వారా సంబంధిత వర్గాలతో చర్చలు పూర్తయినట్లు సంకేతాలిచ్చారు. దానిని ఆమోదించే ముందు కమిటీ సభ్యులతో ముసాయిదాపై చర్చించాలని బావించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలోనే తాము లోక్‌సభ స్పీకర్‌ను కలవగా, గడువు పెంచేందుకు ఆయన అంగీకారాన్ని తెలియజేశారని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లులో చేసిన సవరణల ముస్లింల మత హక్కులను ఉల్లంఘిచేవిగా ఉన్నాయని ప్రతిపక్షాలు విమర్శించడంతో జెపిసి వేసారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో విఫలం

### కేంద్ర సర్కార్‌లో ఆప్ సుప్రీం అరవింద్ కేజ్రీవాల్ ధ్వజం




**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఆప్ సుప్రీం అరవింద్ కేంద్రీవాల్ తన విమర్శలను తీవ్రం చేశారు. ఢిల్లీలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గురువారం కేజ్రీవాల్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో ఎక్కడా చూసినా అభద్రతా భావ, భయాకన వాతావరణం నెలకొందన్నారు. రాత్రి 7 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు వెళితే తమకు రక్షణ లేకుండా పోతుందని మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్ర హోంమంత్రి హయాంలో దేశ రాజధానిలో దోపిడీలు, కాల్పులు, నేరాలు పెరిగిపోతున్నాయని దుయ్యాబట్టారు. రోజు రోజుకు మీతిమీరిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, హోంమంత్రి కలిసి ఢిల్లీని హింస, దోపిడీ హబ్‌గా మార్చారని ఆరోపించారు. ఆప్ విజయాలను గుర్తుచేస్తూ తమ హయాంలో ఆరోగ్యం, విద్య, విద్యుత్ అందించడంలో విజయం సాధించామన్నారు. చట్టాలను తప్పుడు పద్ధతుల్లో అమలు చేస్తున్నారని బిజెపి సర్కార్‌పై విరుచుకుపడ్డారు. హోంమంత్రి శాఖ పరిధిలోనే ఢిల్లీ పోలీసులు ఉన్నప్పటికీ తమ బాధ్యతలు నిర్వర్తించడంలో పూర్తిగా వైఫలం చెందారన్నారు. కాగా ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## ఆర్ఎస్ఎస్ వ్యూహంలో భాగమే
# ఆజ్మీర్ వివాదం : సందోష్ కుమార్



**న్యూఢిల్లీ :** మతతత్వ భావోద్వేగాలు రెచ్చగొట్టే ఆర్ఎస్ఎస్ వ్యూహంలో భాగంగా మరో ప్రయత్నమే అజ్మీర్ దర్గా వివాదమని సిపిఐ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ పి.సందోశ్ కుమార్ విమర్శించారు. మితవాద సంస్థలు చిన్న చిన్న కేసులు వేయడం, స్థానిక కోర్టులు వాటిని అంగీకరించి, మైనారిటీ వర్గాల ప్రార్థనా స్థలాలలో తొందరపాటుతో సర్వేకు ఆదేశించడం అలవాటుగా మారిందని ఆరోపించారు. అజ్మీర్ దర్గాను హిందూ దేవాలయంగా ప్రకటించాలని ఒక మితవాద సంస్థ దాఖలు చేసిన కేసులో కోర్టు సర్వే ఆదేశించటంపై ఆయన స్పందించారు. మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేయటం ద్వారా ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడంలో భాగమే ఇదంతా జరుగుతుందని, ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ లోని సంభాల్‌లో తొందరపాటు చర్యతో హింస చెలరేగి ఐదుగురి మరణానికి దారి తీసిందని, తాజాగా అజ్మీర్‌లో కూడా అలాగే కేసు వేయడటం ద్వారా సమాజంలో సామరస్యం, సహృద్భావాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఆర్ఎస్ఎస్ భావిస్తుందన్నారు. తొందరపడి సర్వేకు ఆదేశించటంలో కిందిస్థాయి న్యాయవ్యవస్థ పాత్ర ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, మణిపూర్ సంక్షోభం, అదానీ లంచాల కుంభకోణం, దేశ ఆర్థిక పరిస్థితిలో వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని సందోశ్ ఆరోపించారు.

# జలాంతర్గామి నుంచి కె-4 బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన భారత్



**న్యూఢిల్లీ :** భారత్ కు చెందిన వ్యూహాత్మక అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ ద్వారా కె-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష జరిగింది. విశాఖ తీరంలో భారత నౌకా దళం దీనిని నిర్వహించింది. అరిఘాగ్ నుంచి కె-4 క్షిపణిని పరీక్షించడం ఇదే మొదటిసారి. 3500 కిమీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా నిర్వహించిన ఈ ప్రయోగం ఫలితాలను విశ్లేషిస్తున్నారు. ఐఎన్ఎస్ అరిహంత్ మాదిరిగానే అరిఘాత్ నిర్మాణాన్ని కూడా తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకల స్థావరం అయిన విశాఖపట్నం నేవల్ డాక్ యార్డ్ లోని 'నౌకా నిర్మాణ కేంద్రం' లో 2011 డిసెంబర్ లో చేపట్టారు. నిర్మాణం తర్వాత 2017 నవంబర్ 19న జలప్రవేశం చేయించారు. తర్వాత అంతర్గత పరికరాలు బిగించారు. ఆధునిక సాంకేతిక రాడార్ వ్యవస్థను అమర్చారు. ప్రపంచవ్యాప్తంగా బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించగల జలాంతర్గాములు ఉన్న దేశాల్లో భారత్ ఆరోది. అమెరికా, రష్యా, యూకె, ఫ్రాన్స్, చైనా వంటివి ఇతర దేశాలు. చైనాను దృష్టిలో పెట్టుకుని భారత్ 3500 కిమీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను రూపొందించింది.

# జాబ్ మేళాల్లో 24 లక్ష మంది షార్ట్‌లిస్ట్



**న్యూఢిల్లీ :** గడిచిన ఐదేళ్ళలో నిర్వహించిన ఉద్యోగ మేళాలలో 24 లక్షల మందికి పైగా అభ్యర్థులను తాత్కాలిక షార్ట్ లిస్ట్ చేసినట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో రాష్ట్ర ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు, మోడల్ కెరీర్ కేంద్రాల ద్వారా గడిచిన ఐదేళ్ళలో 34,809 ఉద్యోగ మేళాలు నిర్వహించినట్లు కార్మిక, ఉద్యోగ మంత్రిత్వ శాఖ సమాచారం ఆధారం వెల్లడైందన్నారు. నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సిఎస్)లో భాగంగా ఉద్యోగ మేళాలను కేంద్ర కార్మిక, ఉద్యోగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో 26.83 లక్షల మంది ఉద్యోగార్థులు , 83,913 మంది యజమానులు పాల్గొన్నారని, 24.37 లక్షల మందిని షార్ట్ లిస్ట్ చేసినట్లు వెల్లడించారు.

**పెన్షన్ అదాలత్‌లో 70 శాతం పరిష్కారం**

పెన్షన్ అదాలత్ ద్వారా 2019 నుంచి సుమారు 70 శాతం కేసులు పరిష్కారమైనట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభకు వెల్లడించారు. ఈ కాలంలో12,049 కేసులలో 8,300 కేసులు పరిష్కారమయ్యాయని లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

# ఢిల్లీలో పివిఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో పేలుడు

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలోని రోహిణికి చెందిన ప్రశాంత్ విహార్‌లోని పివిఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో గురువారం పేలుడు సంభవించింది. స్వల్ప తీవ్రతతో ఉన్న పేలుడు కారణంగా సమీపంలో నిలిపిఉన్న ఒక త్రిచక్ర వాహనం డ్రైవర్ స్వల్పంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 11.48 గంటలకు తమకు ప్రశాంత్ విహార్‌లో బాంబు పేలుడు సంభవించినట్లు సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్నామని ఢిల్లీ అగ్నిమాపక సర్వీసుల అధికారి ఒకరు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసు బృందాలు చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. గతనెలలో ప్రశాంత్ విహార్‌లోని సిఆర్‌పిఎఫ్ స్కూలు ప్రహరీ వెలుపల కూడా ఇటువంటి బాంబు పేలుడే జరిగినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నేటి ఉదయం ఒక స్వీట్ షాపు వెలుపల స్వల్ప తీవ్రతతో పేలుడు జరిగిందని వారు చెప్పారు. కాగా.. సరిగ్గా నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల ఎదుట పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించడంతో పాటు, పాఠశాల గోడ కూలిపోయింది. సమీపంలోని దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయి. అప్పుడు కూడా ఘటనాస్థలంలో తెల్లని పౌడర్‌ను గుర్తించి ల్యాబ్‌కు పంపించారు. దీని వెనక ఖలిస్థానీ హస్తం ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పేలుడుకు పాల్పడింది తామేనంటూ ఖలిస్థానీ అనుకూల గ్రూప్ జస్టిస్ లీగ్ ఇండియా ప్రకటించుకుంది. తాజా పేలుడు కూడా అచ్చం నాటి ఘటన లాగే ఉండటం కలకలం రేపుతోంది.

# శబరిమల, తిరుమలకు ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** శబరిమల , తిరుమలకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపించనుంది. శబరిమలకు వెళ్లే రైళ్ల వివరాలు పరిశీలిస్తే కాచిగూడ కొట్టాయం రైలు ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి సోమవారం సాయంత్రం 6.30కు చేరుకోనుంది. డిసెంబర్ 2న కొట్టాయం నుంచి కాచిగూడకు సోమవారం రాత్రి 8.50 నిమిషాలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకోనుంది. 6వ తేదీన హైదరాబాద్ నుండి కొట్టాయంకు మరో రైలు శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు బయలు దేరి శనివారం సాయంత్రం 6.00 గంటలకు చేరుకోనుంది. ఇక గూడూరు, నెల్లూరు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మీదుగా హిసార్‌కు చేరనుంది. హిసార్ తిరుపతి రైలు శనివారం 7వ తేదీన బయలుదేరనుండగా, తిరుపతి హిసార్‌ల మధ్య ఈ నెల 9వ తేది సోమవారం చేరనుంది.

# దేశ్యవాప్తంగా 5వేలకు పైగా జడ్జిల పోస్టుల ఖాళీలు : కేంద్రం

### అఖిల భారత జ్యుడిషియల్ సర్వీస్‌పై ఏకాభిప్రాయం లేదు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సబార్డినేట్ , జిల్లా కోర్టులలో 5,245 జడ్జిల కొరత ఉన్నదని, 25 హైకోర్టులలో 364 ఖాళీలు ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. మొత్తం 25 రాష్ట్రాల హైకోర్టుల మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 1,114 అని వెల్లడించారు. జడ్జిల ఖాళీలపై ప్రశ్నకు రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానమిస్తూ సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి సహా మంజూరైన 34 న్యాయమూర్తుల పోస్టులలో రెండు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఛీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీ పదవీ విరమణతో ఆ ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రాలు, హైకోర్టుల విభిన్న అభిప్రాయల నేపథ్యంలో అకిల భారత జ్యుడిషియల్ సర్వీస్ (ఎఐజెఎస్) ఏర్పాటుపై ముందడుగు పడలేదని మంత్రి తెలిపారు. రాజ్యాంగంలోని 312 అధికరణ ఎఐజెఎస్ ఏర్పాటుకు అవకాశం కల్పించిందని, ఇందులో జిల్లా కోర్టు కంటే కింది స్థాయికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఎఐజెఎస్ ఏర్పాటుకు రూపొందించిన సమగ్ర ప్రతిపాదనను కార్యదర్శుల కమిటీ 2012 నవంబర్‌లో ఆమోదం తెలిపింది. దీనిపై రాష్ట్రాలు, హైకోర్టుల అభిప్రాయాలు కోరగా, విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తరువాత జిల్లా జడ్జిల ఖాళీల త్వరితగతిన భర్తీపై ప్రస్తుతం ఉన్న విధానంలో సరైన విధానాలను రూపకల్పన బాధ్యత ఆయా హైకోర్టులకు అప్పగించాలని నిర్ణయించారు. ఇందులో ఎలాంటి పురోగతి లేదు. 'ప్రధాన భాగస్వాములలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అఖిల భారత జ్యుడిషియల్ సర్వీస్ ఏర్పాటు ప్రతిపాదన విషయంలో ఏకాభిప్రాయం లేద'ని కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ స్పష్టం చేశారు.

**11 నెలల్లోనే 9 లక్షల కేసులు పెరిగాయ్!**

జిల్లా, సబార్డినెట్ కోర్డులలో గడచిన 11 మాసాల్లోనే పెండింగ్ కేసులు 9 లక్షలకు పైగా పెరిగాయని రాజ్యసభకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ తెలియజేశారు. వివిధ స్థాయిల కింది కోర్టులలో జనవరి 1వ తేదీ నాటికి కింది కోర్టులలో 4.44 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉండగా , ఆ సంఖ్య నవంబర్ 15 నాటికి 4.53 కోట్లకు పెరిగిందన్నారు. అందులో సివిల్ కేసుల సంఖ్య 1.10 కోట్లు కాగా, క్రిమినల్ కేసులు 3.43 కోట్లు.

# అత్యవసర చర్యల సడలింపుకు 'సుప్రీం..నో'

### డిసెంబరు 2వరకూ కొనసాగించాలని ద్విసభ్య ధర్మాసనం ఆదేశం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఏపి) స్టేజి 4కింద అత్యవసర చర్యలను సడలించడానికి గురువారం సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిని డిసెంబరు 2వ తేదీ వరకూ కొనసాగించాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఆగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కోర్టు కమిషనర్లు సమర్పించిన రెండవ నివేదికలో జిఆర్‌ఏపి 4వ దశను అమలు చేయడంలో అధికారులు 'తీవ్ర వైఫల్యం' చెందారని నిందించింది. 'పాఠశాలలకు సంబంధించి సవరించిన చర్యలు మినహా అన్ని జిఆర్‌ఏపి 4వ దశ చర్యలు సోమవారం వరకూ (డిసెంబరు 2) కొనసాగుతాయని మేం స్పష్టం చేస్తున్నాం. అదే సమయంలో వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ జిఆర్‌ఏపి4 నుండి జిఆర్‌ఏపి3 లేదా జిఆర్‌ఏపి2 వరకు ముందుకువెళ్లేందుకు సంబంధించిన సూచనలు రాబట్టేందుకు ఒక సమావేశం నిర్వహించాలి. జిఆర్‌ఏపి4కింద ఏర్పాటు చేసిన అన్ని చర్యలను అందించాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేయదలచుకున్నాం'అని ధర్మాసనం తెలిపింది. జిఆర్ఎ4 అడ్డాలను నిర్ధారించడం కోసం అధికారుల వైఫల్యానికి సంబంధించిన చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పంజాబ్‌కు సంబంధించిన మీడియా నివేదికను బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిలో ల్యాండ్ రికార్డింగ్ అధికారి, సంగ్రూర్ బ్లాక్ పట్వారీ యూనియన్ అధ్యక్షుడు ఉపగ్రహాల గుర్తింపును నివారించకుండా రైతులు సాయంత్రం 4గంటల వరకు పొట్టును కాల్చమని సలహా ఇచ్చిన విషయాన్ని బహిరంగంగా అంగీకరించినట్లు తెలిపారు. మేం ఈ వార్త ఖచ్చితత్వాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకోలేము కానీ అది సరియైనది అయితే చాలా తీవ్రమైనదిగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోజులో కొన్ని గంటలు ఏ ప్రదేశంలో నిర్వహించబడుతున్నాయనే వాస్తవాన్ని గ్రహించేందుకు పంజాబ్ రాష్ట్ర అధికారులు ఏ రైతుకూ ప్రయోజనాన్ని అనుమతించలేరు. ఇలాంటి వికృత కార్యకలాపాలకు పాల్పడవద్దని పంజాబ్ ప్రభుత్వం తక్షణమే అధికారులందరికీ ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలోకి ప్రత్యేకంగా అవసరమైన వస్తువులను తీసుకెళుతున్న ట్రక్కుల రవాణా అనుమితించడానికి సంబంధించినవే ఈ జిఆర్‌ఏపి4 పరిమితులు. జిఆర్‌ఏపి ని 2017లో తొలిసారిగా అమలు చేశారు. రాజధాని, దాని పరిసరాలకు సంబంధించిన కాలుష్య చర్యల ప్రకారం పరిస్థితి తీవ్రతను అంచనావేయడానికి ఉద్దేశించి పరిమితులను నిర్దేశించారు.

# ఇకపై రెండేళ్లకే డిగ్రీ

### అవసరమైతే నాలుగేళ్లు చదవొచ్చు!
### యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ :** అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల డిగ్రీ కోర్సులపై యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) కీలక నిర్ణయం తీసుకుంది. యుజి విద్యార్థులు త్వరలో డిగ్రీ కోర్సుల వ్యవధిని తగ్గించుకునే, పొడిగించుకునే ఆప్షన్‌ను పొందుతారని యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు. యూజీ విద్యార్థులకు తమ డిగ్రీ ప్రోగ్రామ్‌ల వ్యవధిని వారి అభ్యాస సామర్థ్యం ఆధారంగా తగ్గించడం లేదా పొడిగించే విధంగా ఉన్నత విద్యా సంస్థలు త్వరలో ఒక ఆప్షన్‌ను తీసుకురానున్నట్లుగా పేర్కొన్నారు. 'విద్యార్థులు వారి అభ్యాస సామర్థ్యాల ఆధారంగా వారి డిగ్రీ కోర్సు వ్యవధిని తగ్గించడం, పొడిగించుకునే ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఎడిపి) ద్వారా ప్రతి సెమిస్టర్‌లో అదనపు క్రెడిట్స్‌ను సంపాదించడం ద్వారా తక్కువ సమయంలో మూడు లేదా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును పూర్తి చేయవచ్చు. అయితే ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఇడిపి)తో డిగ్రీ కాలవ్యవధిని పెంచుకోవచ్చు. ప్రతి సెమిస్టర్‌లో తక్కువ క్రెడిట్స్ వచ్చినవారికి ఈ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. ఎడిపి, ఇడిపి ప్రోగ్రామ్‌లకు విద్యార్థుల అర్హతను అంచనా వేయడానికి ఉన్నత విద్యాసంస్థలు కమిటీలను ఏర్పాటు చేస్తాయి. ఈ డిగ్రీలతో అన్ని ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. సాధారణ డిగ్రీల్లానే వీటికి విలువ ఉంటుంది.' అని యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు.



Ayurveda Biology Introduced as a New Subject in UGC-NET Exam

**'అదనపు క్రెడిట్లు పొందాలి'**

అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు మొదటి లేదా రెండో సెమిస్టర్ చివరలో ఎడిపిని ఎంచుకునే అవకాశం ఉంటుందని యుజిసి చైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు. ఆ తర్వాత ఎడిపి ప్రోగ్రామ్‌ను ఎంచుకోలేరని పేర్కొన్నారు. 'ఎడిపిని ఎంచుకునే విద్యార్థులు ప్రతి సెమిస్టర్‌లో అదనపు క్రెడిట్‌లను పొందాలి. విద్యార్థులు మొదటి సెమిస్టర్ తర్వాత ఎడిపిలో చేరినట్లయితే, రెండో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్స్‌ను సాధించాలి. రెండో సెమిస్టర్ త ర్వాత ఎడిపిలో చేరినట్లయితే, మూడో సెమిస్టర్ నుంచి అదనపు క్రెడిట్‌ను సాధించాల్సి ఉంటుంది. 3 లేదా 4 ఏళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో కోర్సును గరిష్ఠంగా రెండు సెమిస్టర్ల వరకు పొడిగించుకోవచ్చు.' అని పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలు ఎంచుకున్న వ్యవధిలో డిగ్రీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన స్టూడెంట్స్‌కు డిగ్రీలు అందించవచ్చని యుజిసి చీఫ్ తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ కోసం కోర్సు పూర్తి కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే వేగవంతమైన, పొడిగించిన డిగ్రీల కోసం విద్యార్థి స్వీయ నియంత్రిత నోటు రాయాల్సి ఉంటుందని వెల్లడించారు.

SHRIRAM Finance

## వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T 3151 | LINGAMPELLI THIRUPATHI RA | AL 3718 IL FBT | 2019 |
| 2 | TS05UC 1679 | UDATHA RAVI | AL 3718 IL FBT | 2017 |
| 3 | TS20T 0550 | ARUNA UDATHA | AL 3718 IL FBT | 2017 |
| 4 | TS03UB 6667 | DEVENDER ANGAJALA | TATA LPT 3118 CUMMINS FBT-T | 2016 |
| 5 | TS32T 8026 | KUMAR RAPAKA | TATA VISTA DIESEL-P | 2015 |
| 6 | AP16BD 8375 | JAGADESHWAR NAREDLA | JOHN DEERE 5310 HARVESTER | 2009 |
| 7 | TS34 T 1419 | RAMDASU MAHESH | TATA SIGNA 4923.S | 2016 |
| 8 | TS25 8108 | RAJU MAMIDISHETTI | MARUTHI OMNI-P | 2017 |
| 9 | AP04TT 8549 | SRINIVAS RAO LINGAMPELLI | TATA LPT 3118 CUMMINS FBT | 2013 |
| 10 | AP24Y 5876 | MARRI SREENIVAS | TATA LPT 3118 CUMMINS FBT | 2010 |

AUCTION DATE : 30-11-2024
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
1st Floor H.No. 6-159, Above DCC Bank Reddy Colony, Bhupalpally, JAYASHANKAR BHUPALPALLY - 506169.
Cell : 9849981545, 9573787776

తెలుగు జాతీయ దినపత్రిక ప్రజాపక్షం PRAJAPAKSHAM

శుక్రవారం, నవంబరు 29

# మసీదులపై కేసులకు అంతం లేదా?

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో దర్గా సర్వే సందర్భంగా ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలు, పోలీసు కాల్పులకు ఐదుగురు ముస్లిం యువకులు మరణించటం, అజ్మీర్ (రాజస్థాన్)లోని సుప్రసిద్ధ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తి దర్గా ఆదిలో హిందూ ఆలయమంటూ హిందూసేన జాతీయ అధ్యక్షుడు విష్ణుగుప్త అజ్మీర్ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయటం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు హిందూ మతోన్మాద శక్తులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నం అనక తప్పదు. అజ్మీర్ కోర్టు ఆ పిటిషన్‌ను స్వీకరించి ప్రతివాదులకు నోటీసు జారీ చేసి, తదుపరి విచారణను డిసెంబర్ 20కి వాయిదా వేసింది. పిటిషన్‌లు దాఖలు కావటంతోపాటు వాటిని స్థానిక కోర్టులు విచారణకు అనుమతిస్తున్న తీరుకూడా సందేహాలకు తావిస్తున్నది. బాబ్రీమసీదు కూల్చివేత నేపథ్యంలో – 1991లో పార్లమెంటు ఆమోదించిన ప్రార్థనా ప్రదేశాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం ఉనికినే కోర్టులు గుర్తిస్తున్నట్లు లేదు. ఏ ప్రార్థనా స్థలం మార్పునూ ఆ చట్టం నిషేధించింది. ఏ ప్రార్థనా ప్రదేశమైనా సరే, 1947 ఆగస్టు 15నాటికి దానికున్న మతస్వభావాన్ని పరిరక్షించాలని సెక్షన్ 4 చెప్పింది. ఒక్క బాబ్రీమసీదుకే (కేసు సుప్రీంకోర్టు ముందున్నందున) ఆ చట్టం మినహాయింపు ఇచ్చింది. 2019లో అయోధ్య వివాదంపై వెలువడిన ఐదుగురు జడ్జీల తీర్పు కూడా ఆ చట్టం చెల్లుబాటును పునరుద్ఘాటించింది. మత ప్రదేశాలపై క్లెయిములను విస్తరించరాదని చెప్పింది. అయితే 2022 మే నెలలో సుప్రీంకోర్టు వారణాసిలోని గ్యాన్‌వాపి మసీదు సర్వేకు అనుమతించి అటువంటి వివాదాలకు తలుపులు తెరిచిందని భావించవచ్చు. కూల్చిన దేవాలయం శిధిలాలపై ఆ మసీదు నిర్మించారని జిల్లా కోర్టులో దాఖలైన పిటిషన్ ఆరోపించింది. అప్పటి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ బెంచి, మత ప్రదేశం స్వభావం కనుగొనటాన్ని 1991 చట్టం నిషేధించలేదంటూ, గ్యాన్‌వాపి మసీదు సర్వే కొనసాగింపును అనుమతించింది. 1947 ఆగస్టు 15 నాటికి ఆ ప్రదేశం ప్రతిపత్తిని నిర్ధారించుకోవాలని మాత్రమే పిటిషనర్‌లు కోరుతున్నారని, దాని స్వభావాన్ని మార్చాలని కోరటం లేదని కూడా ఆ తర్వాత కోర్టు చెప్పింది. గ్యాన్‌వాపి కేసులో సుప్రీంకోర్టు తీర్పు హిందూ మతోన్మాదులకు గేట్లు తెరిచింది. దాని తదుపరి మథురలో ఈద్గాపై ఇటువంటి కేసే దాఖలైంది. జిల్లా కోర్టు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వేను ఆదేశించింది. తదుపరి సంభాల్ వంతు వచ్చింది. 1526లో మొఘల్ పాలకుల శకంలో నిర్మించిన ఈ మసీదు సర్వేకు జిల్లా కోర్టు ఆదేశించింది. అంతకుముందు మథుర, వారణాసి జిల్లా కోర్టుల్లో పిటిషన్‌లు దాఖలు చేసిన అడ్వొకేట్ విష్ణు శంకర్ జైన్‌యే సంభాల్ పిటిషనర్ కూడా. ఆ మసీదు ప్రాచీన కట్టడంగా పురావస్తుశాఖ రక్షణ లో ఉన్నప్పటికీ, కోర్టు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించి, అదేరోజు సర్వేను ఆదేశించింది. నవంబర్ 29న నివేదిక సమర్పించాలంది. మజీదు కమిటీకి తమ వాదన వినిపించే అవకాశం కూడా ఇవ్వలేదు. మజీదు కమిటీ సహకారంతో సర్వే జరిగింది. కాగా మరో సర్వే నిర్వహణకై నవంబర్ 24న మరో సర్వే బృందం వచ్చింది. ముస్లింలు గుంపుగా చేరారు. రాళ్లు విసిరారు. పోలీసు కాల్పుల్లో అక్కడికక్కడే ముగ్గురు చనిపోయారు, తర్వాత తూటా గాయాలతో మరో ఇద్దరు మరణించారు.

ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ ఎజండాలో అయోధ్య, మథుర, వారణాసి ఆలయ – మజీదు వివాదాలు మాత్రమే ఉన్నాయి. సుప్రీంకోర్టు అయోధ్యను హిందువుల పక్షం చేసింది. రామాలయ నిర్మాణం జరిగింది. అనంతరకాలంలో పాములపుట్ట తెరుచుకున్నట్లు ఈద్గాలపై కేసులు దాఖలవుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో భోజ్‌శాల కేసు అటువంటిదే. కాగా అజ్మీర్‌లోని సుప్రసిద్ధ సూఫీ దర్గా కింద ఒకప్పుడు సంకట్ మోచన్ శివాలయం ఉండేదని, ఆ ఆలయాన్ని ధ్వంసం చేసి దర్గా నిర్మించారని ఆరోపిస్తూ, సర్వే కోరిన పిటిషన్‌కు మరో పెద్ద వివాదాన్ని రేపే శక్తి ఉంది. ఆ క్లెయిమును 800 సంవత్సరాల చరిత్ర కలిగిన అజ్మీర్ దర్గా ముఖ్య వారసుడు నస్రుద్దీన్ చిస్తి ఖండించారు. ప్రతి మసీదులో శివలింగాల కోసం వెదకవద్దని జూన్ 22న ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భాగవత్ విజ్ఞప్తి చేశారు. అయినా వినేవాళ్లు లేరు. బిజెపి ప్రభుత్వాలు రైల్వేస్టేషన్‌లు, రహదారులు వగైరాలకున్న ముస్లిం పేర్లను తొలగిస్తూ మధ్యయుగాలనాటి చరిత్రను తుడిచివేసే పనిలో ఉంటే, హిందూ మతోన్మాదులు మసీదు వివాదాలు లేవనెత్తుతూ అరాచకానికి తెరదీస్తున్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని 1991 నాటి ప్రార్థనాలయాల చట్టం పవిత్రతను పునరుద్ఘాటించి, కింది స్థాయి కోర్టుల అత్యుత్సాహాన్ని నిరోధించకపోతే సమాజంలో సామరస్యానికి విఘాతం కలుగుతుంది. రాజ్యాంగ పీఠికలోని లౌకికతను, సమగ్రతను నిలబెట్టాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపై ఉంది.

# ‘ఆయన వద్దనుకున్నాం.. కానీ ఈయన రావాలనుకున్నామా’?



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

‘ఆయన మారాలనుకున్నాం.. కానీ ఈయన రావాలనుకున్నామా’? ఇదీ బిఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియాలో గడచిన ఆరేడు నెలలుగా పోస్టులు హోరెత్తుతున్నవి. ‘ఉన్నోడ్ని పొమ్మనుడే గానీ, వచ్చెటోడు ఎసొంటోడని చూసేది లేదా’ అనే కోణంలో మరికొన్ని పోస్టులు. ‘గంత తెలివుంటే గిట్ల వాట్సాప్, యూట్యూబ్ గొట్టాల ను నమ్ముకొని మోసపోతరా’! అంటూ మరొక ప్రచారం. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేబట్టిన నాటి నుంచి బిఆర్‌ఎస్ నాయకత్వం బాధ వర్ణనాతీతంగా ఉన్నది. అందుకే ‘ఈయన రావాలనుకున్నమా’? అని అంటున్నారు. ‘ఆయన’ అంటే కెసిఆర్. ‘ఈయన’ అంటే రేవంత్ రెడ్డి. కెసిఆర్‌లో మార్పు కోరుకున్నాం కానీ, రేవంత్ రెడ్డి రావాలని అనుకోలేదు అన్నది ఆయా పోస్టుల సారాంశం.

రేవంత్‌రెడ్డి పట్ల కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులకు ఎంత పగ ఉన్నదో, ఎంత కసిఉన్నదో పలు సందర్భాలలో వారి మాటల్లోనే అర్థమవుతోంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలపై విశ్లేషిస్తూ ‘రేవంత్ కన్నా భట్టి బెటర్’ అనే శీర్షికతో కథనాలు వండి వార్చడం వెనుక ఉన్న వ్యూహాన్ని పసిగట్టడం చాలా తేలిక. కెసిఆర్ అండ్ కోకు రేవంత్ మినహా మరెవరైనా ఫర్వాలేదన్న సందేశమిస్తున్నారు. ‘క్రూరమైన రాజకీయాలను’ అణచివేయాలంటే క్రూరంగానే వ్యవహరించాలన్నది పురాతన నానుడి. కెసిఆర్, కెటిఆర్ తమ పాలనలో పాల్పడ్డ చట్ట వ్యతిరేక చర్యలు, దోపిడీలను నిలదీయాలన్నా, వాటిని బహిరంగం చేసి, ప్రజల ‘బోను’లో నిలబెట్టాలన్నా అది రేవంత్ రెడ్డికి మాత్రమే సాధ్యమవుతుందని కాంగ్రెస్ కార్యకర్తలు గట్టిగా నమ్ముతున్నారు. ఆయనను మార్చినా, ఆయనకు కన్ను, ముక్కు, చెవిగా వ్యవహరిస్తున్న అదనపు ఇంటెలిజెన్స్ డిజిపి శివధరరెడ్డిని తప్పించినా ‘అధికారం కెసిఆర్ చేతిలో పెట్టినట్లే’ అని ఒక సీనియర్ జర్నలిస్ట్ వ్యాఖ్యానించారు.

కాగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాను, బిఆర్‌ఎస్ సోషల్ మీడియా ‘ఓవర్ చేసి ముందుకు దూసుకుపోతున్నట్టు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా మీడియా లేదా సోషల్ మీడియాతో బలోపేతం కాదు. కెసిఆర్ 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించిన వేళ ఒకటే అరా న్యూస్ ఛానళ్ళే ఉన్నాయి. మీడియా ఇంత విస్తృతంగా లేదు. సోషల్ మీడియా పుట్టనే లేదు. ఆ పరిస్థితిలో కూడా ఆ పార్టీ నిలబడగలిగిందంటే, పుంజుకున్నదంటే, పద్నాలుగేళ్ల పాటు ఉద్యమం కొనసాగిందంటే ప్రజలే కారణం. తెలంగాణ భావోద్వేగపు నిప్పు కారణం. ఆ నిప్పు ఆరిపోకుండా ప్రజలే దాన్ని కాపాడుకున్నారు తప్ప అది కెసిఆర్ ఘనకార్యం కానేకాదు.

ఇప్పుడు మరలా ఉద్యమం అన్నా, సంకల్ప దీక్ష అన్నా, ఊరూవాడా ఏకం చేస్తామన్నా నమ్మేవారు లేరు. బిఆర్‌ఎస్ వెంట నడిచేవారు కూడా లేరు. తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో బిఆర్‌ఎస్ పార్టీ ఎవరి సొంతమో,అది ఏ సామాజికవర్గం కోసం పని చేసిందో,ఏ సామాజికవర్గ ప్రయోజనాలు కాపాడిందో, పార్టీ అంటే కుటుంబం, కుటుంబం అంటే పార్టీగా ఎలా కొనసాగిందో తెలంగాణ సమాజం కండ్లారా చూసింది. ఇంకా ఆ సామాజికవర్గాన్ని నమ్మడమంటే, కెసిఆర్ కుటుంబ సభ్యులను నమ్మడమంటే ఆత్మహత్యా సదృశ్యంగా ప్రజలు భావిస్తున్నట్టు పరిశీలకులు అంటున్నారు.

‘‘ఫార్మా విలేజ్ కాదు, పారిశ్రామిక కారిడార్ అంటూ సిఎం రేవంత్ రెడ్డి మాట మార్చారు. నరం లేని నాలుక ఏదైనా మాట్లాడుతుంది’’ అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఫార్మా విలేజ్ భూసేకరణను అడ్డుకుంటున్నది బిఆర్‌ఎస్ పార్టీయే. ఆ పార్టీ ప్రోత్సాహంతోనే ‘సంఘవ్యతిరేక శక్తులు’ గిరిజనుల్లో కలిసిపోయి, వికారాబాద్ జిల్లా కలెక్టర్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంటు అథారిటీ ఛైర్మన్ తదితర రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ‘హత్య చేయడానికి’ ప్రయత్నించారన్న ఆరోపణలూ ఉన్నవి. ఫార్మా విలేజ్ కు బదులుగా ‘ఇండస్ట్రియల్ కారిడార్’ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించడం మాట మార్చడమో, లేదా తప్పించుకోవడమో, సమస్య నుంచి పారిపోవడమో కాదు.’ ఎక్కడ తగ్గాలో’ తెలుసు కనుక రేవంత్ రెడ్డి ప్రజల అభిప్రాయానికి విలువ ఇచ్చినట్టు భావించవలసి ఉన్నది.

సిపిఐ, సిపిఎం పార్టీల నాయకుల బృందానికి సమయం ఇచ్చి వారి అభిప్రాయాలను తెలుసుకొని ‘పారిశ్రామిక కారిడార్’గా మార్చుతున్నట్టు సిఎం ప్రకటించారు. ఇదొక ప్రజాస్వామిక సంప్రదాయం. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలంటే ముందుగా వాళ్ళ అభిప్రాయం తెలుసుకోవాలి. అంటే వినాలి. కెసిఆర్ ముఖ్యమంత్రిగా, కెటిఆర్ మంత్రిగా ఏనాడైనా ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశారా? కమ్యూనిస్టు పార్టీలను తమ పార్టీ అవసరాల కోసం ‘కామ్రేడ్ల’కు దుర్భేధ్యమైన ప్రగతిభవన్ గేట్లు తెరచుకున్నవి తప్ప ఆ పార్టీలను, రాజకీయ పార్టీలుగా తండ్రీ కొడుకులు గుర్తించడానికి ఇష్టపడలేదు. గౌరవించడమన్నది చాలా దూరపు సంగతి.

‘‘ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రైవేటు సైన్యంతో, పోలీసు బలగాలతో గ్రామాలలో స్వైర విహారం చేస్తున్నారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టి, జైళ్లకు పంపి అక్రమ నిర్బంధం, అణచివేతకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అక్కడ పెట్టేది ఫార్మా సిటీ కాదు, ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ మాటమార్చి ఎవర్నీ పిచ్చోళ్లను చేస్తున్నావ్’’ అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, నిరంతరం సిఎం రేవంత్ రెడ్డిపై కయ్యానికి కాలు దువ్వుతూ, చెలరేగిపోతున్న కెటిఆర్ అన్నారు. ఇందులో రెండు అంశాలను పరిశీలించాలి. సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే, ఆయన సోదరులను లక్ష్యంగా చేసుకొని బిఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తున్నది. ఒకసారి కొండల్ రెడ్డి, మరోసారి తిరుపతిరెడ్డి... ఇలా సిఎం సోదరులు భూకబ్జాలకు పాల్పడుతున్నట్టుగానో, రాష్ట్రాన్ని దోచుకు తింటున్నట్టుగానో ప్రచారం సాగిస్తున్నారు.



ఇదంతా నియంత హిట్లర్ కుడి భుజంగా పనిచేసిన ‘గోబెల్స్’ ఫార్ములా.’ ఒకే అబద్ధాన్ని పదే, పదే విరివిగా చెబుతూ వెళితే చివరకు ప్రజలు అది నిజమని నమ్ముతారు’ అని గోబెల్స్ నమ్మాడు. అలాగే అతను దాన్ని ఆచరించి చూపాడు. అధికారం కోల్పోయాక బిఆర్‌ఎస్ కూడా ‘అటో, ఇటో, ఎటో’ అన్నట్టుగా ప్రవర్తిస్తున్నది. సిఎం.రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై బురద జల్లడం ద్వారా తమకు రాజకీయంగా మైలేజ్ వస్తుందని కెసిఆర్, కెటిఆర్, హరీశ్ తదితరులు నిర్ధారణకు ఎట్లా వచ్చారో అంతు చిక్కడం లేదు. మరొక అంశం... ఫార్మా విలేజి విషయంలో ముఖ్యమంత్రి మాట మార్పు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాస్వామికంగా వ్యవహరించడం బిఆర్‌ఎస్‌కు నచ్చడం లేదు. కెసిఆర్ వలె ‘నియంతృత్వం’ గా పరిపాలిస్తే వాళ్ళు సంతోషించేవాళ్లేమో! లేదా ‘గడీ’ల వలె దుర్భేధ్యమైన కోటలు నిర్మించుకొని, ప్రజలకు దూరమై పరిపాలించాలని అనుకుంటున్నారేమో! కాగా ఒక నిర్ణయం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చినప్పుడు, ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోవడం సత్సంప్రదాయం. తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకొని, సవరణలు చేసుకోవడం హర్షణీయం. ఆదర్శప్రాయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల మాట విన్నారు. ప్రజల మాట విన్న వాళ్ళు, ప్రజాభీష్టానికి అనుగుణంగా పనిచేసిన వాళ్ళు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతారు. డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి లాంటి పాలకులను సీనియర్ జర్నలిస్టులు, విశ్లేషకులు అందుకే తరచూ గుర్తు చేస్తూ ఉంటారు.

కొడంగల్ వంటి మారుమూల ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని ప్రజలు అనుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు కొందరు గూండాలు, రౌడీమూకలను తయారు చేసి, పైసలు ఇచ్చి కలెక్టర్, ఆర్డీవోలు, అధికారులపై దాడులకు పాల్పడితే, వాళ్ళను కొట్టి చంపడానికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేయడం ఎలా చట్టవ్యతిరేకమవుతుంది? అక్రమ నిర్బంధాలు ఎలా అవుతాయి? అణచివేత ఎలా అవుతుంది?

‘‘రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టొద్దా? ఆ ప్రయత్నం మేం చేయొద్దా? కొడంగల్లో 1100 ఎకరాలు సేకరిస్తే మీకు కడుపు మంట ఎందుకు? భూసేకరణలో ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందే. ఎవరూ తమ భూమిని ఇష్టంగా ఇవ్వరు. బాధలో ఉన్న రైతులకు తగిన నష్టపరిహారం ఇస్తాం’’ అని సిఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ,పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాలపై భారత రాష్ట్ర సమితి తమ పాలసీని ప్రకటించవలసి ఉన్నది. తెలంగాణలో భూమిని తల్లిగా ప్రజల్లో బలమైన భావన ఉంటుంది. భూమి నుంచి వారిని తొలగించడం అనే ఊహ వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఊపిరి సలపనివ్వదు. భూసేకరణ అంశం చాలా సున్నితమైందన్న సంగతి బిఆర్‌ఎస్‌కు మాత్రమే కాదు, మిగతా రాజకీయ పార్టీలకూ తెలుసు.ఆ విషయాన్ని జాగ్రత్తగా హ్యాండిల్ చేయకపోతే ‘లగచర్ల’ ఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.

‘‘కాంగ్రెస్ ఏడాది పాలనలో చెప్పుకునేందుకు ఒక్క సంక్షేమ పథకమూ లేదు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రతిష్ఠ మసకబారింది. ఈ నేపథ్యంలో ఏ ముఖం పెట్టుకుని ఏడాది సంబరాలంటూ ప్రజల్లోకి వెళ్లాలన్న అంతర్మథనం కాంగ్రెస్ నేతల్లో మొదలైంది’’ అని బిఆర్‌ఎస్ చెబుతోంది. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా అమలవుతున్నవి. రైతులకు రుణమాఫీ చేయడం, డిఎస్‌సి, గ్రూప్ 1 పరీక్ష, పెద్ద పెట్టున ఉద్యోగాలు కల్పించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్ సిలెండర్, ఇందిరమ్మ ఇళ్ళు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. మరికొన్ని కార్యక్రమాల అమలు ప్రక్రియకు కార్యాచరణ జరుగుతోంది. సమస్య ఏమిటంటే కెసిఆర్ హయాంలో పెండింగులో పడిపోయిన అనేక పనులను పూర్తిచేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారింది. దీనికి కారణం కెసిఆర్ చేసిన అప్పులు. వాటికి వడ్డీ కింద ఆరున్నర వేల కోట్లు ప్రభుత్వం చెల్లించవలసి వస్తున్నది. ‘అప్పు చేసి పప్పు కూడు’ వలె కెసిఆర్ ప్రభుత్వం ‘ఓటుబ్యాంక్’ రాజకీయాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసినట్టు పలు సందర్భాలలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శలు గుప్పిస్తున్నారు. రైతుబంధు రూపంలో భూస్వాములు, రియల్టర్లకు కూడా ప్రజాధనాన్ని దోచిపెట్టినట్టు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనికి సంక్షేమం అని అందమైన పేరు పెట్టారని వారంటున్నారు. అయితే కెసిఆర్ హయాంలో చేసిన అప్పు అంతా సంపదను సృష్టించడం కోసమేనన్నది కెటిఆర్ వాదన. కానీ, ఆ అప్పు తమ తదనంతర ప్రభుత్వానికి సంకటంగా మారుతుందని ఎందుకు అంచనా వేయలేదు?

సాధారణంగా మనం వినే, లేదా చెప్పుకునే విధ్వంసాలలో ‘ఆర్థిక విధ్వంసం’ చాలా సంక్లిష్టమైనది. దాన్నుంచి బయటపడడం మామూలు వ్యవహారం కాదు. ఆర్థిక విధ్వంసం వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి రోజుకు 18గంటలు పనిచేయవలసి వస్తోంది. ‘రైతుబంధు’ రూపంలో ‘దుబారా’ జరగకుండా ఉండడానికి, అర్హులైన రైతులకు మాత్రమే రైతుభరోసా అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం సంకల్పించింది. దీనికి సంబంధించిన విధి విధానాలు, మార్గదర్శకాల రూపకల్పన కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటయింది. కమిటీ నివేదిక ఆధారంగా ఎన్ని ఎకరాలు ‘కటాఫ్’ పెట్టాలో నిర్ణయించనున్నారు.

రుణ మాఫీ మరో 22 లక్షల మంది రైతులకు చెల్లించవలసి ఉన్నది. వాళ్లందరికీ త్వరలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే హామీ ఇచ్చారు. కాగా ‘‘బిఆర్‌ఎస్ హయాంలో వేసిన నోటిఫికేషన్లకు ఇప్పుడు నియామక పత్రాలు ఇస్తున్నారు. తామే ఇచ్చుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు’’ అని బిఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు తోసిపుచ్చుతున్నారు. బిఆర్‌ఎస్ హయాంలో కేవలం నోటిఫికేషన్ల జారీ, పరీక్షల ప్రశ్న పత్రాల లీకులు, పరీక్ష వాయిదాలు, కోర్టులు కేసులు మినహా జరిగిందేమీ లేదన్నది కాంగ్రెస్ నాయకుల వాదన.

‘‘ఇప్పటి వరకు పాలన మీద ముఖ్యమంత్రి కార్యాలయం పట్టు సాధించలేకపోయింద’’ని మరో ప్రచారానికి బిఆర్‌ఎస్ తెర లేపింది. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీశ్ రావు వంటి వారి దృష్టిలో ‘పాలన మీద పట్టు’ కెసిఆర్ కే సాధ్యమని అర్థం. కెసిఆర్ మినహా మరెవరూ పరిపాలించలేరని, తెలంగాణ గురించి ఆయన తప్ప మరెవరికీ అవగాహన లేదని వాళ్ళ మాటల్లోని తాత్పర్యం.

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకం

ఈ రోజుల్లో మానవుని దినచర్య ప్లాస్టిక్ వాడకంతోనే మొదలవుతున్నది. కిరాణా సామాగ్రి ప్యాకేజింగ్ నుండి మన వంటశాలలలో నిల్వచేసే కంటైనర్ల వరకు, ప్లాస్టిక్ ప్రతిచోటా ఉంటున్నది. అయితే, ఇది మనకు సౌకర్యవంతంగా ఉంటున్నా పర్యావరణానికి భూమిపై ఉన్న అన్ని జీవరాసులకు పెనుముప్పుగా సంభవిస్తున్నది.

మైక్రోప్లాస్టిక్ ఇప్పుడు మన ఆహారం, నీరు, పీల్చే గాలిలో కూడా వ్యాపించాయని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి ప్లాస్టిక్ ఉత్పత్తులను నిరుపయోగంగా ఉంచినప్పుడు అవి చిన్న కణాలుగా విచ్ఛిన్నమవుతున్నవి. చివరికి మైక్రోప్లాస్టిక్‌లుగా మారతాయి. ఇవి శతాబ్దాలపాటు పర్యావరణం లో కొనసాగుతాయి. టాక్సిక్స్ లింక్ యొక్క ఇటీవలి నివేదిక ఉప్పు, చక్కెర వంటి రోజువారీ ఆహార పదార్థాలలో మైక్రోప్లాస్టిక్ కాలుష్యం యొక్క పరిధిని వెలుగులోకి తెచ్చింది. అయోడైజ్డ్ ఉప్పులో అత్యధిక కాలుష్యం కనుగొనబడింది. సముద్రపు ఆహారం, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు మరియు తాగునీటిలో కూడా మైక్రోప్లాస్టిక్ కణాలను అధ్యయనాలు కనుగొన్నాయి



మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్‌ల ప్రభావం అనేది ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్న అధ్యయన రంగం. అయితే ప్రాథమిక పరిశోధనలు చాలా లోతుగా ఉన్నాయి. మెక్సికో విశ్వవిద్యాలయం నిర్వహించిన పరిశోధనలో మెదడుతో సహా మానవ అవయవాలలో మైక్రోప్లాస్టికులు పేరుకుపోతాయని వెల్లడించింది. సగటు మానవ మెదడు బరువు ప్రకారం 0.5%ప్లాస్టిక్‌ను కలిగి ఉంటుందని అధ్యయనం కనుగొన్నది. మైక్రోప్లాస్టిక్‌లు సెల్యులార్ ప్రక్రియలలో జోక్యం చేసుకోవచ్చని, హార్మోన్ నియంత్రణకు అంతరాయం కలిగిస్తుందని, రోగనిరోధక పనితీరును బలహీనపరుస్తుందని, కేన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

మైక్రోప్లాస్టిక్‌లు మానవ శరీరంలోకి ప్రవేశించే ప్రాథమిక మార్గాలలో ఒకటి ఆహారం తీసుకోవడం. ఉత్పత్తి ప్రాసెసింగ్ ప్యాకేజింగ్ లేదా రవాణా సమయంలో మైక్రోప్లాస్టిక్‌లతో కలుషితమైన ఆహారాన్ని మనం తినేటప్పుడు ఇది సంభవించవచ్చు. మన ఆహారంలో మైక్రోప్లాస్టిక్ విస్తృతంగా ఉండేందుకు ఆహార పరిశ్రమ బాధ్యత వహిస్తుం ది. ఆహార ప్రాసెసింగ్, రవాణా సమయంలో సరిపోని భద్రతా చర్యలతో కలిపి ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై అధికంగా ఆధారపడటం మైక్రోప్లాస్టిక్ ఆహార సరఫరాలో విస్తరించడానికి అనుకూలిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆహార పరిశ్రమ తక్షణ చర్యలు తీసుకోవడం అత్యవసరం. ఆహార కంపెనీల నుండి మరింత పారదర్శకత, జవాబుదారీతనం డిమాండ్ చేయడం, స్థిరమైన, సురక్షితమైన ప్యాకేజింగ్‌ను ఉపయోగించే ఉత్పత్తులను ఎంచుకోవడం ద్వారా వినియోగదారులు కూడా ప్రధాన పాత్ర నిర్వహించాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మైక్రోప్లాస్టిక్ కాలుష్యం, మానవ ఆరోగ్యంపై దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి సమగ్ర అధ్యయనాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధనా సంస్థల సహకారంతో కూడిన ఈ అధ్యయనం సమస్య యొక్క పూర్తి పరిధిని అర్థం చేసుకోవడానికి, దానిని తగ్గించడానికి వ్యూహాలను అభివృద్ధి చేయడానికి కీలకమైన దశ. అయితే పాలసీ స్థాయిలో మరిన్ని చేయాల్సి ఉంటుంది. ఇందులో ఆహార పరిశ్రమలో ప్లాస్టిక్‌ల వాడకంపై కఠినమైన నిబంధనలు అట్లాగే బయోడిగ్రేడబుల్, కంపోస్ట్ చేసే ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు ఉన్నాయి. మైక్రోప్లాస్టిక్‌ల వల్ల కలిగే నష్టాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించడానికి, మరింత స్థిరమైన వినియోగ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రజలకు అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలలో ప్రభుత్వం పెట్టుబడి పెట్టాలి

దండంరాజు రాంచందర్ రావు, 9849592958

# ఆధునిక పెళ్లిళ్లు - వింత పోకడలు

లేఖ

నేడు ఉన్న సమాజంలో రోజురోజుకి పెళ్లిళ్లు చూస్తుంటే సమాజం ఎటువైపు పయనిస్తుందో అర్థం కావటం లేదు, పెళ్లిళ్ల పేరుతో వింత పోకడలు కనిపిస్తున్నాయి. మనం చూశాం కొన్ని నెలల క్రితం దేశంలో అధిక ధనవంతుడు అయిన అంబానీ కొడుకు పెళ్లి సుమారు నెలరోజుల పాటు సాగింది, ప్రపంచంవ్యాప్తంగా ముఖ్యులు పెళ్లికి అతిథులుగా హాజరయ్యారు, ఇదేతంతు కాస్త పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కూడా వచ్చేసింది, నేడు ఉన్న పెళ్ళిళ్ళ తీరు పరిశీలిస్తే ఒక సామాన్య కుటుంబంలో కూడా కొన్ని ఏండ్ల పాటు సంపాదించి, అప్పులు చేసి మరీ సమాజం మెప్పుకోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు,

**వింత పోకడలు:** ప్రి వెడ్డింగ్ షూట్ అని చేస్తారు, దానికి సుమారు లక్ష రూపాయలకు పైనే ఖర్చు అవుతుంది, అది అంత గొప్పగా భావించడం జరుగుతుంది, పెళ్ళిళ్ళలో తాగి చిందులు వేయడం కోసం అధిక సౌండ్ ఎఫెక్ట్స్‌తో కూడుకున్న డిజె సౌండ్స్ పెట్టి సౌండ్ పొల్యూషన్ చేయడం జరుగుతుంది, దానివల్ల ఎంతోమంది గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వాళ్ళు అధిక శబ్ధం వల్ల ప్రాణాలు పోయే అవకాశం ఉంది అని చెప్పవచ్చు

ముఖ్యంగా సామాన్య ప్రజానీకం గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏంటి అంటే ఎన్ని రకాలుగా ఖర్చుపెట్టిన ఎవరు ఏం అనరు, సమాజంలోని స్థాయి ఏంటో చెప్తుంది, పెళ్ళిళ్ళ పేరుతో అధిక ఖర్చులు పెట్టడం మానేయండి, ఈ రోజు అప్పులు చేసే పెట్టిన ఖర్చు రేపు సంపాదించాలంటే ఎన్ని రోజులు పడుతుంది అని ఆలోచన చేయాలి, ధనవంతులు ఉన్న వాళ్ళు చేస్తున్నారు అని మనం చేయడం చాలా బుద్ధి హీనం గా భావించాలి, కాబట్టి పెళ్ళిళ్ళ పేరుతో అధిక ఖర్చులు పెట్టడం మానెయ్యాలి అని భావి భారత సమాజాన్ని కోరుకుందాం.

కిరణ్ ఫిషర్

# గాజాలో 400 రోజులుగా మారణహోమం..ఐరాస మౌనం!

పాలస్తీనా ప్రజలకు గౌరవం, మానవ హక్కులు, న్యా యం, ఆత్మ విశ్వాసం ఇనుమడించే విధంగా ఐరాస సభ్య దేశాలు, ప్రపంచ మానవాళి గళం కలపవలసిన సందర్భంగా ప్రతి ఏట 29 నవంబర్ రోజున అంతర్జాతీయ పాలస్తీనా ప్రజలతో సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సాలిడారిటీ విత్ ది పాలస్తీనా పీపుల్) పాటించుట 1978 నుంచి ఆనవాయితీగా మారింది. 07 అక్టోబర్ 2023న హమాస్ సంస్థ ఇజ్రాయిల్‌పై ఆకస్మిక రాకెట్ దాడు లు చేయడంతో 1,139 మంది చని పోవడంతో ప్రతీకారంగా ఇజ్రాయిల్ ప్రతిదాడులు చేయడంతో రెండు ప్రాంతాల మధ్య ఇప్పటివరకు భీకర యుద్ధం కొనసాగుతోంది. నేడు ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో పాలస్తీనా ప్రజలు, ముఖ్యంగా గాజా ప్రాంత ప్రజలు, పిల్లలు/మహిళలు నిరాశ్రయులు కావడం, ఆవాసాలు నేల మట్టం కావడం, 43,000 మంది అమాయకులు ప్రాణా లు కోల్పోవడం జరిగింది, ఈ మారణహోమం ఇంకా కొనసాగుతూనే ఉన్నది.




29 నవంబర్ అంతర్జాతీయ పాలస్తీనా ప్రజలకు సంఘీభావ దినం

**మానవ హక్కుల హననంతో సంక్షోభంలో పాలస్తీనియన్లు:**

నేడు పాలస్తీనా ప్రజలు అత్యంత ప్రమాదకర మానవ హక్కుల సంక్షోభంలో పడడంతో ప్రపంచ పౌర సమాజం వారి పక్షాన నిలిచి సంఘీభావం తెలుపుతున్నది. ప్రస్తుతం వెస్ట్ బ్యాంక్, ఈస్ట్ జెరుసాలెమ్ ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించి మిలటరీ ఆపరేషన్స్, ఆవాసాల విధ్వంసాలు, బలవంతంగా ఖాళీ చేయించడం, అక్కడి ప్రజలను హింసించడం, ప్రాణాలు తీస్తామని బెదిరించడం కొనసాగుతూనే ఉన్నది. వెంటనే బేషరతుగా కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరు ప్రాంతాలు సంతకాలు చేయడం, బంధాలను విడుదల చేయడం, అక్రమంగా ఆక్రమించిన పాలస్తీనా భూభాగాన్ని ఖాళీ చేయడం జరగాలని అంతర్జాతీయ సమాజం కోరుతున్నది.

**ఐరాస ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు:**

ఐరాస సర్వసభ్య సమావేశం సూచించినట్లుగా రెండు భాగాలు లేదా రాజ్యాలుగా (ఆరబ్, జూయిష్) విడిపోయి, జెరుసలెమ్ రాజధానిగా రెండు రాజ్యాలు శాంతి, సహజీవ న విలువలతో జీవించాలని కోరుతూ 29, నవంబర్ 1947 రోజున తీర్మానించడం జరిగింది. ఆ చారిత్రాత్మక రోజుకు గుర్తుగా ప్రతి ఏట అంతర్జాతీయ పాలస్తీనా ప్రజలకు సంఘీభావదినం పాటించుట ఆనవాయితీగా మారింది. 29 నవంబర్ వేదికగా అంతర్జాతీయ సమాజం పాలస్తీనా పక్షాన\నిలవడం, వారి హక్కులకోసం గళమెత్తడం, స్వయం నిర్ణయాలు తీసుకోవడం, వారి ప్రాంతా న్ని వారే పాలించుకోవడం, వలస వెళ్లిన వారు తిరిగి తమ పూర్వపు గృహాలు/ఆస్తులపై హక్కులను పొందడం లాంటి కనీస విషయాల్లో పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడడం జరుగుతున్నది. పైన పేర్కొన్న అంశాలను అర్థం చేసుకొని పాలస్తీనా ప్రజలకు తమ కనీస హక్కులను కల్పించాలని, వారు కూడా తమ కలల సాకారంతో శాంతియుతంగా జీవించడానికి అవకాశం కల్పించాలని కోరుకుందాం. నేడు ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని, శాంతియుతంగా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రపంచ మానవాళి కోరుతున్నది.

# వ్యవ‘సాయానికి’ డ్రోన్లు...

ప్రతీ ఎనిమిది సంవత్సరాలకు ఏ రంగంలోనయినా చెప్పుకోదగ్గ మార్పులు వస్తాయనేది అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి వ్యవసాయరంగం మినహాయింపు కాదు. వ్యవసాయ ఆధారిత దేశమైన మన దేశంలో సుమారు 77%శాతం ప్రజానీకం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారానే ఉపాధి పొందుతున్నారు. రైతన్న అనుకూలించని ప్రకృతి, పంట దిగుబడిలో క్షీణత, ఖరీదైన రసాయన మందులు వాడాల్సిరావడం, నైపుణ్య ఉన్న మానవ వనరుల కొరత, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడం లాంటి ఎన్నో ఒడిదుడుకులను పంట చేతికొచ్చేవరకు ఎదుర్కొంటున్నాడు. మారుతున్న కాలంతోపాటు, పెరుగుతున్న జనాభాకి సరిపడా ఆహారం పండించాలన్నా, వ్యవసాయంలో పెరుగుతున్న వ్యవసా య కూలీల కొరతను అధిగమించాలన్నా వ్యవసాయంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. ఈ నూతన సాంకేతికతలో వ్యవసాయ డ్రోన్లు ముందు వరుసలో ఉంటాయనేది కాదనలేని నిజం.

**బహుళ సహాయకారి:** డ్రోన్లో పురుగుమందులు, పోషకాలను నింపడానికి 5నుంచి 10 కిలోల అధిక సామర్థ్యం కలిగిన మానవరహిత ట్యాంకు ఉంటుంది. సాంప్రదాయక ఎరువుల కంటే పంట ఉత్పాదకతను 8% నుండి 25% పెంచి, పర్యావరణ ప్రభావాన్ని 50% నుండి 70% వరకు తగ్గించే మరింత ప్రభావవంతమైన, పర్యావరణ అనుకూలమైన నానో యూరియా, నానో డిఎపి లను సమర్థవంతంగా పిచికారీ చేయొచ్చు. డ్రోన్ కేవలం 15 నిమిషాల్లో దాదాపు ఎకరం భూమిలో పురుగుమందును ఏకరీతిగా పిచికారీ చేస్తుంది. ఇది రైతుల సమయాన్ని, డబ్బును ఆదా చేస్తుంది.

**ఉపాధి కల్పన:** వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగల డ్రోన్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షకులు అవసరం కాబట్టి ఇవి గ్రామీణ ప్రాంతంలో యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. మనదేశంలో డ్రోన్ పరిశ్రమ 2030 నాటికి తయారీ సామర్థ్యానికి 5,00,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.

**భయాలు పోగొట్టాలి :** డ్రోన్ సాంకేతికతను స్వీకరించడానికి ఆటంకం కలిగించే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డ్రోన్ల వాడకం వల్ల మానవ శ్రమ అవసరం తగ్గుతుందని, తమ జీవనోపాధి దెబ్బతింటుందని చాలా మంది కూలీలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి అనుకూలమైన ఎనేబుల్ చేసే పర్యావరణ వ్యవస్థను రూపొందించడం అవసరం. డ్రోన్లు భారతీయ వ్యవసాయాన్ని మార్చడానికి, దేశ ఆహార భద్రత శ్రేయస్సును నిర్ధారించడానికి శక్తివంతమైన సాధనం.అయితే వీటిని ఉపయోగించడంలో కొన్ని సందేహాలను, రైతుల భయాలను పోగొట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

వైద్య ఆరోగ్య శాఖ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా ఆరోగ్యంపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తొలి ఏడాది లోనే వైద్యారోగ్య శాఖలో నియామకాలు, నూతన వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల మంజూరు, సీట్లు, బెడ్ల పెంపు లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల' జారీ పైలెట్ ప్రాజెక్టును కూడా చేపట్టింది. అధికారంలోనికి వచ్చిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 2014 నుంచి 2023 అక్టోబర్ వరకూ గత ప్రభుత్వం నెలకు సగటున రూ.52 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకూ నెలకు సగటున రూ.76 కోట్లను ఖర్చు చేసింది. కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో మొత్తం ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్య 1835కి పెరిగింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచే ప్రజారోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిధుల కేటాయింపుతో పాటు నియామకాలపైనా దృష్టి సారించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. 11 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సల ధరల పెంపు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించింది. 6 నెలల్లో సమస్యను పరిష్కరించింది. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే 1,375 వైద్య చికిత్సల ధరలను సుమారు 20 శాతం వరకూ పెంచింది. తద్వారా ఆరోగ్యశ్రీకి ప్రజా ప్రభుత్వం పునరజ్జీవం పోసింది. న్యూక్లియర్ మెడిసిన్, ఇంటర్‌వెన్షన్‌లో రేడియాలజి వంటి ఖరీదైన వైద్య సేవలను కూడా ఆరోగ్యశ్రీ పేషెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. పెరిగిన ధరలు, కొత్తగా అందుబాటులోకి వచ్చిన చికిత్సల కోసం అదనంగా రూ.487.29 కోట్లను ఆరోగ్యశ్రీ నిమిత్తం కేటాయించింది.

**అధునాతనంగా కొత్త ఉస్మానియా ...**

హైదరాబాద్‌లోని గోషామహల్‌లో సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి పోలీస్ శాఖ నుంచి ఆరోగ్యశాఖకు భూ బదలాయింపు ప్రక్రియ పూర్తయింది. రూ.2వేల కోట్లతో నూతన ఉస్మానియా ఆస్పత్రిలో అత్యాధునిక వసతులు, ఆపరేషన్ థియేటర్లతో పాటు 28 వైద్య విభాగాల సేవలు అందనున్నాయి. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం కొత్త హాస్టల్ బిల్డింగ్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించి రూ.204.85 కోట్లను కేటాయించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో నర్సింగ్, పారామెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఏడాది కాలంలోనే 16 నర్సింగ్ కాలేజీలను, 28 పారామెడికల్ కాలేజీలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్కో నర్సింగ్ కాలేజీలో 60 బిఎస్‌సి సీట్ల చొప్పున మొత్తం 960 సీట్లను ఈ విద్యాసంవత్సరం నుంచే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో పారామెడికల్ కాలేజీలో 60 సీట్ల చొప్పున, 28 కాలేజీల్లో ఏడాదికి 1,680 మంది విద్యార్థులు పారామెడికల్ కోర్సులను అభ్యసించబోతున్నారు.

**ఉద్యోగాల జాతర**

ప్రభుత్వ దవాఖానాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అనతికాలంలోనే ఆరోగ్యశాఖలో 7,750 పోస్టులను భర్తీ చేసింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి) ద్వారా మరో 6,494 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మరో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 1,690 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులు, 308 ఫార్మాసిస్ట్ (ఆయుష్) పోస్టుల భర్తీకి త్వరలోనే ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి నోటిఫికేషన్లు ఇవ్వనున్నది. జూనియర్ డాక్టర్లకు సంబంధించిన స్టైఫండ్ చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించింది.

**కొత్త వైద్య కళాశాలలు**

ఎనిమిది నెలల కాలంలోనే 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ములుగు, గద్వాల్, నర్సంపేట్, నారాయణపేట్, మెదక్, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, యాదాద్రిలో కాలేజీలు, హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసింది. ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున మొత్తం 400 ఎంబిబిఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 3,690 నుంచి 4,090కు పెరిగింది. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌లో 50 ఎంబిబిఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ, 50 సీట్ల కెపాసిటీతో ఫిజియోథెరపీ కాలేజీ, 30 సీట్ల కెపాసిటీతో పారామెడికల్ కాలేజీల ఏర్పాటుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసింది. కొడంగల్లో 50 బెడ్ల హాస్పిటల్‌ను 220 బెడ్ల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసింది. మంచిర్యాలలో 600 బెడ్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేయగా, ఇటీవలే మంత్రులు ఆ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

**కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లు**

రాష్ట్రంలో పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేసింది. దీంతో అందుబాటులో ఉన్న 20 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 89 డయాలసిస్ మిషన్లను పేషెంట్లకు అందుబాటులోకి వచ్చాయి. దయాలసిస్ పేషెంట్లకు అవసరమైన సర్జరీలు నిమిత్తం సుమారు రూ.33 కోట్లతో వాస్కులర్ సెంటర్లను మంజూరు చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ, ఉస్మానియా, వరంగల్‌లోని ఎంజిఎం, ఖమ్మం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మహబూబ్‌నగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్‌లో వాస్కులర్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. మాతృత్వం కోసం పరితపిస్తున్న దంపతులకు రూ.లక్షల ఖరీదైన ఐవిఎఫ్ సేవలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గాంధీ ఆస్పత్రిలో ఐవిఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పేట్లబుర్జు దవాఖాన, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ హాస్పిటల్, వరంగల్ ఎంజిఎంలోనూ ఐవిఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**30 కిలోమీటర్ల చొప్పున మొత్తం 74 ట్రామా కేర్ సెంటర్లు**

రోడ్డు ప్రమాదాల్లో, ఇతర ఎమర్జెన్సీ సమయంలో బాధితుల ప్రాణాలు కాపాడుకునేలా రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు రూ.వెయ్యి కోట్లతో రెండు సంవత్సరాల్లో ట్రామా కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జీవన్‌దాన్ వ్యవస్థను ప్రక్షాళన చేసి, పారదర్శక చర్యలు చేపట్టింది. అన్ని ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్స్‌లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గాంధీ, ఉస్మానియా, ఎంజిఎంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఆ తర్వాత దశలవారీగా అన్ని టీచింగ్ హాస్పిటల్స్‌లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కాగా ఆరోగ్యశ్రీ కింద ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలను ఉచితంగా చేయిస్తోంది ఇంతకు ముందు సేవలు అందని మండలాల్లో వైద్య సేవలు అందించేందుకు వీలుగా రూ.30 కోట్లతో 222 నూతన అంబులెన్స్‌లను అందించనుంది. 136 నూతన 108 అంబులెన్స్‌లను, ఇందులో గిరిజన ప్రాంతాలకు 45 అంబులెన్స్‌లను కేటాయించనున్నారు.

## చట్టసభలో ఆ ఎమ్మెల్యేలను అడ్డుకోలేం

ఫిరాయింపులపై పాల్ 'పిల్'
మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు 'నో'

**హైదరాబాద్ :** పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో జరిగే కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ వేసిన మధ్యంతర పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను తగిన సమయంలోగా విచారణ పూర్తి చేయాలన్న తమ ఉత్తర్వులను స్పీకర్ అమలు చేయాల్సివుందని చెప్పింది. కాబట్టి పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా, అసెంబ్లీకి హాజరుకాకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే మధ్యంతర ఆదేశాల జారీ సాధ్యం కాదని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్టి జె.శ్రీనివాస్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం జడ్జిమెంట్ ఇచ్చింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేలపై పాల్ వేసిన పిల్‌లో మధ్యంతర పిటిషన్‌ను కొట్టేసింది.



## రవాణా శాఖలో పదోన్నతులు

### రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పదోన్నతి పొందిన అధికారుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం / హైదరాబాద్: రవాణా శాఖలో డిటిసి లను జెటిసి లుగా, ఆర్‌టిఓ లను డిటిసి లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వాహనదారులకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించడానికి కృషి చేయాలని పదోన్నతి పొందిన అధికారులకు ఈ సందర్భం గా మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గనిర్దేశనం చేశారు. రవాణా శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించినందుకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, శివలింగయ్య, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన రవీందర్‌కుమార్, వాణి, సదానందం, కిషన్, సురేష్‌రెడ్డిలు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ వల్లనే రవాణా శాఖలో పదోన్నతులు సాధ్యమయ్యాయని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్‌కుమార్, తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గురివింద గింజ తరహాలో బిఆర్ఎస్ తీరు

కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ వ్యవహారశైలి గురివింద గింజ తరహాలో ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎవరికి ఎవరు దోస్తులు అనేది తెలంగాణ సమాజానికి తెలిసిపోయిందని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ట్విట్టర్ వేదికగా గురువారం స్పందించారు. బిఆర్ఎస్ పార్టీ తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన వారిని కాంగ్రెస్‌లోకి.. చేతి గుర్తుపై గెలిచిన వారిని గులాబీ పార్టీలోకి పంపించుకుని.. మంత్రిపదవులు తీసుకున్నప్పుడు.. ఎవరు? ఎవరితో కలిసినట్లో కేటీఆర్ చెప్పగలరా? అని ప్రశ్నించారు. అలాగే మేం గిల్లినట్లు చేస్తాము.. మీరు ఏడ్చినట్లు చేయండన్న తెరచాటు ఒప్పందంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సంయుక్తంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. పదేళ్ల పాటు బిఆర్ఎస్ అనుసరించిన మోసపూరిత విధానాలనే ఇవాళ కాంగ్రెస్ కాపీ కొట్టి ఏడాదిగా అనుసరిస్తున్న మాట వాస్తవం కాదా? అని, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ మొదలైన బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాలు, కేసుల విషయంలో పురోగతి లేకపోవడం.. ఎవరితో ఎవరు కలిసున్నారని చెబుతున్నాయని పేర్కొన్నారు.

## శ్రవణ్ కుమార్ ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు, ఒక తెలుగు టీవీ చానల్ ఎండి శ్రవణ్ కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు గురువారం పూర్తి కావడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని ప్రకటించింది. ఎస్ఐబి అధికారులతో కలిసి ఫోన్ ట్యాపింగ్ చేయించారని, తన కార్యాలయంలోనే ఫోన్ ట్యాపింగ్ పరికరాలను ఉంచుకున్నారంటూ శ్రవణ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయనకు నాంపల్లి కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. ఈనేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి గురువారం విచారణను పూర్తి చేశారు. విచారణకు సహకరిస్తామని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. ముందస్తు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ముందస్తు ఇవ్వరాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతివాదన చేశారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఇదిలా ఉండగా ఇదే కేసులో మరో నిందతుడైన అడిషనల్ మాజీ ఎస్పీ భుజంగరావుకు గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను డిసెంబర్ 4 వరకు హైకోర్టు పొడిగించింది. వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం ఆగస్టులో నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈనెల 14 తర్వాత మధ్యంతర బెయిల్ పొడిగింపునకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో హైకోర్టుకు వచ్చారు.



## అమిత్‌షాతో మహాయుతి నేతల భేటీ

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ పరిణామాల మధ్య రాష్ట్ర ఆపద్ధర్మ సిఎం ఏక్‌నాథ్ షిండే గురువారం రాత్రి కేంద్ర మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న ఆయన నేరుగా షా నివాసానికి చేరుకున్నారు. మరోవైపు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, దేవేంద్ర ఫడణవీస్, ఎన్‌సిపి చీఫ్ అజిత్ పవార్‌లు కూడా రాత్రి పది గంటల సమయంలో హోంమంత్రి ఇంటికి చేరుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు తాను అడ్డు కాబోనని.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మహారాష్ట్ర సిఎం పగ్గాలు బిజెపికే దక్కుతాయని, దేవేంద్ర ఫడణవీస్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు డిప్యూటీ సిఎంలు, కేబినెట్ బెర్తులపై స్పష్టత రానుంది.

## 'మూసీ' విషయంలో తప్పుదోవ పట్టిస్తున్నారు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ బాధితుల పునరావాసం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని, పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడం సిగ్గు చేటని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మూసీ బాధితుల పరిహారం విషయంలో పార్లమెంట్ సమావేశంలో చెప్పిన అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని, ఎక్కడికి రావాలో సిఎం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ మూసీ పునరుద్ధరణకు బిఆర్ఎస్ వ్యతిరేకం కాదని, మూసీ ముసుగులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కొల్లగొట్టటానికి మాత్రమే తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ బాధితుల అంశం పైన రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. భూసేకరణ చట్టం 2013ను అమలు చేస్తున్నామని,మూసీ ప్రాజెక్ట్ విషయంలో పచ్చి అబద్దాలు చెబుతున్నదని మండిపడ్డారు .ముందుగా నష్టపోతున్న బాధితులను గుర్తించాలని, అలా ఎక్కడా చేయలేదని, అసైన్డ్ భూమి, పట్టా, ఆక్రమణకు గురైన ఎటువంటి భూమి అయినా అందరికి సమాన హక్కులు ఉంటాయని చట్టం చెబుతుందని హరీశ్‌రావు గుర్తు చేశారు. నిర్వాసితులకు మానవత్వంతో ఇండ్లు ఇవ్వడం కాదని, వారికి హక్కుగా ఇవ్వాలని సూచించారు. ఉపాధి కోల్పోయిన వారికి వేజ్ లాస్ కింద రూ 7.5 లక్షలు, పెళ్లి కాని వారికి రూ.5 లక్షలు ,పెళ్లి అయిన వారికి 250 గజాల స్థలం, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని,

ఆ ఇంటికి కరెంటు, రోడ్డు, ఆసుపత్రి దేవాలయాలు ఉండేలా కాలనీని నిర్మించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చారని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డికి సోనియాగాంధీపైన నిజంగానే గౌరవం ఉంటే, భూసేకరణ చట్టం 2013ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## 'సంరక్ష మొబైల్ అప్లికేషన్'ను ప్రారంభించిన భారతీయ రైల్వే

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భారతీయ రైల్వేలు ప్రయాణికుల భద్రత పెంపు కోసం తీసుకొంటున్న చర్యలలో భాగంగా పాన్‌ఇండియా సంరక్ష మొబైల్ అప్లికేషన్‌ను రైల్వే బోర్డ్ మెంబర్ ఆపరేషన్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ రవీందర్ గోయల్ గురువారం ప్రారంభించారు. భారతీయ రైల్వేలోని ఫ్రంట్‌లైన్ భద్రతా కేటగిరీ సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రైల్వే భద్రతను మెరుగుపరచడం ఈ మొబైల్ అప్లికేషన్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా భారతీయ రైల్వేలోగల అన్నిప్రధాన కార్యాలయాలకు సంబందించిన ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్లు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్లు, డివిజనల్ లోని డివిజనల్ రైల్వేమేనేజర్లు , ఇతర అధికారుల సమక్షంలో న్యూ ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సంరక్ష మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ అప్లికేషన్‌ను 2013 బ్యాచ్ ఐఆర్‌టిఎస్ ఆఫీసర్ దిలీప్ సింగ్ రూపొందించారు. వీరు ప్రస్తుతం సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, నాగ్‌పూర్, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా నాగ్‌పూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నమితా త్రిపాఠి పైలట్ ఈ ప్రాజెక్టును నాగ్‌పూర్ డివిజన్‌లో అమలు చేస్తూ ఈ ప్రాజెక్టు పనితీరుపై సవివరంగా తెలియజేశారు. డివిజన్‌లో భద్రతను పెంపొందించడంలో ఇది ఎలా ఉపయోగపడిందనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టును ప్రస్తుతం రైల్వే బోర్డు భారతీయ రైల్వే లోని అన్నిజోన్‌లలో



మొదట ఎంపిక చేసినట్లుగా 16 డివిజన్‌లలో ఈ యాప్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. దక్షిణ మధ్య రైల్వేలో ఈ సంరక్ష మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి భద్రతా కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడానికి హైదరాబాద్ డివిజన్‌ను ఎంపిక చే శారు. ఈ అప్లికేషన్ సమాచార సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో రైల్వే ఉద్యోగుల శిక్షణ సామర్థ్య పెంపుకోసం సమర్థవంతమైన కృత్రిమ మేధస్సు డేటా అనలిటిక్స్ భారతీయ రైల్వే డొమైన్ పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తుంది. ఇది స్మార్ట్ లెర్నింగ్ ఫీడ్ బ్యాక్ మెకానిజంను కలిగి ఉంటోంది.

## పరువు నష్టం దావా వేస్తా..

### 'సెకీ ఒప్పందం'పై వైఎస్ జగన్ స్పందన

**తాడేపల్లిగూడెం :** ఎపి సిఎం నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం తిరోగమనం వైపు వెళ్తోందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. టిడిపి కూటమి సర్కారు పాలనలో ప్రతి వ్యవస్థ దెబ్బతింటోందని ఆరోపించిన వైఎస్ జగన్.. ఎన్నికల సమయంలో వాలంటీర్లకు పదివేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చారని మండిపడ్డారు. చంద్రబాబు మాట్లాడితే సంపద సృష్టి అంటారన్న వైఎస్ జగన్.. రాష్ట్రానికి అదనపు ఆదాయం తీసుకొచ్చేలా ప్రభుత్వం చేసే కార్యక్రమాలను సంపద సృష్టి అంటారని చెప్పారు. వైసిపి హయాంలో సంపద సృష్టి జరిగిందని, చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో మూడు కొత్త పోర్టులు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అడుగులు పడ్డాయని అన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ప్రతి అడుగూ వేశామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివక్ష లేకుండా అమలు చేశామన్నారు. రైతులకు ఉచిత కరెంట్ అందించడమేది ఒక కల అని, చంద్రబాబు పాలనలో డిస్కంలు దెబ్బతిన్నాయన్నారు. చంద్రబాబు రాకముందు డిస్కంలకు రూ.29 వేలకోట్లు బకాయిలు ఉంటే.. చంద్రబాబు దిగిపోయేనాటికి ఈ బకాయిలు, అప్పులు రూ.86 వేలకోట్లకు చేరినట్లు ఆరోపించారు. డిస్కంల మీద, ప్రభుత్వం మీద భారం పడకుండా, రైతులకు ఊరట కలిగించాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం సోలార్ పార్కుల ఏర్పాటు కోసం టెండర్లు పిలిచిందని వైఎస్ జగన్ చెప్పారు. 2020 నవంబర్‌లో ఎపి గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచామని.. ఆ టెండర్లలో రూ. 2.49 పైసలు నుంచి రూ.2.58 పైసలకు చొప్పున సరఫరా చేసేందుకు సుమారు 24 బిడ్ల వరకూ దాఖలయ్యాయని వివరించారు. అయితే చంద్రబాబు దానికి అడ్డుపడ్డారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ క్రమంలోనే 2021 సెప్టెంబర్ 15న తీపి కబురు మాదిరిగా కేంద్ర ప్రభుత్వం సెకీ నుంచి లేఖ వచ్చిందన్న వైఎస్ జగన్.. యూనిట్ రూ.2.49 పైసలు చొప్పున 9 వేల మెగావాట్ల పవర్ అందిస్తామని సెకీ లేఖ రాసిందన్నారు. 2024 సెప్టెంబర్ నాటికి 3 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెస్తామని చెప్పారన్న వైఎస్ జగన్.. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తక్కువ ధరకు వచ్చిన ఆఫర్ ఇది అంటూ చెప్పుకొచ్చారు. అలాగే ఇంటర్ స్టేట్ ట్రాన్సిమిషన్ ఛార్జీలు కూడా లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ ఆఫర్ చేసినట్లు చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏడాదికి రూ.4,400 కోట్లు ఆదా అవుతాయన్న వైఎస్ జగన్.. పాతికేళ్లలో లక్ష కోట్ల వరకూ ఆదా అయ్యేవని చెప్పారు. ఈ లేఖలో మూడో పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించిన వైఎస్ జగన్.. చంద్రబాబు చేసుకున్న పిపిఎల వలన 2 వేలకోట్లు అదనపు భారం పడితే.. తమ ప్రభుత్వ నిర్ణయం వలన ఆదా అయ్యిందని చెప్పారు. యూనిట్ విద్యుత్‌కు రూ.5.90 పైసలకు ఒప్పందం చేసుకున్న చంద్రబాబు మంచోడా.. యూనిట్ రూ.2.49 చొప్పున ఒప్పందం చేసుకున్న నేను మంచివాడినా అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం గురించి కూడా మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నామన్న వైఎస్ జగన్.. ఏపీ చరిత్రలోనే అతి తక్కువ ధరకు విద్యుత్ ఒప్పందం జరిగితే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న వైఎస్ జగన్.. పరువు నష్టం దావా వేస్తానంటూ హెచ్చరించారు.





## మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా, కుల, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ బిసి కమిషన్ రాష్ట్ర కార్యాలంలో చైర్మన్ .జి.నిరంజన్ సభ్యులు, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్, యు.శ్రీనివాస్‌రావు, స్పెషల్ ఆఫీసర్. జి సతీష్ కుమార్‌లు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే సంఘసంస్కర్త అని, అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. గాంధీభవన్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అదేవిధంగా టిపిసిసి రాష్ట్ర ఇంఛార్జీ దీపాదాస్ మున్షీ, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్ కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి తదితరులు అంబర్ పేట్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణయాదవ్‌తో పాటుపలుఉద్యోగ సంఘాల నాయకులు జ్యోతిరావు పూలేకు నివాళ్లు అర్పించారు. బిజిపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎంపి బూర నర్సయ్య, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్‌లు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళ్లు అర్పించారు.

## రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి ఘటన వెనక బిఆర్ఎస్ కుట్ర

కల్వ సుజాత, బండ్రు శోభారాణి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నాయకులుతమ స్వార్థ రాజకీయాల కోసం ఎవరినైనా బలి చేస్తారని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, మహిళ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణిలు ఆరోపించారు. గాంధీ భవన్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న ఘటనలన్ని బిఆర్ఎస్ కుట్రలో భాగమేనని కల్వ సుజాత ఆరోపించారు. పామ్ హౌస్ కేంద్రంగా జరుగుతున్న కుట్రలను బయట పెట్టేందుకు అక్కడికి అధికారులను పంపించాలని సిఎంను కోరారు. ఫుడ్ పాయిజన్ ఘటన చోటు చేసుకునే ముందు నమస్తే తెలంగాణ రిపోర్టర్ మరో ముగురు అక్కడ భోజనం చేశారని, మరీ వారు ఎందుకు అస్వస్థతకు గురి కాలేదని ప్రశ్నించారు. పసి పిల్లల జీవితాలను ఏమి చేయాలనుకుంటున్నారో బిఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. బండ్రు శోభారాణి మాట్లాడుతూ లగచర్ల ,దిలావర్పూర్ లో అధికారుల మీద దాడులు,గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటన వెనుక బిఆర్ఎస్ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. హాస్టల్ లో జరుగుతున్న కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుట్ర ఉందని, కెటిఆర్ కనుసన్నల్లోనే ఈ కుట్రలు జరుగుతున్నాయన్నారు. కుట్రల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ చేపట్టాలని కోరారు.

## లా అడ్మిషన్లపై హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్ :** న్యాయ విద్య కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఇచ్చిన గైడ్ లైన్స్ మేరకు సీట్ల భర్తీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో కౌన్సిలింగ్ ప్రక్రియను జూలైలోపు పూర్తి కాకపోవడంపై లాయర్ భాస్కర్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ ఏడాదికి న్యాయ విద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ముగియడంతో వచ్చే సంవత్సరం నుంచి యూజీసీ, బీసీఐ ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం లా అడ్మిషన్లు ఉండాలని చెప్పి పిటిషన్‌ను క్లోజ్ చేసింది.

# రైతులు ప్రతిపక్షాల వలలో పడొద్దు

అప్పులపాలైన రాష్ట్రాన్ని సిఎం రేవంత్‌రెడ్డి చక్కదిద్దుతున్నారు : ఎమ్మెల్యే కసిరెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రతిపక్షాల మోసపూరిత మాటలతో రైతులను మోసం చేస్తున్నారని అలాంటివారి వలలోపడవద్దని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ రాష్ట్రప్రజలకు చేసింది ఏమిలేదని, అధికారం కోల్పోయినబాధలో నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరైందికాదని ప్రతిపక్ష నాయకులకు సూచించారు. ఈనెల 28,29,30తేదిలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో జరుగుతున్న రైతు పండుగకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అట్టి కార్యక్రమానికి ఈనెల 30న సిఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని , ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారిగా అమలుచేస్తున్నారని రైతులు, ప్రజలు ప్రతిపక్షాలవలలో పడొద్దని కోరారు. కెసిఆర్ పాలనలో పూర్తిస్థాయిలో ఎందుకు రుణమాఫీ చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నిత్యం ప్రభుత్వంపై పనికట్టుకొని ఆరోపణలు చేయడం బిఆర్ఎస్ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని విరుచుకుపడ్డారు. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదని ఈనెలలో ఆప్రక్రియ పూర్తిచేసే పనిలో ప్రభుత్వం ఉందని, రుణమాఫీకాని రైతుల జాబితాకూడా వచ్చిందని స్పష్టంచేశారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన జైపాల్‌యాదవ్ కల్వకుర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిలేదని విమర్శించారు. చేయని పనులు చేసినట్లు చెప్పుకోవడంలో ఆయనదిట్టఅ ని వ్యంగస్త్రాలు సంధించారు. వందపడకల ఆస్పత్రిని ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కు ఎందుకు పాల్పడ్డావో చెప్పాలని జైపాల్‌యాదవ్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. అప్పులపాలైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైనమార్క్‌తో చక్కదిద్దుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మేపరిస్థితిలేదని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లేపల్లి జగన్, ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లెలరాములు, సంజీవ్‌కుమార్‌యాదవ్, కుడుముల చంద్రకాంత్‌రెడ్డి, మహిళా నాయకురాలు రేష్మ, కౌన్సిలర్ రవీందర్, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/వంగూర్ :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలపరిధిలోని మిట్టసదగొడు, ఉల్లంపల్లి గ్రామాలలో అంగన్‌వాడికేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండలప్రచార కార్యదర్శి పాండు రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభివృద్ధికోసం ప్రభుత్వం నూతన విధానాలతో మరెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని ఆయన గుర్తుచేశారు. సదగొడు గ్రామంలో ఒకకోటి 50లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. అందులోభాగంగా రూ. 14లక్షల నిధులతో అంగన్‌వాడీ కేంద్ర భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సదగొడు నుండి చౌదర్‌పల్లి గ్రామాలమధ్య బిటిరోడ్డు గ్రామంలో మురికికాల్వలు, సిసిరోడ్ల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేపడుతామని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా ఉల్లంపల్లి గ్రామంలో సిసిరోడ్లు, పాఠశాల అదనపు తరగతిగదులు, వాల్మీకి విగ్రహ ఏర్పాటు, ఉల్లంపల్లి గ్రామంనుండి వంగూరు వరకు బిటిరోడ్డు నిర్మాణం చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ విజయభాస్కర్,ఏఈ మణిపాల్, ఐసిడిఎస్ సిడిపిఓ సూపర్‌వైజర్లు శ్రీమతి, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు క్యామమల్లయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కపటరాజకీయం



**ప్రజాపక్షం/వంగూర్ :** బడుగు బలహీనవర్గాల పేరుతో రాజకీయరంగప్రవేశంచేసిన డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్రంలో కపట రాజకీయం చేస్తున్నారని యూత్‌కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌సిసెల్ కన్వీనర్ పాండు అన్నారు. గురువారం మండలపరిధిలోని మిట్టసదగొడు గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభివృద్ధికోసం బిఎస్‌పిపార్టీలో చేరి స్వార్థంకోసం తెలంగాణరాష్ట్రంలో కెసిఆర్ వదిలినబాణంలా పనిచేస్తున్నాడని వారు విమర్శించారు. కొండారెడ్డి పల్లి సంఘటన ముఖ్యమంత్రి కుటుంబసభ్యులకు ఏమాత్రం సంబంధంలేని విషయాన్ని అంటగట్టి మాట్లాడటం సరైన పద్దతికాదన్నారు. ఇప్పటికైనా స్వార్థరాజకీయాన్ని వదిలిపెట్టి బడుగు బలహీనవర్గాలప్రజల గురించి ఆలోచించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నాయకులు బాలస్వామి, శేఖర్, లక్ష్మ య్య, శేఖర్ పాల్గొన్నారు.

## సమయానికి బస్సులు నడపాలి



**ప్రజాపక్షం / ఊట్కూర్ :** నారాయణపేట జిల్లాకు ఇటు మక్తల్ వెళ్లే విద్యార్థులకు ఉదయం సాయంత్రం సమయంలో సరైన సమయంలో బస్సులు రాని కారణంగా సకాలంలో కళాశాలకు పాఠశాలకు వెళ్లలేక దాదాపు 200 మంది విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఎబివిపి మండల అధ్యక్షులు బాల ఆంజనేయులు అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా బస్సు డిపో మేనేజర్ లావణ్యకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల ఆంజనేయులు మాట్లాడుతూ బస్సులు సమయం వేళ్లలో నడుపుతే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఆయన అన్నారు. ఉచిత బస్సులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులకు అదనంగా బస్సులు కేటాయించి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని బస్సు డిపో మేనేజర్ లావణ్యను కోరారు. బస్సులలో డ్రైవర్లు కాంట్రాక్టర్లు విద్యార్థులకు దు రుసుగా మాట్లాడుతూ విద్యార్థులను కించపర్చే విధంగా వ్యవహరిస్తున్నారని డిపో మేనేజర్ లావణ్యకు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఎందుకు డిప్యూ మేనేజర్ స్పందిస్తూ ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా డ్రైవర్లకు కండక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ నివ్వడం జరిగిందని ఆయన అన్నారు.

## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



**ప్రజాపక్షం/నర్వ :** మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలంలో, నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై , రేవంత్ రెడ్డిపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి, వారి పార్టీకి చెందిన నాయకులు, మాగనూర్ మండలంలో మధ్యాన భోజనానికి సంబంధించిన విషయాన్ని పూర్తిగా రాజకీయం చేస్తూ రాజకీయ పబ్బం గడపటానికి ప్రయత్నం చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకుల తీరును మార్చుకోవాలన్నారు. మక్తల్ , నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రజలను బిఆర్ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు నర్వ మండలానికి, మక్తల్ నియోజకవర్గానికి ఒక్క సాగునీటి ప్రాజెక్టు తీసుకురాకుండా , ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించే మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వ్యతిరేకిస్తూ , కాంగ్రెస్ పార్టీపై ఓర్వలేక పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డిసిసి జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శరణప్ప, రవీందర్ రెడ్డి, అయ్యన్న గడ్డం నర్సిములు, మండల కాంగ్రెస్ నాయకులు , వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## దుకాణాల వేలం కోసం ప్రకటన

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మితమైన మొత్తం 15 దుకాణాల ను కిరాయికి ఇవ్వటం కోసం మార్కెట్ కమిటీ ఆధ్వర్యం లో ప్రకటన విడుదల చేశారు. ఈ దుకాణాల కోసం దరఖాస్తుల కోసం నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫారం ధర రూ. 2వేలుగా నిర్ణయించారు. ఎర్నెస్ట్ మని డిపాజిట్ 20 వేల రూపాయలుగా నిర్ణయించారు. ఈ దుకాణాలకు రోస్టర్ రిజర్వేషన్ విధానం అమలు చేస్తారని తెలిపారు. డిసెంబర్ 7వ తేదీ లోపు తమ దరఖాస్తులను ఆసక్తి గల వారు మార్కెట్ కమిటీకి అందించాలని, డిసెంబర్ 10వ తేదీన బహిరంగ వేలం ఉంటుందని తెలిపారు. అదనపు వివరాలకు మార్కెట్ చైర్మన్ ప్రమోదిని , వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డిని, మార్కెట్ కమిటీ సెక్రరి అనిల్ కుమార్ ను కాని సంప్రదించాలని మార్కెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** సరుకుల నాణ్యతతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ సీతా రామారావు అన్నారు. కల్వకుర్తి మున్సిపల్ పరిధిలోని జెపినగర్ గురుకుల పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టోర్ రూమ్‌లోని సరుకులు, బియ్యం నాణ్యత, కూరగాయలు, వంటరూమ్ పరిశీలించారు. అదేవిధంగా పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. సరుకుల నాణ్యత పరిశీలించిన తర్వాతనే వంటవండాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతోకలిసి అధికారులు సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదనపు కలెక్టర్‌వెంట డిఎస్‌ఓ శ్రీనివాస్, ఆర్‌డిఓ శ్రీను,తహసీల్దార్ ఇబ్రహీం, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు ఉన్నారు.

## విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా మదనాపూర్ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ప్రవీణ్ అనే విద్యార్థి మృతిపై గురువారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని విద్యార్థి సంఘాల నేతలు కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ పాఠశాలలో బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో అనుమానాస్పదంగా విద్యార్థి చనిపోయాడు కాని పాఠశాల సిబ్బంది విద్యార్థి ఉరేసుకొని చనిపోయాడని నిర్ధారించారు. విద్యార్థి మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థి మృతిపై సమగ్రమైన విచారణ జరిపించి మృతికి కారకులైన అధికారులను తక్షణమే విధుల నుండి తొలగించాలని, విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తరపున 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.



## చదువులో రాణిస్తే ఉజ్వల భవిత్

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విద్యార్థులు చదువులో రాణిస్తేనే భవిష్యత్తులో ఉజ్వల భవిత్ అందుతుందని, రాష్ట్రప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. గురువారం తెలకపల్లి మండలకేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. తరగతి గదులు, వంటగది, డైనింగ్‌హాల్, స్టోర్‌రూమ్‌ను, వంటవండే పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కల్పించిన సదవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్‌వెంట తెలకపల్లి తహసీల్దార్ జాకీర్‌అలీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఉన్నారు.

### సమగ్రసర్వే ఆన్‌లైన్‌డేటా నమోదులో పొరపాట్లకు తావివ్వకండి

సమగ్రసర్వేలో ఎలాంటి తప్పులకుతావులేకుండా ప్రతి కుటుంబ వివరాలను పకడ్బందీగా నమోదుచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. గురువారం తెలకపల్లి మండలప్రజాపరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ సునిశితంగా పరిశీలించారు. డేటా ఆపరేటర్లు తప్పులులేకుండా కుటుంబ వివరాలను ఎంట్రీచేయాలని సూచించారు.

## అభివృద్ధే మా నినాదం : ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** చిల్లర రాజకీయాలు కాదు అభివృద్ధే మా నినాదం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ ప్రాంతంలోని బాలసదన్‌లో 1 కోటి 35 లక్షల రూపాయలతో చిల్డ్రన్స్ హోం అధునాతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అరకొర వసతులతో నడుస్తున్న ఈ బాల సదన్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఆధునాతన భవన నిర్మాణానికి అనుమతులు తీసుకురావడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ భవనాన్ని సంవత్సరంలోపు పూర్తి స్థాయిలో నిర్మాణం చేసుకుని అందుబాటులోకి తెస్తామని అనంతరం ఈ బాలసదన్‌లో 5 సంవత్సరాలలోపు బాలబాలికలకు ప్లే స్కూల్ మాదిరిగా ఉండేటట్లు అందుబాటులో తెస్తామని, తల్లి దండ్రులు ఏవిధంగా అయితే శ్రద్ధ తీసుకుంటారో అలాగే ఈ బాలసదన్‌లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేవలం అనాధ పిల్లలే కాకుండా పట్టణంలోని చిన్నారులు ఎవరైనా ఇక్కడ చేరవచ్చు అని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రోజా, తిరుమల వెంకటేశ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసిన తెలంగాణ ఉర్దూ జర్నలిస్టు యూనియన్ సభ్యులు



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** తెలంగాణ ఉర్దూ వాకింగ్ జర్నలిస్ట్ యూనియన్ నారాయణపేట ప్రతినిధి బృందం నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి మండల స్థాయి ఉర్దూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డును జారీ చేయాలని, జిల్లా అక్రిడిటేషన్ కమిటీలలో యూనియన్ ప్రతినిధిని చేర్చాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ గతంలో మాదిరిగానే మండల స్థాయిలో ఉర్దూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందించాలన్నారు. జిఒ 239కె సవరణ కోసం యూనియన్ హై కోర్టుకు విజయవంతమైన ప్రాతినిధ్యాన్ని సమర్పించగా ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టుకి ఉస్మాన్ బేదుల్లా ముజాహిద్ సిద్దిఖీ, ఆర్షద్ పైసల్ , మహ్మద్ జహీరుద్దీన్, జహీరుద్దీన్ సూఫి, మినిస్టర్ మహ్మద్ హుస్సేన్ మార్కి, హఫీజ్ మహమ్మద్ తాకి , మహమ్మద్ నవాజ్ తాజ్ , రహ్మతుల్లా ఖురేషి, అబ్దుల్ రహీం, మహమ్మద్ సల్మాన్ ఉన్నారు.

## అనుచిత పోస్టులు చేయొద్దు : ఎస్‌పి

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం , ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయం ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు.పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్‌పి సూచించారు.

## పిల్లల భవిష్యత్తు అత్యంత ముఖ్యం



**ప్రజాపక్షం / మాగనూరు :** విద్యార్థుల భవిష్యత్తు నాకు అత్యంత ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషనర్ నేరెళ్ల శారద అన్నారు. నారాయణపేట జిల్లా మాగనూర్ హై స్కూల్‌లో వి ద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం పాఠశాలకు వచ్చారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వంట కార్మికుల నిర్లక్ష్యం వల్లనే ప్రాబ్లం మళ్లీ మళ్లీ అవుతుందని విద్యార్థులు చెప్పినట్లు తెలిపారు. పిల్లలకు మహిళ కమిషన్ అండగా ఉంటుందని నమ్మకం ఇవ్వడానికి వచ్చానన్నారు. ఓట్లు లేని పిల్లలను ఎవరు పట్టించుకోలేరని అపోహ ఉం టుంది. కనుక దానిని పోగొట్టడానికి సమస్య ఎవరికి వచ్చిన మహిళ కమిషన్ స్పందిస్తుందని అ న్నారు. టీచర్లపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని విద్యార్థులు కోరినట్లు తెలిపారు. ఇంట్లో మన పిల్లలకు వంట ఎలా వండిపెడతామో స్కూల్‌లో విద్యార్థులకు కూడా అలానే వడ్డించాలని సూచించారు. పిల్లలపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనాలు నడపటం వల్లే రోడ్డు ప్రమాదాలు



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి వల్లనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్ అన్నారు. కొత్తకోట పోలీస్ స్టేషన్‌లలో నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా కొత్తకోట సిఐ రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించి ఆటో, తుఫాన్ , లారీ, ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లకు విద్యార్థులకు ఏర్పాటుచేసిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఎవరైనా యాక్సిడెంట్స్ ,హార్ట్ హటాక్ , ఫిట్స్, కరెంట్ షాక్‌కు గురైనప్పుడు ఆ అత్యవసర సమయంలో అందించే యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పండర్ శిక్షణ సిపిఆర్ ఏ విధంగా చేయాలో డాక్టర్లచే అవగాహన కల్పించారు. అదే విధంగా డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు అనేక రకాల కారణాలుంటాయని ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడపటం , ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం లాంటివి ప్రధాన కారణాలని చెప్పారు. రోడ్ మీద ఫుట్ పాత్ లేనప్పుడు కుడి వైపున మాత్రమే నడవాలని, దాని వలన ఎదురు వచ్చే వాహనాలను గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చని, మద్యం సేవించి ఈ పరిస్థితుల్లో వాహ నం నడపరాదని, మద్యం సేవిస్తే ఆటో లేదా ఏదై నా ట్రాన్స్పోర్ట్ వాహనంలో వెళ్లాలని తెలియజేసా రు. ప్రతి సిటిజెన్‌కి ట్రాఫిక్ రూల్స్ , గెగ్యులేషన్స్ గురించి తప్పకుండా తెలిసి ఉండాలని, రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా ఇంటరైస్ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ , దీపమాదియా, కొత్తకోట సిఐ, రాంబాబు, కొత్తకోట ఎస్ఐ, మంజునాథ్ రెడ్డి, పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి, పెద్దమందడి ఎస్ఐ యుగంధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం మండలపరిధిలోని ఉల్పర గ్రామంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతిధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలుచేస్తూ సన్నరకం వరిధాన్యానికి రూ.500లబోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలోనే రైతుబంధు రైతు ఖాతాలోకి వేయడం జరుగుతుందని ఆయన గుర్తుచేశారు. రైతు రుణమాఫీ రైతులకు త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు నర్మదజనార్దన్, సింగిల్‌విండోడైరెక్టర్ శంకర్‌యాదవ్, తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ విజయభాస్కర్, ఎపిఎం చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌గౌడ్, ఉషన్నయాదవ్, అంతటిమల్లేష్, మల్లయ్య, పాండు, మల్లేష్‌యాదవ్, పర్వతాలు, ఐకెపి సిబ్బంది రామస్వామి, గ్రామస్తులు , రైతులు పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధంలాంటిది



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగాభావించి ఓటుహక్కును నమోదు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. గురువారం స్వీప్ కార్యక్రమంలోభాగంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు డిఆర్‌డిఎ అధికారులు పట్టణంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల క్రీడామైదానంనుండి శ్రీపురం చౌరస్తావరకు రన్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసుపైబడిన యువకులు ఓటుహక్కును పొందాలన్నారు. ప్రజలకు ఓటుఅనేది ఒక వజ్రాయుధమన్నారు. ఓటుహక్కును రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబిత, ఎంపిడిఓ కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, డిఆర్‌డిఎ అధికారులు అరుణదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో సుదీర్ఘంగా పనిచేయడం సంతృప్తినిచ్చింది



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** సుదీర్ఘకాలంగా నాగర్‌కర్నూల్ జిల్లావిద్యాశాఖ అధికారిగా జిల్లాలో పనిచేయడం తనకి ఎంతో సంతృప్తినిచ్చిందని బదిలీపై వెళుతున్న డిఇఒ గోవిందరాజులు అన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్ డిఇఒను ప్రభుత్వం నారాయణపేట జిల్లాకు డిఇఒగా బదిలీచేసిన విషయం తెలిసిందే. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లావిద్యాశాఖ అధికారి బాధ్యతల నుండి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌ను కలిసి రిలీవ్ అయ్యారు. కార్యాలయ సిబ్బంది డిఇఒ కార్యాలయంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

## నూతన డిఇఒగా గోవిందరాజులు బాధ్యతలు



**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** జిల్లా విద్యాశాఖ అధికారిగా డా. ఎం. గోవిందరాజులు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గు రువారం సాయంత్రం నారాయణపేట కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్ట ర్ సిక్త పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డిఇఒ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిఈఓ డా. ఎం. గోవిందరాజుకు కార్యాలయ పర్యవేక్షణలు నర్సింహారెడ్డి, సెక్టోరియల్ అధికారులు, పలువురు ఉపాధ్యాయ సం ఘాల నాయకులు కార్యాలయ అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వా గతం పలికారు. నాగర్‌కర్నూల్ , వనపర్తి జిల్లాల డిఈఓగా పనిచేస్తూ బదిలీపై నారాయణపేట జిల్లాకు డిఈఓగా వచ్చారు.

మదనాపూర్ గురుకుల ఘటనపై సమగ్రవిచారణ జరపాలి

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** మదనాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జేఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం మదనాపూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ ప్రిన్సిపల్ , విద్యార్థులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ మధ్యనే డైట్ , కాస్మోటిక్ చార్జీలు 40 శాతం పెంచిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్‌ని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారంలో ఒక రోజు గురుకుల , సంక్షేమ వసతి గృహాలను సందర్శించి అక్కడే నిద్రించే కార్యక్రమం చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వజగౌని వెంకటన్నగౌడ్ , మహేందర్ నాయుడు, అంజన్న యాదవ్ ,గంధం నాగరాజు, శివనాయక్ , రాఘవేందర్ గౌడ గాలిగల్ల సాయిబాబ, శివశంకర్ , గౌతమ్ శంకర్ , శ్రీనివాస్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.



## ఏఐటియుసి నాయకుడు ఇజ్జగిరి మృతి

కూనంనేని, బాగం, దండి తదితరులు నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏఐటియుసి నాయకుడు సాధు ఇజ్జగిరి చికిత్స పొందుతూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మృతిచెందారు. ఇజ్జగిరి ఏఐటియుసి నాయకుడిగా, ఫ్లంబింగ్ వర్కర్స్ యూనియన్ బాధ్యుడిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చివరి వరకు కళను ప్రజా చైతన్యం కోసమే వినియోగించిన సాధు ఇజ్జగిరి ధన్యుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఇజ్జగిరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితిసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, ఆంజనేయులు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ ఉన్నారు.

## ‘శ్రీసిటీ’ చైర్మన్ గరికపాటి వెంకట్రావుకు పితృవియోగం

నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు తండ్రి గరికపాటి రాఘవయ్య(95) అనారోగ్యంతో గురువారం ఖమ్మంరూరల్ మండలం కరుణగిరిలోని ఆయన నివాసంలో మృతిచెందారు. రాఘవయ్య భౌతికకాయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కుమారులు గరికపాటి వెంకట్రావు, గరికపాటి ఆంజనేయ ప్రసాద్‌ను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, వరంగల్‌క్రాస్‌రోడ్డుశాఖ కార్యదర్శి వెంపటి సురేందర్, కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు బండి జగదీష్, రియల్ ఎస్టేట్ వ్యాపారవెత్తలు మన్నేటి నాగేశ్వరరావు, కారం శ్రీను, రేచర్ల రామారావు, కిసాన్ సంస్థల అధినేత చల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల వంట గ్యాస్ వెతల తీరవా?

లోక్‌సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపి రామసహాయం



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** సుదూర ప్రాంతాల్లోని కొండకొనల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు వంటగ్యాస్ వెతలకు ఎటువంటి పరిష్కార చర్యలు తీసుకుంటున్నారని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభ లో గురువారం ప్రశ్నించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఈ మేరకు ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి ఆదివాసీ గిరిజనుల వంటగ్యాస్ వెతలపై ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకం ద్వారా గిరిజనులకు ఏ మేరకు లబ్ధి చేకూరిందని ప్రశ్నించారు. దీనికి కేంద్ర పెట్రోలియం సహజ వాయువులు, పర్యాటక శాఖల సహాయ మంత్రి సురేష్‌గోపి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

## నిజాయితీపరుడైన కమ్యూనిస్టు నాయకుడిని కోల్పోయాం : మువ్వ




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** నిజాయితీపరుడైన కమ్యూనిస్టు పార్టీ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని సిపిఐ బూర్గంపాడు మండల కార్యదర్శి మువ్వ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం సారపాక సిపిఐ ఆఫీసులో సబ్కా నాగేశ్వరరావు అధ్యక్షతన పోటు ప్రసాద్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలలో పోటు ప్రసాద్ భాగస్వామ్యం మరవలేనిదన్నారు. పోటు ప్రసాద్ మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పేరాట శ్రీనివాసరావు, అలవాల సీతారామిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పాండవుల భిక్షం, సిద్దార్థ సుబ్బారెడ్డి, సబ్కాం నాగేశ్వరరావు, మల్సూర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి సింగమానేని ప్రసాద్‌రావు, జహీరు, సోడే చంద్రయ్య, లక్ష్మ య్య పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇఎస్ఐ అమలు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** సింగరేణిలో పనిచేస్తున్న అన్నివిభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు ఇఎస్ఐ అమలుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు క్రిష్టాపర్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం కార్పేరేట్ పరిధిలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబసభ్యులందరికీ ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ఇఎస్‌ఐను అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఇఎస్‌ఐకి సంబంధించిన వాటాను తక్షణమే యాజమాన్యం చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను ఇఎస్‌ఐలో సభ్యులను చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.చంద్రశేఖర్, శంకర్, కళావతి, పద్మ, లక్ష్మీ, రంజిత్, చుక్కయ్య, రాజు, ఆదిలక్ష్మీ, సుజాత, మణెమ్మ, విజయలక్ష్మీ వెంకన్న, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ గాడి తప్పుతుందా?

సంక్షేమ హాస్టళ్లలో వీధి పోరాటాలు

వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు

ఓ విద్యార్థికి నెలకు లక్షల్లో ఖర్చు

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్యా వ్యవస్థ గాడి తప్పుతుంది. వరస తప్పిదాలు జరుగుతున్నా పోలీసే అని వదిలేస్తున్నారు తప్పా అత్యంత ప్రధానమైన విద్యా రంగాన్ని పట్టించుకోవడం లేదు. మారుతున్న పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం, గాడి తప్పిన బోధనా సిబ్బంది వ్యవహారం, లోపించిన క్రమశిక్షణ విద్యారంగం పాలిట శాపంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుదేలవుతున్న తరుణంలో ఖమ్మంజిల్లాలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఒక పక్క సంక్షేమ హాస్టళ్లలో వడ్డించే ఆహారం సరిగ్గా లేదని, విద్యార్థులు తీవ్రఅనారోగ్యం పాలవుతున్నారని ఆందోళనలు జరుగుతున్నాయి. ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్లు సంక్షేమ హాస్టళ్లను తనిఖీలు చేసి సరైన పోషకాహారం అందించేందుకు చర్యలు ఉపక్రమించడం ఆహ్వానించదగినదే అయినా కొంత మేర హాస్టళ్లలో తప్ప మిగిలిన హాస్టళ్లలో పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. ప్రతీ కాంట్రాక్ట్ వ్యవస్థతో ముడిపడిన నేపథ్యంలో కాంట్రాక్టర్ల లాభాల ఆశతో విద్యార్థులు సరైన ఆహారానికి నోచుకోక అనారోగ్యాల పాలవుతున్నారు. ఖమ్మంలో ఓ సంక్షేమహాస్టల్లో చోటు చేసుకున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఓ విద్యార్థిపై సీనియర్లు దాడి చేయడం ఆ జూనియర్ తన బంధువులు, స్నేహితులను తీసుకు వచ్చి ప్రతి దాడి చేయడం





శోచనీయం. దీనిపై ఒకరిద్దరిపై చర్యలు తీసుకున్నప్పటికీ మొత్తంగా హాస్టళ్లకు మద్యం సేవించి వస్తున్నారన్న ఆరోపణలు, మాదక ద్రవ్యాల వినియోగం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. హాస్టళ్ల పరిస్థితి ఈవిధంగా ఉంటే పైరవీల జోరుకు ఢోకా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. తప్పు చేసిన ఉపాధ్యాయులపై తీసుకుంటున్న చర్యలు అంతా ఉత్తుతిదే అన్నట్లు ఉంది. వైరా మండలం పాలడుగు ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థిని వేధించారన్న ఆరోపణపై ఉపాధ్యాయునిపై కేసు నమోదు చేయడమే గాక అరెస్టు చేశారు. విద్యాశాఖ అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏమి జరిగిందో కాని ఆ ఉపాధ్యాయునికి అదే మండలంలో పోస్టింగ్ ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గతంలో కూడా ఈ ఉపాధ్యాయునిపై ఆరోపణలు ఉన్నప్పటికీ అంతగా పట్టించుకోలేదని పెద్ద ఎత్తున జరిగిన పైరవి పోస్టింగ్‌కు కారణమని తెలుస్తుంది. వైరా మండలంలో ఓ పాఠశాలలో చోటు చేసుకున్న పరిణామాలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. ఒక విద్యార్థికి నెలకు లక్ష రూపాయలకు పైగా ప్రభుత్వ పాఠశాలలో ఖర్చు చేస్తున్న ఘటన ఇది. వైరా మండలంలోని ఓ పాఠశాలలో ఒక విద్యార్థి ఉండగా ఆ విద్యార్థికి ఒక ఉపాధ్యాయురాలిని నియమించారు. ఉపాధ్యాయురాలు నెలవేతనం ఆ విద్యార్థి కొరకు మధ్యాహ్న భోజన పథకం ఇలా చెప్పుకుంటూ పోతే నెలకు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నారు. బహుశా అతిపెద్ద కార్పొరేట్ పాఠశాలలో సైతం ఈ ఫీజు ఉండదేమో ఆ విద్యార్థినికి గురుకులాల్లో ప్రత్యేకంగా సీటు కేటాయించి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని వేరే ప్రాంతానికి బదిలీ చేయవచ్చు కాని ఎందుకో దాని గురించి విద్యాశాఖాధికారులు ఆలోచించడం లేదు. అసలు ఆపాఠశాలలో ఒకే విద్యార్థి ఉందన్న విషయం మండల లేదా జిల్లా అధికారులకు తెలుసా అన్నది ఆలోచించాల్సిన విషయం. మొత్తంగా విద్యా వ్యవస్థ తీరు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. గతంలో ఉపాధ్యాయుల నియామకాల సమయంలో జిల్లా అధికారులు వ్యవహరించిన తీరు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాను అబాసుపాలు చేసింది. ఇప్పుడు పట్టు కోల్పోతున్న విద్యావ్యవస్థను గాడిన పెట్టాల్సిన బాధ్యత అటు ఉన్నతాధికారులపై ఇటు ప్రజాప్రతినిధులపై ఉంది. ఇప్పటికే మండల విద్యాశాఖాధికారులు లేక పర్యవేక్షణ కొరవడి బోధనా సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనను నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు జరిగితే తప్ప విద్యా వ్యవస్థ గాడిన పడే అవకాశం లేదు. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.

## భద్రాద్రిలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే తెల్లం వినతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ మేరకు ఆయన గురువారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమీకృత మార్కెట్ ఏర్పాటుతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. సరైన మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నిల్వ చేసేందుకు సరైన పరిస్థితులు, సమర్థంతమైన ధరల నియంత్రణతో పాటు రైతులకు మేలు చేకూరే పనులు చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో బుడగం శ్రీనివాస్, రమేష్‌గౌడ్, తోటకూర రవిశంకర్ తదితరులున్నారు.



# త్వరితగతిన డేటా ఎంట్రీ పూర్తి

భద్రాచలం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలోని ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రి, డబుల్ బెడ్రూం ఇల్లు, పోడు భూములు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థల గుర్తింపు తదితర అంశాలపై కలెక్టర్ టెలి కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే డేటా ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అందుకు గానీ ఉత్సాహవంతులైన యువతీ యువకులను డెటా ఎంట్రీ చేయడానికి నియమించుకోవాలన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పాఠశాలల, మరియు కళాశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఉపయోగించుకోవాలన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, కరకగూడెం, చర్ల మండలాల్లో డేటా ఎంట్రి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డేటా ఎంట్రి ఆపరేటర్లు డేడా ఎంట్రీ చేసే సమయంలో ఎన్ని చేశారు, అనే విషయాలను రిజిష్ట్రర్‌లో నమోదు చేయాలన్నారు. చంద్రుగొండ, ములకలపల్లి, ఇల్లెందు మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అధికారులు వెంటనే అధికారులు పరిష్కరించాలన్నారు. అందుకు సంబంధించిన వివరాలు నివేదించాలన్నారు. ఇల్లెందు మండలం మామిడిగూడెం, లక్ష్మీ దేవిపల్లి మండలం రేగళ్లలో భూ సమస్యలపై తగిన నివేదికలు అందించాలని తహశిల్దార్లను ఆదేశించారు. జిల్లాలో పోడు పట్టాలు మంజూరై పాస్ పుస్తకాలు మంజూరైన రైతులను ఐటిడిఏ అధికారుల సమన్వయంతో గుర్తించి, ఆ జాబితాను జిల్లా అటవీ అధికారి సూచనతో పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం ద్వారా పేద గిరిజన రైతులకు మేలు చేకూర్చినట్లు అవుతుందన్నారు. జిల్లాలో డబుల్ బెడ్రూం ఇల్లు ఎన్ని పూర్తయ్యాయి, అర్హత పత్రాలు అందించని, ఎంపిక జరగని ఇళ్ల వివరాలు, ఏఏ మండలాల్లో ఎన్ని ఇల్లు అందుబాటులో ఉన్నవి తదితర వివరాలను నివేదికలు రూపొందాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థాపనకు అనువైన ప్రదేశాలు కొత్తగూడెం మండలంలో, భద్రాచలం పరిధిలో దుమ్ముగూడెం, చర్ల లో స్థానిక శాసన సభ్యుల సమన్వయంతో గుర్తించి తగిన నివేదికలు అందంచాలని, భద్రాచలం, కొత్తగూడెం ఆర్‌డిఒలను ఆదేశించారు. బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు గ్రామంలో అంబేద్కర్ నగర్ కాలనీ వరద ప్రభావిత ప్రాంతం పునరావాసం కల్పించేందుకు బూర్గంపాడులో అనువైన ప్రదేశాన్ని గుర్తించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

# డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తించండి

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ ప్రాధాన్యత అంశంగా అధికారులు పనిచేయాలని ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడునెలల పాటు మాదక ద్రవ్యాల నియంత్రణ వాటి వల్ల కలిగే దుష్ప్రరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించుటకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటూ క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం గుర్తించాలని మాదక ద్రవ్యాలు డ్రగ్స్ అలవాటు ఉన్న వారిని అక్కడ చేర్పించి వారికి అవసరమైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసి దాని నిర్వహణ బాధ్యతను స్వ చ్ఛంద సంస్థలకు అప్పగించేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన యువకులు, పిల్లలపై కేసులు నమోదు కాకుండా వారి భవిష్యత్తు దృష్ట్యా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్‌కు అరగంట, క్రీడలు ఆడేందుకు అరగంట షెడ్యూల్ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఓ సోమశేఖరశర్మ, డిడబ్ల్యుఓ రాంగోపాల్‌రెడ్డి, ఎన్‌జిఓ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాలస్వామి, హన్మంతరావుతో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించకపోతే చర్యలు : డిఎంహెచ్ఓ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రైవేటు ఆసుపత్రులు నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి హెచ్చరించారు. గురువారం ఖమ్మంలోని నూతన బస్టాండ్ సమీపంలో అజేయ్ ఆర్‌ఎంపి ఆసుపత్రిని డిఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆరు బెడ్లు ఏర్పాటు చేసి ఇష్టారీతిన వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించి ఆసుపత్రిని సీజ్ చేశారు. పక్కనే ఉన్న మెడికల్ షాపులో మందులను పరిశీలించారు. మెడికల్ షాపు నిర్వహణ సరిగ్గా లేదని హెచ్చరించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌జెఆర్ హెర్బల్ క్లినిక్‌ని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఇక్కడ హోమియో వైద్యం మాత్రమే చేయాలని సూచించారు. మయూరి ఆసుపత్రిలో అబార్షన్లు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, మందుల షాపును పరిశీలించారు. పిజి చేయకుండానే బోర్డు ఎలా పెడతారని హెచ్చరించారు. అబార్షన్లు జరిపినట్లు ఫిర్యాదులు వస్తే ఆసుపత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తూ వైద్య సేవలను అందించాలన్నారు. డబ్బు కోసం ఇష్టారీతిన పరీక్షలు, మందులు, చికిత్సలు చేయరాదని, మానవతా ధృక్పథంతో వైద్యసేవలు అందించాలని ప్రైవేటు ఆసుపత్రులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, పివోలు చందు నాయక్, రామారావు, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

## ఇప్పటిదాకా ఏంచేశారో!

ఇప్పుడు నోటీసులు..బిలీఫ్ ఆసుపత్రి ఎదుట హడావుడి

**ప్రజాపక్షం/ఖమ్మం :** చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం జిల్లా యంత్రాంగానికి తెలిసినట్లుగా మరెవరికి తెలియదేమో. ఏదో చాటుమాటుగా జరిగినట్లు ఇప్పుడు హడావుడి చేస్తూ నోటీసులు ఇస్తుండంతో కర్తవ్యం ఇప్పుడు గుర్తొచ్చిందో అర్థం కాక ప్రజలు తికమక పడుతున్నారు. ఖమ్మం వైరా రోడ్డులోని బిలీఫ్ ఆసుపత్రి నిర్వహకులు ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో ఒక భవనాన్ని నిర్మించారు. కూడలికి అత్యంత సమీపంలో ఈ భవనం ఉంది. రెండేళ్ల క్రింద ఈ భవనానికి సంబంధించిన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన రహదారికి పక్కనే పెద్ద భవన నిర్మాణం జరుగుతున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన ఏ ఒక్కరూ గమనించకపోవడం శోచనీయం. పెద్ద భవన నిర్మాణం జరుగుతుంటే నిబంధనలకు లోబడి జరుగుతుందా, అన్నిశాఖల అనుమతులు తీసుకున్నారా అని కనీస పరిశీలన కూడా చేయకపోగా భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఇటీవల ఆ భవనంలో బిలీఫ్ ఆసుపత్రిని సైతం ప్రారంభించారు. ప్రారంభానికి ముందు కాని, ప్రారంభం తర్వాత కాని పట్టించుకోని అధికారులు బుధవారం వరంగల్ క్రాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న బిలీఫ్ ఆసుపత్రి వద్ద హడావుడి చేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, అగ్నిమాపక శాఖాధికారులు హడావుడిగా నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేని పక్షంలో నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశం కాదు కాని భవన నిర్మాణం జరుగుతున్నప్పుడు, భవనాన్ని ప్రారంభించినప్పుడు మౌనం వహించిన అధికారులు ఇప్పుడు ఎందుకు హడావుడి చేస్తున్నారన్న దానిపై చర్చ సాగుతుంది.




# ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్ వైద్యులు

ఆరు నెలల వ్యవధిలో నలుగురు మృతి

ఆలనా, పాలనకు దూరమవుతున్న పిల్లలు

బిడ్డల మృతితో రోదిస్తున్న తల్లిదండ్రులు

నాయకుల అండతో తప్పించుకుంటున్న వైనం

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** నిర్లక్ష్యపు వైద్యంతో నిండు ప్రాణాలను గాల్లో కలుపుతున్నారు సత్తుపల్లి పట్టణంలోని కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు. 6 నెలల వ్యవధిలోనే ఒక విద్యార్థిని, ముగ్గురు బాలింతల ప్రాణాలు తీసి వైద్య వృత్తికి కళకం తెస్తున్నారు. ప్రాణాలు తీస్తున్న వైద్యులకు మిగిలిన వైద్యులు బాసటగా నిలిచి మృతుల కుటుంబీకులతో ఖయ్యానికి కాలుదువ్వటం, పరిస్థితి అదుపు తప్పుతున్నప్పుడు సెటిల్‌మెంట్‌కు మధ్యవర్తులను ఆశ్రయించి బేరాలు మాట్లాడి డబ్బులు ఆశ చూ , అనంతరం ముఖం చాటేస్తున్నారు. ప్రాణాలకు ఖరీదు కడుతున్న వైద్యుల విషయంలో అధికారులు కాని, జిల్లా మంత్రులు కాని స్పందించకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తున్న వైద్యుల సర్టిఫికెట్ రద్దు చేసి, సంఘటన జరిగిన ఆసుపత్రులను శాశ్వతంగా మూసి వేయకుండా అధికారులు వారితో లాలూచి పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన సంఘటన బుధవారం తాజా ఉదాహరణ, వివరాల్లోకెళ్ళితే వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామానికి చెందిన పిల్లి స్నేహలత పురిటి నొప్పులతో కొన్నిరోజుల క్రితం పట్టణంలోని లలితకుమారి హాస్పిటల్‌లో చేరింది. స్నేహలతకు వైద్యురాలు లలితకుమారి వైద్యం అందించే క్రమంలో మత్తు డాక్టర్ వెంకటేశ్వరరావు మత్తు ఇంజక్షన్ చేశారు. అప్పటి నుంచి సదరు గర్భిణీ అపస్మారక స్థితిలోకి వెళ్ళటంతో వైద్యురాలు గమనించి హడావుడిగా సిజేరియన్ చేసి బిడ్డను బయటకుతీశారు. అప్పటికే తల్లిలో చలనం లేకపోవటంతో హుటాహుటిన ఖమ్మం తరలించాలని కుటుంబసభ్యులకు చెప్పింది. ఖమ్మంలో కూడా సత్తుపల్లి డాక్టర్లు మాట్లాడి ఐసియులో ఉండేలా చర్యలు తీసుకుని, మూడు రోజుల తరువాత చావు కబురును చెప్పి కుటుంబ సభ్యులకు తీరని దుఖాన్ని మిగిల్చారు. దీంతో బంధువులు విషయం తెలుసుకుని ఆగ్రహం వ్యక్తచేశారు. మృతదేహంతో సత్తుపల్లిలోని లలితకుమారి హాస్పిటల్‌కు వస్తుండగా అప్రమత్తమైన ఆసుపత్రి నిర్వాహకులు మార్గంమధ్యలో కిష్టారంలో అడ్డగించి పాతకొమ్మెపల్లి రహదారిలోకి మృతదేహంతో వస్తున్న అంబులెన్స్‌ను తరలించారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న పెద్దమనుషులు ప్రాణానికి రూ.10 లక్షల విలువ కట్టారు. దీంతో మృతురాలి బంధువులు ఆసుపత్రి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



**సెటిల్‌మెంట్‌లోనూ మోసం...** ఈ మధ్య కాలంలో జరిగిన ప్రతి మరణానికి ఆయా ఆసుపత్రులు సెటిల్‌మెంట్‌లకు దిగారు, కాని మృతులు కుటుంబాలకు మాత్రం అనుకున్నంత అందించలేదని, ముందుగా మృతదేహాన్ని తరలించటానికి భారీగా డబ్బు ఎర చూపుతున్న ఆసుపత్రి నిర్వాహకులు అనంతరం రూ.2 లేదా 3లక్షలు ముట్టచెప్పి చేతులు దులుపుకుంటున్నారు. మధ్యవర్తులు సైతం మృతుల కుటుంబాలకు సాయం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులకు సై అంటూ జేబులు నింపుకుంటున్నారు.

**కన్న పేగులను దూరం చేస్తున్నారు...** బిడ్డలను అలారు ముద్దుగా చూసుకుంటున్న తల్లిదండ్రులు ప్రైవేట్ అస్పత్రుల నిర్లక్ష్యపు వైద్యానికి తనువులు చాలిస్తుండటంతో దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు. కట్టుకున్న భర్తలు సైతం తమ భార్యలు దూరమవుతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా సత్తుపల్లి ఆసుపత్రులపై వైద్యశాఖ, మంత్రులు దృష్టిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆ ఆసుపత్రిలో ఇటువంటిది పరిపాటే...** గతంలో కిన్లే వాటర్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పని చేస్తున్న గంజా సత్యనారాయణ కుమార్తె స్వప్న కాన్పు కోసం లలితకుమారిని సంప్రదించగా స్వప్న నార్మల్ డెలివరి జరిగి పాపకు జన్మనిచ్చింది. అనంతరం చిన్న ఆపరేషన్ సమయంలో ఆపరేషన్ వికటించటం, తీవ్ర రక్త స్రావం జరిగి చావు అంచుల దాకా వెళ్ళివచ్చింది. ఖమ్మంలోని ఎఫెక్స్ వైద్యులు స్వప్నకు వైద్యం చేసి ప్రాణాలు నిలిపారు. ఆ సమయంలో స్వప్న తల్లిదండ్రులు సదరు లలితకుమారి భర్త వెంకటేశ్వరరావును వివరణ అడిగేందుకు వెళ్ళగా రాజకీయ నాయకులను అడ్డంపెట్టుకుని స్వప్న తల్లిదండ్రులను బెదిరించారు. దీంతో స్వప్న తల్లిదండ్రులు లాయర్ సంప్రదించి పోరాడుతున్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవగాహన సదస్సు

ప్రజాపక్షం/అల్వాల్ : అల్వాల్ మున్సిపల్ పరిధిలోని స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి పొడి చెత్తను వేరుచేసి పట్టణ ప్రజలు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పార్సిదయ కార్మికులు వెంకటేష్, విష్ణు, భాస్కర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## చెక్‌ముకి పరీక్షలో కంకల్ విద్యార్థులకు మొదటిస్థానం

ప్రజాపక్షం/పూడుర్: జన విజ్ఞన వేదిక వికారాబాద్ జిల్లా లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో కంకల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం ప్రకాష్ , శ్రీనిధి ,జి ,వైష్ణవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి నందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్ప .ఉపాధ్యాయ బృద్దం విద్యార్థులను అభినందించారు.



## మేడిపల్లి-పర్వతాపూర్ సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/బోడుప్పల్ : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి –పర్వతాపూర్ ప్రధాన రహదారి నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం మేయర్ అమర్ సింగ్, స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్, 15వ డివిజన్ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ లతో పనులను ప్రారంభించారు. నిత్యం అత్యంత రద్దీగా ఉండే మేడిపల్లి పర్వతాపూర్ ప్రధాన రహదారి సరిగ్గాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్, బండారి మంజుల రవీందర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేసి నేడు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమ్ రెడ్డి, నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు బండారి రవీందర్, పలువురు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాపక్షం/దమ్మాయిగూడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాయిగూడ, చీర్యాల ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని కమిషనర్ తనిఖీ నిర్వహించారు. చీర్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో చీర్యాల పంచాయతీ సెక్రెటరీ నారాయణగౌడ్, సానిటేషన్, మున్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఏడాది వేడుకల్లో పాటలతో కళాయాత్ర

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా గురువారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలు జిల్లాలోని మేడ్చల్ మండలం డబిల్‌పూర్, ఎల్లంపేట, కోనాయిపల్లి, మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ, ఆద్రాస్‌పల్లి, ఉద్దెమర్రి ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ ఉష, గ్రామ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రజాపక్షం/శామీర్‌పేట: విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించాలని తుర్కపల్లి యువకుడు దాసరి రవి అన్నారు. గురువారం తుర్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 20 వేలతో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటిరియల్ అందజేశామని గుర్తుచేశారు. అలాగే వల్లపు కుమార్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులకు స్నాక్స్‌కు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యూత్ ప్రసిడెంట్ నర్సింహారెడ్డి, అఫ్సర్, రవీందర్‌రెడ్డి, బిక్షపతి, బాలరాజు, సాయిబాబు, గోవర్ధన్, మహేష్, రాజేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడలో రాణిస్తున్న క్రితికా రెడ్డి




ప్రజాపక్షం/బోడుప్పల్ : జాతీయ, అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడలలో వంగాల క్రితికా రెడ్డి రాణిస్తోంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన టెన్నిస్ క్రీడలలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. చిన్ననాటి నుండి ఆటలలో అత్యంత ప్రతిభను ప్రదర్శిస్తూ క్రీడల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటుంది. టెన్నిస్ క్రీడలలో జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలలో ప్రతిభను కనబరిచి పలు పథకాలను కైవసం చేసుకుంది. సరూర్‌నగర్ స్టేడియంలో గురు, శుక్రవారాల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫడరేషన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. అండర్ 14 నుండి 17 సంవత్సరాల విభాగంలో జరిగిన టెన్నిస్ క్రీడలలో రంగారెడ్డి జిల్లాకు సంబందించిన టెన్నిస్ క్రీడాకారిణి వంగాల క్రితికారెడ్డి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అంతేకాకుండా డిసెంబర్ 3న రాజస్థాన్‌లోని అజ్మీర్ లో జరగబోయే జాతీయ స్థాయి క్రీడలకు తెలంగాణ నుండి క్రితికా రెడ్డి ఎన్నికైంది. చిన్న తనము నుండి టెన్నిస్ ఆటపై మక్కువతో కోచ్ నీలకంఠేశ్వర రావు దగ్గర మెలుకువలు నేర్చుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ ర్యాంకింగ్ క్రీడలో రాణిస్తున్నది. దీనికి ముఖ్యంగా కోచ్ తల్లిదండ్రుల యొక్క కృషి ఎంతో ఉందని పలువురు ప్రశంసిస్తున్నారు. అజ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### గ్లోబల్ సిటీ దిశగా పరుగులు పెట్టనున్న

## రెండో దశ మెట్రో రైల్

* హెచ్‌ఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డి * ఘనంగా హైదరాబాద్ మెట్రో రైల్ 7వ వార్షికోత్సవాలు



ప్రజాపక్షం / హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించి ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎల్ అండ్ టి మెట్రో రైల్ అమీర్ పేట్ మెట్రో స్టేషన్‌లో గురువారం 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎల్, హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ అండ్ టి మెట్రో రైల్ సంస్థ సహకారంతో మెట్రో రైల్ హైదరాబాద్ కి ఒక వరంగా ఆవిష్కృతమైందని అన్నారు.

ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ ఏడేళ్లలో ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో మెట్రో రైల్ ని అందుబాటులోకి తేగలిగామని ఆయన చెప్పారు. 90 లక్షల వాహనాలతో హైదరాబాద్ రవాణా విపరీతంగా పెరిగిపోయిందని, ఇటువంటి పరిస్థితుల్లో మెట్రో రైల్ ఒకటే ఈ సమస్యకు ప్రధానమైన పరిష్కారమని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. పాత నగరం మెట్రోకు ఇప్పటికే భూసేకరణ ప్రారంభమైందని ప్రాథమిక పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకు నిధుల కొరత ఉండబోదని, సిఎం రేవంత్ రెడ్డిఈ ప్రాజెక్టును విజయవంతంగా చేపట్టడానికి తగు ఆదేశాలు ఇచ్చారని ఆయన వెల్లడించారు. రెండవ దశ మెట్రోకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిన తర్వాత పెట్టుబడి పెట్టడానికి అనేక మల్టీ లేటరల్ డెవలప్మెంట్ బ్యాంకులు సుముఖత చూపిస్తున్నాయని ఆయన వెల్లడించారు. మెట్రో రెండవ దశ వల్ల హైదరాబాద్ ప్రపంచంలోనే ఉన్నత నగరాల సరసన చేరుతుందని, గ్లోబల్ సిటిగా మారబోతోందని చెప్పారు.ఎల్ అండ్ టి మెట్రో రైల్ ఎండి, సీఈఓ కెవిబి రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడు సంవత్సరాల మెట్రో ప్రస్థానంలో ప్రజలకు గొప్ప సౌకర్యాలతో సేవలు అందించగలిగామని అన్నారు. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టుగా ఒక ప్రణాళికాబద్ధంగా మెట్రో రైళ్ల ఆపరేషన్ ని మరింత సమర్థవంతంగా చేపట్టనున్నామని, కొత్త కోచ్‌లను తెప్పించే ప్రయత్నాన్ని ముమ్మరంగా చేస్తున్నామని వెల్లడించారు.

## జ్యోతిరావు పూలే ఆశయాలు సాధిద్దాం

### ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ మేకల





ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి/మల్కాజిగిరి: మహాత్మా శ్రీ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ గౌతంనగర్ చౌరాస్తాలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ ఆయన ఆశయాల మేరకు నేటి యువత కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల రద్దు, అంటరానితనం నిర్మూలన కోసం ఆయన ఎనలేని కృషి చేసారన్నారు.

అల్వాల్‌లో: మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం. అభ్యున్నతి కోసం నిరంతర కృషిచేసిన మహనీయుడని తెలంగాణ సంసృతిక చైర్మన్ గుమ్మడి వెన్నెల గద్దర్ అన్నారు. గురువారం మచ్చ బొల్లారం డివిజన్ అంబేద్కర్ నగర్ మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేద విద్యార్థులు, ఆడపిల్లల చదువుల కోసం జ్యోతిరావు పూలే ఆయన సతీమణి సావిత్రిబాయి ఎంతో కృషి చేశారన్నారు. కుల వివక్ష అంటరానితనంపై పోరాడి బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు విద్యావకాశాలు కల్పించు గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ రెడ్డి, చంద్రశేఖర్, సిఎల్ యాదగిరి, సురేందర్ రెడ్డి, యాదలయ్య, శివకుమార్, సంజీవ్ కుమార్, రాజసింహారెడ్డి, నాగేశ్వరరావు, బలవంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీ రెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, గోపాల్ యాదవ్, వెంకట్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్,ముస్తాక్‌లు పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో: మహాత్మ జ్యోతి రావు పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని నాగారం ఎలక్ట్రికల్ డివిజన్ ఆఫీసులో బిసి అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి నాయకులు ముత్యం వెంకన్నగౌడ్, కీసర డిఈ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండగలో కాంగ్రెస్ నాయకుల సందడి

ప్రజాపక్షం/పెద్దేముల్:ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రైతు పండు గా కార్యక్రమానికి పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున్న తరలి వెళ్ళారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన రైతు పండుగ కార్యక్రమానికి పెద్దేముల్ మండ లం నుండి పెద్దఎత్తున రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెళ్ళారు.

రైతుల రుణమాఫి చేసినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మరో పక్క ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి పెద్దేముల్ మండల నుండి రైతులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి వెళ్ళారు.

తరలివెళ్ళిన వారిలో టిపిపిసి మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎండి రియాజ్, మాజీ సర్పంచ్‌లు కిషన్ రావు, ఎర్ర బాలప్ప, బుద్దారం వెంకటయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు నషీర్,మా ర్కెట్ కమిటి డైరక్టర్ ఎక్బాల్, పెద్దముల్ గ్రామ కాంగ్రె పార్టీ అధ్యక్షుల డివై నర్సిములు, మంబపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారాయణ, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## పంటలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాపక్షం/పరిగిరూరల్ : పరిగి మండల పరిధిలోని యాభాజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఏరీస్ ఆగ్రో లిమిటేడ్ కంపెనీ 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని రైతులు భూమిలో ఉన్న పోషకాల గురించి తెలుసుకొని పంటలో పలు జాగ్రత్తలు పాటించి మంచి దిగుబడులను పొందాలని అయ్యన్న నాయుడు అన్నారు. భుసార పరీక్షలతో పాటు రైతులు పంట మార్పిడి చేయాలన్నారు. వ్యవసాయశాఖ సలహలు తీసుకొని పంటలు సాగు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ యాదవ్, గంగాదర్, రైతులు పాల్గోన్నారు.




## బాల్య వివాహ నిరోధక ఉద్యమం ప్రారంభం

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: భారత ప్రభుత్వ బాల్య వివాహ భారత్ పిలుపు మేరకు బాల్య వివాహ నిరోధక ఉద్యమాన్ని వికారాబాద్ జిల్లాలో ప్రారంభించడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా బాల్య వివాహలు అపడానికి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అనే వేదిక 250 ఎన్‌జిఓ లతో ఏర్పాటు చేయడం అందులో సాధన ఒక భాగ్యస్వామ్య సంస్థగా వికారాబాద్ జిల్లాలో బాల్య వివాహలకు వ్యతిరేకంగా వికారాబాద్ ,మర్పల్లి ,పెద్దముల్ ,తాండుర్ ,ధారూర్ మండలాలలోని 50 గ్రామ పంచాయతీలో వివిధ కార్యాక్రమాలకు చేపట్టడం జరుగుతుంది అని అన్నారు. కేంద్ర మహిళ , శిశు సంక్షేమ శాఖ అపర్ణపూర్ణ దేవి డీల్లిలో లాంచనంగా ఉద్యమాన్ని ప్రారంభించారు.

250 ఎన్‌జిఓ లతో కలిసి రాష్ట ప్రభుత్వాల,కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో అనేక కార్యక్రమాలను చేపడుతుందని తెలియజేశారు. వికారాబాద్ జిల్లా లోని తెలంగాణ సంఘిక సంక్షేమ గురుకుల కొత్తగడి పాఠశాలలో ప్రారంభించారు.



## తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాపక్షం/శామీర్‌పేట: మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మూడు చింతలపల్లి మండల తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి నూతన చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేష్, నాయకులు హరిమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ బ్రిడ్జి కోసం కేంద్రాన్ని సంప్రదిస్తా

### కార్పొరేటర్ శ్రవణ్



ప్రజాపక్షం/మల్కాజిగిరి:ఎమర్జెన్సీ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మిలిటరీ విభాగం అప్పగించాల్సి ఉంటుందని, దీని కోసం కేంద్ర అధికారులను సంప్రదిస్తానని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. గురువారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు విష్ణు చౌద రి, రాజిరెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు సుదర్శన్, రజితలతో కల్సి స్థల పరిశీలన చేసారు. సఫిల్‌గూడ రైల్వే స్టేషన్‌లో మరో నూతన ట్రాక్ రావాల్సి ఉందని, అంబులెన్స్‌లాంటి ఎమర్జెన్సీ వాహనాల రాకపోకలకు వీలుగా నిర్మించాల్సిన అండర్ బ్రిడ్జి కోసం మిలిటరీ విభాగం స్థలాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా రైల్వే అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి నివేదిక సమర్పిస్తే డిఫెన్స్ మినిస్ట్రి అధికారులను సంప్రదిస్తానని కార్పొరేటర్ తెలిపారు. బలరాంనగర్, వెస్ట్ శ్రీకృష్ణ నగర్, సీతారాం నగర్, కాలనీలకు చెందిన రమేష్, నిరంజన్, గోపాలసింగ్, రామకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## శామీర్‌పేట సర్వీస్‌రోడ్డు పునరుద్ధరిస్తాం

### కమిషనర్ వెంకటగోపాల్

ప్రజాపక్షం/శామీర్‌పేట: శామీర్‌పేట మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న సర్వీస్‌రోడ్డును పునరుద్ధరిస్తామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకటగోపాల్ అన్నారు. పెద్దమ్మ కాలనీ, నల్సార్ యూనివర్శిటీ వెళ్లడానికి రోడ్డు దాటాల్సి వస్తుంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ వెంకటగోపాల్ గురువారం సర్వీస్‌రోడ్డును సందర్శించి పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో రోడ్డులో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తామని రోడ్డును బాగుపరిచి వాహనాదారులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మహేందర్‌యాదవ్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ రేణుక, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కబడ్డీ పోటీలు

ప్రజాపక్షం/దుండిగల్ : కబడ్డీ పోటీలో మహిళలు అత్యంత ప్రతిభ చూపాలని అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 29/11/2024 శుక్రవారం సీనియర్ మహిళ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జట్టు సెలక్షన్ కాసాని కబడి అకాడమీ బాచుపల్లిలో జరుగుతాయని అసోసియేషన్ సెక్రటరీ చంద్రహాస్ తెలియజేశారు. ఎంపిక పోటీలలో పాల్గొనే మహిళా కబడ్డీ క్రీడాకారులు 75 కేజీల లోపు తమ ఆధార్ కార్డులు తీసుకొని హాజరుకావాలని తెలిపారు. నిర్వహించే ఈ పోటీలలో మహిళా అంతర్ జిల్లా కబడి ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లా మహిళా జట్టు పాల్గొంటారని తెలియజేశారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలోని మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్ తలారి యాదగిరి ముదిరాజ్ తలారి మధుసూదన్ నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, బాలాజీ నాయక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, శంకర్ నాయక్, 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్ నాయక్, మునిసిపల్ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, నాయకులు సుధాకర్ రెడ్డి,గణేష్ ముదిరాజ్, య్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## భద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్‌గా పటేల్ కిరణ్‌కుమార్

ప్రజాపక్షం/తాండూరు:తాండూరు పట్టణంలో వెలసిన భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. భావిగి భాద్రేశ్వర స్వామి దేవాలయ కమిటి నూతన చైర్మన్‌గా పటేల్ కిరణ్‌కుమార్‌ను నియామించారు. కమిటి చైర్మన్‌గా పటేల్ కిరణ్‌కుమార్, కమిటి సభ్యులుగా జాక సంగమేశ్వర్, జొల్లు రోహిణి, శెట్టి సురేష్ , గాండ్ల వీరణ, కల్లూర్ బస్వరాజ్, కోటం సిద్దలింగం, ఎం.ప్రశాంత్‌కుమార్, గడ్డి కిరణ్‌కుమార్‌లను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారి చేసింది. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో భద్రేశ్వర దేవాలయ కమిటి చైర్మన్‌గా నియమించిన స్థానిక ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## వాల్యూజోన్ హైపర్ మార్ట్ వినియోగదారులకు గొప్ప అనుభవం

### సినీ నటుడుబాలకృష్ణ




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : పలు రకాల వస్తువులు, ఉత్పత్తులు సరసమైన ధరలతో లభించే విధంగా విస్తృతమైన అతి పెద్ద ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాల్యూజోన్ హైపర్ మార్ట్ వినియోగదారులకు గొప్ప అనుభవంగా మారుతుందని సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. గురువారం నాచారంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలతో కల్సి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్యూజోన్ మార్ట్ వినోదం, సౌకర్యం, ఆహ్లాదకరమైన షాపింగ్ ద్వారా వినియోగదారులు తమ ఇళ్లకు అవసరమైన అన్ని వస్తువులను పొందగలుగుతారన్నా రు. నిర్వాహకులు వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాదరావులు మాట్లాడుతూ ఫ్యాషన్, నిత్యావసర సరుకులు, సాధారణ వస్తువులపై ప్రతి రోజూ ఆఫర్లపై అందిస్తామని, జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లకు చెందిన ఉత్పత్తులు ఒకే ప్రాంగణంలో అందించే ఏర్పాటు చేసామన్నారు.

## వంద శాతం చెత్త సేకరణ జరగాలి

**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు వందశాతం చెత్తసేకరణ జరిగాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర శానిటేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి బిజెఎంసి పరిధిలోని కాలనీలలో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన శానిటేషన్ పనుల తీరును అధికారులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రధాన రోడ్లను, కాలనీ రోడ్లను, బస్తీలల్లో ఉన్న రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు శ్రీధర్, నరేందర్, రాము పాల్గొన్నారు.

# మహానగరి

## 30వరకు డేటా ఎంట్రీ పూర్తిచేయాలి

### జడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్ :** ఈనెల 30 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని జడ్‌పి సిఇఒ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాయలంలో డేటా ఎంట్రీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే చేస్తున్న అధికారులు కార్యాలయంకు వచ్చి సర్వే రిపోర్టు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అపర్ణ ఉన్నారు

## గెజిటెడ్ అధికారుల సంఘం బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** గెజిటెడ్ అధికారుల సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సమావేశం తీర్మానించింది. సోమవారం రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ కె.రామారావు, సెక్రటరీ శ్రీనేష్ కుమార్ నోరి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ రావు,సెంట్రల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ కృష్ణ, శ్రీరామ్ రెడ్డి సిద్దిపేట జిల్లా ప్రెసిడెంట్ రంగారెడ్డి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వేంకటేశం,ట్రెజరర్ శ్రీనివాస్,జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ లు బాలరాజు గౌడ్ ,గంపా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సైదమ్మ,మహేందర్, భూక్యా రాకేష్,నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

## ఆగిన పనులు త్వరిగతగిన పూర్తి

### హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** గత ప్రభుత్వం హయాంలో అగిన పనులను త్వరిగతిన పూర్తి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అన్నారు. గురువారం డివిజన్‌లోని పద్మావతి కాలనీలో గత రెండు సంవత్సరాలుగా నిలుచిపోయిన పనులను కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఏఈ మల్లికార్జున గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, పనులు ప్రారంభించి పూర్తిస్థాయిలో పనులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి

### ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** యువత స్వయం ఉపాధి అవకాశాలు అలవర్చుకోవాలని ఆర్థికంగా ఎదగాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని బ్యాంకు కాలనీ రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమం లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నిర్వాహకులు ప్రసన్న కుమార్, శ్రీనివాస్, నాయకులు అనిల్ చౌదరి, సతీష్ కుమార్ గౌడ్, రాఘవేంద్ర రావు, నీలం రాజశేఖర్ గౌడ్, పోగుల రాంబాబు, మధుసుధన్‌రెడ్డి, కృష్ణా, శ్రీశైలం, కుంచాల రాంబాబు, దయాకర్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం

### జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చంపాపేట:** సిఎంఆర్ఎఫ్ పథకం పేద మధ్యతరగతి ప్రజలకు వరమని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ భాగ్యనగర్‌కాలనీకి చెందిన అనిల్‌కుమార్ గుండె సంబంధిత వ్యాధితో ఓప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. తనకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని రాజశేఖర్‌రెడ్డితో విన్నవించగా స్పందించిన ఆయన రూ.60వేలు మంజూరు చేయించి గురువారం వార్డు కార్యాలయం లో లబ్ధిదారుడికి అందజేశారు. కాలనీ అధ్యక్షుడు రాంచందర్, పలుసం శ్రీధర్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

## రైతు ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కొందుర్గు సింగిల్ విండో చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, గోవర్ధన్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, జితేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఒటిఎస్‌కు సమీపించిన తుది గడువు

### ఇక మిగిలింది రెండు రోజులే




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లుల బకాయింపుల చెల్లింపునకు ప్రభుత్వం ప్రకటించిన వన్ టైమ్ సెటిల్ మెంట్–2024 (ఓటిఎస్) పథకం తుది గడువు సమీపిస్తోంది. మరో రెండు రోజుల్లో అంటే ఈనెల 30వ తేదీతో బిల్లులు చెల్లించే గడువు పూర్తవుతుంది. ఈలోపు ఓటిఎస్‌ను ఉపయోగించుకున్న వినియోగదారులకు పెండింగ్‌లో ఉన్న అసలు మొత్తం కడితే, ఎలాంటి వడ్డీ, ఆలస్య రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. గడువు పూర్తయిన తర్వాత చెల్లిస్తే, పెండింగ్ బిల్లుల మీద వడ్డీతో పాటు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ పథకం ఆ నెల చివరి వరకు కొనసాగింది. పండగలు రావడం, ప్రజలు సొంతూళ్లకు వెళ్లడం, ఆర్థిక భారం పడటంతో పథకాన్ని సరిగా వినియోగించులేకపోయారు. మరోసారి పథకం గడువును పెంచాలని వచ్చిన విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో జలమండలి పథకం గడువును పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం మరో నెల అంటే నవంబర్ చివరి వరకు పొడిగించేందుకు అనుమతి ఇచ్చింది. ప్రజల నుంచి వినతులు రావడంతో ఇప్పటికే ఒకసారి గడువు పెంచిన ప్రభుత్వం ఈ పథకాన్ని మరోసారి పెంచే అవకాశం లేనందున, నిర్ణీత గడువులో సద్వినియోగం చేసుకోవాలని జలమండలి అధికారులు కోరుతున్నారు. పథకం గడువు ముగిసిన అనంతరం పెండింగ్ బిల్లుల వినియోగదారులపై కఠిన చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. అవసరమైతే వారి నల్లా కనెక్షన్ సైతం తొలగించనున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సర్వీస్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రీడిప్లాయ్డ్ విఆర్వోలు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వివిధ శాఖల్లో పాత సీనియారిటీ లెక్కించకపోవడం, చాలా శాఖల్లో సీనియారిటీ లిస్టులో విఆర్వోల పేర్లు చేర్చకపోవడ తోపాటు ఇతర శాఖల్లో డిపార్ట్మెంట్ టెస్టులు పాస్,ప్రమోషన్ కి అర్హత ఉన్నా కూడా పదోన్నతులు ఇవ్వడం లేదని, తద్వారా సర్వీస్ పరంగా చాలా నష్టపోతున్న విషయం, ఇతర శాఖల్లో స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయకపోవడం లాంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో రాఘవేందర్ రావు,ముత్యాలు, శ్రీనివాస్,దయానంద్, వెంకటేష్,అజీజ్, మన్నెయ్య,రఘుపతి రెడ్డి, శైలజ,భార్గవి, కవిత,శ్రావణి, భాగ్యలక్ష్మి,శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాధికారం దిశగా బిసిల అడుగులు

### బిసిఎఫ్ ఆవిర్భావ సభలో జైహింద్‌గౌడ్ పిలుపు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలంతా ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సినీ నిర్మాత జై హింద్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వెనకబడిన కులాల సమాఖ్య (బిసిఎఫ్) ఆవిర్భావ సభ, మహాత్మాజ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. చెన్న రాములు ముదిరాజ్, జైహింద్ గౌడ్‌తో పాటు తదితర నేతలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జైహింద్ గౌడ్ మాట్లాడుతూ కుల గణనతో బిసిలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. బిసిలు ఎన్నికల కదనరంగంలో దిగితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్లలో బిసిల రాజ్యాధికారం వస్తుందని, ఎర్రకోటపై జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బిసిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా ఎం. చెన్నరాములు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిట్టల భూమేశ్, ప్రధానకార్యదర్శిగా మహతి రమేష్ నాయి, కార్యదర్శి ప్రశాంత్ యాదవ్‌తో పాటు కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### టిజిహెచ్ఎంఇయు అధ్యక్షుడు బాలకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె. బాలకృష్ణ అన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవదాస్, నాయకులు భూషణం, మల్లేష్, రాములు, శ్రీహరి, కృష్ణ, సునీల్, మహేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రీన్ ఫార్మాసిటీ భూముల పరిశీలన

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని గ్రీన్ ఫార్మాసిటీ భూములను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాల భూములను పరిశీలించారు. ఎంతమంది రైతులకు ఎన్ని ఎకరాలు ఇండ్ల స్థలాల కోసం కేటాయించారని అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామ పంచాయతీ అనుబంధ తండాలైన మర్లకుంట తండా, మంగలి గడ్డ తండా సమీపంలోని భూములను పరిశీలించారు. అయా తండాల పరిధిలో ప్రభుత్వం భూములన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సర్వేనంబర్ 92, తదితర నంబర్లలో దాదాపు 700 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల భూములు సేకరించారని సంబంధింత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములను పరిశీలించి కలెక్టర్ వెళ్ళిపోయారు. కలెక్టర్ ఎవరికి చెప్పకుండా రావడం పట్ల రైతులు అందోళన చెందుతున్నారు. ఈ విషయం మండలంలో చర్చనీయాశంగా మారింది.

## ఉద్యమంగా కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమం

### రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహించాలని రంగారెడ్డి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరూర్ నగర్‌లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి 15 వ తేదీ వరకు కుష్టు వ్యాధి గుర్తింపు, నివారణ అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటికి వెళ్లి వ్యాధి లక్షణాల కోసం పరీక్షలు చేయాలన్నారు. అనుమానం ఉన్నవారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని తెలిపారు. కార్యక్రమాన్ని సిబ్బంది అంకిత భావంతో పనిచేసి జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు కోరారు. అనంతరం జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి అవగాహన కలిపించారు. కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు, సర్వే చేసే విధానం, రిపోర్టుల తయారు చేసే పద్ధతిని జిల్లా పారామెడికల్ అధికారి సులోచన వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే

### వర్ధంతి సందర్భంగా నివాళి




**ప్రజాపక్షం/సరూర్ నగర్ :** సామాజిక విప్లవకారుడు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దేశంలో మొట్టమొదటి మహిళా విద్యను ప్రోత్సహించిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతిని న్యూనాగోల్‌లోని ఎస్‌ఎ డాంగే భవన్‌లో సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి శ్రీ బాతరాజు నరసింహ్మా అధ్యక్షతన నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహకారదర్శిలు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, జిల్లెల కృష్ణ, ఇద్రిస్, జి.శ్రీనివాస్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు వి.నాగమణి, ఆర్.లింగస్వామి, జి.శోభ, పి.అనిత, జి.శ్రీనివాస్, యు.మల్లేష్ గౌడ్, పార్వతమ్మ, భాగ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఎల్‌బినగర్ కాంగ్రెస్ నేతలు గురువారం ఎల్‌బి నగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, డివిజన్ల అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుద్ద సత్యనారాయణ, నాయకులు షరీఫ్, బద్రీనాథ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో....** జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో హయత్‌నగర్ మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి వాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల కోసం ఉద్యమం చేసిన గొప్పనాయకుడన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేష రాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, ఏఐటియుసి హయత్ నగర్ మండల ప్రధాన కార్యదర్శి రామావత్ సక్రు నాయక్, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కరె సుజాత, కొప్పుల సరిత, అరుణ, అనిత, యమునా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### నివాళి అర్పించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఎల్‌బి నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**షాబాద్ :** బడుగు బలహీణ వర్గాల అభ్యునతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని బిజి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ అన్నారు.



మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే వర్ధతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య సమితి రాష్ట అధ్యక్షులు రాపోలు నర్సింలు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్, రజక సంఘం అధ్యక్షులు గడ్డం చంద్రయ్య, రాము, చంద్రపాల్, లింగం, వెంకటేష్, నర్సింలు, తమ్మళి రవీందర్, చందిప్ప జంగయ్య, చోకంపేట్ అంజనేయులు, రామకృష్ణ ఉన్నారు.

### మహిళోద్ధరణకు కృషి చేసిన పూలే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ :** కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం అవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రఘు, బాల్‌రాజ్ గౌడ్, ఆంజనేయులు, సత్యంరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వెంకట



నర్సింహ్మారెడ్డి, బిసిసెల్ అధ్యక్షుడు జాకారం చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు రాజు, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి భార్గవ్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్, రావుల పెంటయ్య, శేఖర్ ఉన్నారు.







క్రీడ

అంతర్జాతీయ క్రికెట్‌కు

# సిద్ధార్థ్ కౌల్.. గుడ్‌బై !

టీమ్ఇండియా సీనియర్ పేస్ బౌలర్ సిద్ధార్థ్ కౌల్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పేశాడు. తాను రిటైర్మెంట్ పలుకుతున్నట్లు గురువారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు. అయితే ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, ఓవర్సీస్, డొమెస్టిక్ టోర్నీల్లో కొనసాగనున్నట్లు పేర్కొన్నాడు. ఇక తన కెరీర్‌లో మద్దతుగా నిలిచిన బిసిసిఐ, అభిమానులకు కౌల్ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ మేరకు ఓ వీడియో షేర్ చేశాడు. 'చిన్నతనంలో పంజాబ్ పొలాల్లో క్రికెట్ ఆడేప్పుడు నాకు ఓ కల ఉండేది. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా కల. 2018లో ఆ దేవుడి దయతో టీ20, వన్డేల్లో అరంగేట్రం చేశాను. అప్పుడు టీ20ల్లో నెం 75, వన్డేల్లో నెం 221 క్యాప్‌లు అందుకున్నాను. ఇక నా కెరీర్‌కు సమయం కేటాయించి, రిటైర్‌మెంట్ ప్రకటించాల్సిన సమయం వచ్చేసింది'. 'కెరీర్‌లో కఠిన పరిస్థితుల్లో మద్దతుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు చెప్పడానికి నా దగ్గర మాటలు లేవు. నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, నా సహచరులు, మద్దతుగా అభిమానులు అందరికీ థాంక్స్. అండర్ 19, టీమ్ఇండియా సీనియర్ జట్టుకు ఆడే ఛాన్స్ ఇచ్చి నా కల నెరవేర్చిన బిసిసిఐకి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ఐపిఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీలు నాకు జీవిత కాల జ్ఞాపకాలను అందించినందుకు థాంక్స్. ఇక 2007లో నా ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేయడానికి, కెరీర్‌లో నాకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచిన పంజాబ్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. మీ అందరి మద్దతు లేకపోయి ఉంటే ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండే వాడిని కాదు' అని సిద్ధార్థ్ ఎమోషనల్ నోట్ రాసుకొచ్చాడు. 34ఏళ్ల సిద్ధార్థ్ 2018లో టీమ్ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. అయితే 6ఏళ్ల కిందటే అంతర్జాతీయ కెరీర్ ప్రారంభించినప్పటికీ కౌల్‌కు ఎక్కువ మ్యాచ్‌ల్లో ఆడే ఛాన్స్ రాలేదు. తన కెరీర్‌లో ఇప్పటివరకు 3 టీ20, 3 వన్డేల్లోనే టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. ఇక కౌల్ అంతర్జాతీయ మ్యాచ్ ఆడి దాదాపు 5ఏళ్లు గడిచిపోయింది. అటు ఐపిఎల్‌లోనూ సిద్ధార్థ్ పలు ఫ్రాంచైజీలకు ఆడాడు. కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపిఎల్ కెరీర్‌లో 55 మ్యాచ్‌ల్లో కౌల్ 58 వికెట్లు దక్కించుకున్నాడు. 2018 సీజన్‌లో సన్‌రైజర్స్ బౌలింగ్‌లో కీలక పాత్ర కూడా పోషించాడు. సిద్ధార్థ్ 2008 అండర్ 19 వరల్డ్‌కప్ విన్నింగ్ జట్టులో సభ్యుడు. అప్పుడు యంగ్ టీమ్ఇండియా విరాట్ కోహ్లీ నాయకత్వంలో ఛాంపియన్‌గా నిలిచింది.





# చరిత్ర సృష్టించిన జితేశ్ శర్మ..

## పంత్, శ్రేయస్‌కు సాధ్యం కాని రికార్డ్!

టీమిండియా యువ వికెట్ కీపర్ జితేశ్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐపిఎల్ మెగా వేలం చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కానీ ఘనతను అందుకున్నాడు. అత్యధిక సాలరీ హైక్ అందుకున్న ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. ఐపిఎల్ 2025 మెగా వేలంలో జితేశ్ శర్మను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) రూ. 11 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఐపిఎల్ 2023 సీజన్ మినీ వేలంలో జితేశ్ శర్మను పంజాబ్ కింగ్స్ రూ. 20 లక్షల కనీస ధరకు తీసుకుంది. ఇప్పుడు ఏకంగా 55 రెట్ల అధిక ధర దక్కింది. ఐపిఎల్‌లో ఇంత భారీ మొత్తంలో సాలరీ హైక్ సాధించిన ఆటగాడు మరొకరు లేరు. గత రెండు సీజన్లలో పంజాబ్ తరపున జితేశ్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడాడు. భారీ సిక్స్‌లు కొట్టగలిగే జితేశ్ వికెట్ కీపర్. మరోవైపు ఆర్‌సిబికి దినేశ్ కార్తిక్ తర్వాత ఫినిషర్ కమ్ వికెట్ కీపర్ అవసరం చాలా వచ్చింది. ఫిల్‌సాల్ట్ ఉన్నప్పటికీ.. అతను ఓపెనర్ కావడంతో లోయర్ ఆర్డర్‌లో జితేశ్ ప్రధాన పాత్ర పోషిస్తాడని ఆర్‌సిబి భావిస్తోంది. జితేశ్ శర్మ పంజాబ్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఐపిఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు కూడా జితేశ్ శర్మ సాధించిన ఘనత దక్కలేదు. ఐపిఎల్ 2025 మెగా వేలంలో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. శ్రేయస్ అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్లు. ఐపిఎల్ చరిత్రలోనే ఇవి అత్యధిక ధరలు. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రూ. 16 కోట్లు తీసుకున్న రిషభ్ పంత్.. తాజాగా వేలంలో రూ. 27 కోట్లు సొంతం చేసుకున్నాడు. అదనంగా రూ. 11 కోట్లు మాత్రమే అందుకున్నాడు. దాంతో అతనికి 175 శాతం హైక్ మాత్రమే లభించింది. మరోవైపు శ్రేయస్ అయ్యర్‌కు 200 శాతం హైక్ వచ్చింది. శ్రేయస్ అయ్యర్‌కు కేకేఆర్ రూ. 12.25 కోట్లు చెల్లించింది. ఇప్పుడు పంజాబ్ రూ. 26.75 కోట్లకు కొనుగోలు చేసింది.

రీల



# జైలర్—2 కు సిద్ధమైన రజని

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటించిన రీసెంట్ భారీ హిట్ చిత్రాల్లో దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో చేసిన సెన్సేషనల్ హిట్ చిత్రం జైలర్ కోసం తెలిసిందే. మరి రజినీకి తన రేంజ్ భారీ కం బ్యాక్ లా నిలిచిన ఈ చిత్రానికి దర్శకుడు సీక్వెల్ ని కూడా ఫిక్స్ చేసిన సంగతి తెలిసిందే. మరి ఈ సీక్వెల్ పై ఇపుడు ఓ సాలిడ్ అప్డేట్ అయితే వినిపిస్తుంది. దీనితో ఈ చిత్రాన్ని తలైవర్ ఈ డిసెంబర్ మొదటి వారం లోనే మొదలు పెట్టేయనున్నట్టుగా తెలుస్తుంది. సూపర్ స్టార్ బర్త్ డే కానుకగా మేకర్స్ ఓ వీడియో కూడా విడుదల చేసి షూట్ పై అప్డేట్ ఇవ్వనున్నట్టుగా తెలుస్తుంది. ఆల్రెడీ దర్శకుడు లోకేష్ కనగరాజ్ తో కూలీ అనే భారీ మల్టీస్టారర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇది దాదాపు తన పోర్షన్స్ పూర్తి కావస్తుండగా ఇపుడు జైలర్ 2 కి కూడా తలైవర్ సన్నద్ధం అయ్యిపోయారని తెలుస్తుంది. మొత్తానికి మాత్రం రానున్న రోజుల్లో రజినీకాంత్ నుంచి సాలిడ్ ట్రీట్ ఫ్యాన్స్ కి ఉండనుంది అని చెప్పాలి.



# మోహన్ లాల్ భారీ చిత్రం '3డి'లో మాత్రమే..

మళయాళ సినిమా దగ్గర ఉన్నటువంటి బిగ్గెస్ట్ స్టార్స్ లో సీనియర్ హీరో మోహన్ లాల్ కూడా ఒకరు. మరి మోహన్ లాల్ ఇపుడు సోలోగా సహా ఓ భారీ మల్టీ స్టారర్ సినిమా కూడా చేస్తున్నారు. అయితే ఈ సినిమాలు కాకుండా తాను చేస్తున్న మరో స్పెషల్ సినిమా కూడా ఉంది. ఆ చిత్రమే బరోజ్. తన దర్శకత్వంలోనే భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవెల్లో ప్లాన్ చేసిన ఈ సినిమా చిన్న పిల్లల నేపథ్యంలో 3డి లో తెరకెక్కుతుంది. అయితే ఈ సినిమా రిలీజ్ విషయంలో ఓ ఇంట్రెస్టింగ్ టాక్ అయితే ఇపుడు వినిపిస్తుంది. దీనితో ఈ సినిమా పాన్ ఇండియా భాషల్లో కేవలం 3డి స్క్రీన్స్ లో మాత్రమే మేకర్స్ విడుదల చేస్తారట. 2డి వెర్షన్ లో ఈ సినిమా విడుదల కాబోయేది లేదు అన్నట్టుగా ఇపుడు షాకింగ్ టాక్ సినీ వర్గాల నుంచి వినిపిస్తుంది. ఈ చిత్రాన్ని మేకర్స్ అనౌన్స్ చేయడమే 3డి అంటూ అనౌన్స్ చేశారు కానీ ఇపుడు రిలీజ్ కూడా కేవలం 3డి లోనే చెబుతుండడం ఆసక్తికరంగా మారింది.



# 'మిస్ యు' రిలీజ్ డేట్ వాయిదా

హీరో సిద్ధార్థ్ నటించిన లేటెస్ట్ మూవీ 'మిస్ యు' నవంబర్ 29న రిలీజ్ అవుతున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు. ఈ మేరకు చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ కూడా గ్రాండ్‌గా నిర్వహించారు. ఇక ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కూడా ఆకట్టుకునేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ మూవీపై బజ్ క్రియేట్ అయ్యింది. అయితే, సినిమా రిలీజ్ దగ్గరపడ్డ సమయంలో ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తమిళనాడులో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో 'మిస్ యు' చిత్ర రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ప్రేక్షకుల సంరక్షణే తమకు తొలి ప్రాధాన్యమని.. అందుకే పరిస్థితులు కుదుటపడే వరకు తమ సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని.. త్వరలోనే ఈ చిత్ర కొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ సినిమాలో సిద్ధార్థ్ సరసన అందాల భామ ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించగా, గిబ్రన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఎన్.రాజశేఖర్ డైరెక్ట్ చేస్తున్నారు.

# రైతు పండుగ 'షురూ'

## మహబూబ్ నగర్ జిల్లా, అమిస్తాపూర్‌లో 117 స్టాళ్లు ఏర్పాటు
## లాభాల ఆర్జన వ్యవసాయ మెళకువలకు సదస్సు దోహదం : తుమ్మల



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : రానున్న నాలుగు సంవత్సరాలలో రైతుల కోసం ప్రభుత్వం అనుకున్న పనులన్నీ చేసి రైతులతో సెహబాస్ అనిపించుకుంటుంటుదని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా, అమిస్తాపూర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రైతు పండుగ వ్యవసాయ ప్రదర్శనను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దమోదర రాజనర్సింహ,రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ రైతు పండుగ వ్యవసాయ ప్రదర్శనలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, ఆహార పదార్థాల ప్రదర్శన పై 117 స్టాళ్లు, ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం తో పాటు, సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెలకువలను అందించడానికి మహబూబ్‌నగర్ లో ఏర్పాటు చేసిన రైతు పండుగ వ్యవసాయ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట రెడ్డి లాంటొఇ మేధావులు రైతులకు లాభసాటి వ్యవసాయం ఏ విధంగా చేయాలో ఈ సదస్సులో అవగాహన కల్పిస్తారని అన్నారు. కొత్త పంటల పై రైతులకు మూడు రోజుల సదస్సులో అవగాహన కల్పిస్తారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 117 స్టాళ్ళతో ఏర్పాటు చేసిన ఇంత గొప్ప రైతు సదస్సు ను ఇప్పటి వరకు తాను చూడలేదని అన్నారు. 2003 – 2004 ప్రాంతంలో వ్యవసాయం దండగ అని ప్రచారం జరిగితే అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి వై. యస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించి కొంత వరు పూర్తి చేయడం వల్ల వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించారన్నారు. ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా చేయాలి,ఆధునిక పద్ధతులు, ఆధునిక వంగడాల పై సాంకేతికదను మేధావుల చేత రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. మహబూబ్ నగర్ లో ఏర్పాటు చేసిన రైతు పండుగ లాగ రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాలలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 70 వేల కోట్లు కంటే తక్కువ రుణ భారం ఉండేదని, గడచిన పది సంవత్సరాల కాలంలో ఏకంగా 8 లక్షల కోట్లు అప్పు చేసి ప్రభుత్వం అప్పజెప్పిందని గత ప్రభుత్వం చేసిన అప్పులకు గడచిన పది నెలల్లో సుమారు 60000 కోట్లు వడ్డీ కిందనే చెల్లించడం జరిగింది. అంతకుముందు జిల్లా కలెక్టర్ విజయేందిన బోయి స్వాగతోపన్యాసం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు పండుగలో రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సెరికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాష ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి, డిసిసి బ్యాంక్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, అచ్చం పేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, మక్తల్ శసనసభ్యులు వాకిటి శ్రీహరి, వనపర్తి శాసనసభ్యులు మేఘా రెడ్డి, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



## గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలను
# ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
## టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం / హైదరాబాద్: రానున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి టి.జీవన్‌రెడ్డి పోటీకి సిద్దంగా ఉంటే ఆయనకే మరోసారి అవకాశం ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేయాలని, లేనట్లయితే సామాజిక వర్గం, జిల్లాలు, అన్ని పరిగణలోకి తీసుకుని అన్ని అంశాలను ఆలోచించి అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గురువారం గాంధీ భవన్‌లో జరిగింది. సమావేశంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖ, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, డిసిసి అధ్యక్షులు, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి కోసం అన్ని కోణాల్లో పరిశీలన జరుగుతున్నదని, పార్టీ సిట్టింగ్ స్థానమని, పార్టీ అధికారంలో ఉందని, మన సీటును మనం కాపాడుకోవడం చాలా కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాన్ని గెలవాలని ఆయన అన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి నియోజకవర్గం పరిధిలోని మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మంత్రులుగా ఉన్న శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లు పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేస్తారని ఆయన సూచించారు. నియోజకవర్గాలలో ఓటర్లను నమోదు చేయించడం, ఓటర్లతో సమావేశాలు నిర్వహించి వారిని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా చూసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలలో యువత, నిరుద్యోగులు, ఉద్యోగులకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరించడం ద్వారా వారి ఓట్లను సాధించాలన్నారు.



# ఎంఎల్‌సి అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని తీర్మానించాం: షబ్బీర్ అలీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : గాంధీ భవన్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికపై సమావేశం నిర్వహించారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్, అదిలాబాద్, మెదక్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డిని నిలబెట్టాలని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎక్కువ మంది గ్రాడ్యుయేట్‌లను ఓటర్ జాబితాలో చేర్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాగా పట్టభద్రుల అభ్యర్థి ఎంపికపై చర్చించామని ఎంఎల్‌సి జీవన్ రెడ్డి అన్నారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ 10 నెలలకాలంలో 53 వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి, నిరుద్యోగులకు అండగా నిలిచిందన్నారు. 42 శాసన సభ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. పట్టభద్రుల అభ్యర్థి ఎంపిక వ్యూహాలను సమావేశంలో చర్చ జరిగిందన్నారు. మళ్లీ గ్రాడ్యుయేట్ స్థానాన్ని ఏవిధంగా నిలబెట్టుకోవాలని కసరత్తు చేశామన్నారు. త్వరలో అభ్యర్థిపై నిర్ణయం ఉంటుందన్నారు. పార్టీ తనను కూడా సంప్రదించిందన్నారు.

# మిడ్ డే మీల్స్ నాణ్యతపై కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు ఏ పూటకాపూట ఎలాంటి ఆహారం అందిస్తున్నారో పరీక్షించాలని, బియ్యం, కూరగాయలు, పప్పులు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వంటివి శుభ్రంగా ఉన్నాయా? లేదా? అనేది నిర్ధారించుకున్న తర్వాతనే వంటలు మొదలుపెట్టేలా ప్లాన్ చేయాలని సమావేశం సూచించింది. ఫుడ్ చెకింగ్ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. తద్వారా ఏ పూటకాపూట కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ఫొటోలను అప్‌లోడ్ చేయనున్నారు. యాప్ అందుబాటులోకి వచ్చే వరకు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఫొటోలను పంపే ఏర్పాట్లు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా వికారాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలను కమిషన్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా డిఇఒ, వివిధ సంక్షేమ శాఖలకు చెందిన డిడిలు, సివిల్ సప్లై అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, డిఎంహెచ్ఒ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. పేరెంట్స్ కమిటీలు, టీచర్ల కమిటీలతో నిత్యం సమావేశమవుతారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా 2011లో అప్పటి ప్రభుత్వం మిడ్ డే మీల్స్ స్కీమ్ అమలు కోసం రాష్ట్ర, మండల, జిల్లా స్థాయి కమిటీలను నియమించింది. ఈ కమిటీల విధివిధానాలపై అప్పట్లో జారీ చేసిన జిఒ 21లోని అంశాలను కూడా కమిషన్ పరిశీలించింది. ఈ జివోలో ప్రస్తుతం మారిన పరిస్థితులకు అనుగుణంగా కొత్త అంశాలను చేర్చి.. త్వరలోనే స్టీరింగ్ కమ్ మానిటరింగ్ కమిటీలను వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

**నిరంతర వైద్య పరీక్షలు**

పాఠశాలలు,గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఇక నుంచి నిరంతరం వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, వీరిలో ఎవరికైనా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నట్టు తేలితే, వారికి మిడ్ డే మీల్స్ తో పాటు ఇతర సప్లిమెంటరీ క్వాలిటీ ఫుడ్ అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యా కమిషన్ నిర్ణయించింది.

**విద్యా కమిషన్ పర్యటనకు ఏర్పాట్లు చేయండి: శాంతికుమారి**

రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 7 వరకు తెలంగాణ విద్యా కమిషన్ విస్తృతంగా పర్యటించనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ విద్యా సంస్థలను తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ .ఎల్.విశ్వేశ్వర్‌రావు, వెంకటేష్, జ్యోత్స్న పాల్గొంటారని, వారికి అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలని అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

# భారత్‌కు లష్కరే ఉగ్రవాది

(మొదటి పేజీ తరువాయి)

కేసులో జైలుశిక్ష అనుభవించాడు. ఉగ్రవాద కేసులో జీవితఖైదీ అయిన టి.నసీర్ జైలులో ఉన్నప్పుడు తీవ్రవాదులు, రిక్రూట్‌మెంట్ అయిన తర్వాత ఇతర ఉగ్రవాద నిందితుల కోసం పేలుడు పదార్థాల సేకరణ, పంపిణీని సులభతరం చేశాడని ఎన్ఐఎ విచారణలో తేలింది. నసీర్ జైలు నుంచి కోర్టుకు వెళ్లే మార్గంలో తప్పించుకోవడానికి కుట్ర చేయడంతో పాటు దేశంలో మరింతగా లష్కరేతోయిబా కార్యకలాపాలకు రాడికలైజేషన్, తదుపరి నేర కార్యకలాపాలకు పాల్పడినటు ఆరోపణలు ఉన్నాయని ఎన్ఐఎ తెలిపింది.టెర్రర్ మాడ్యూల్ ఛేదించినప్పుడు సల్మాన్ రెహ్మాన్‌ఖాన్ ఏజెన్సీల స్లిప్‌కు దోహదపడ్డారని, అతడు కూడా దేశం నుంచి పారిపోయాడని సిబిఐ ప్రకటన తెలియజేసింది. 'కాగా, ఎన్ఐఎ సల్మాన్‌పై కఠినమైన యాంటీ టెర్రిస్ట్ చట్టం, ఇండియన్ పీనల్ కోడ్(ఐపిసి)లో ఛార్జిషీట్ చేసింది. కోర్టు అతడిని పరారీలో ఉన్న వ్యక్తిగా ప్రకటించింది' అని సిబిఐ ప్రకటన పేర్కొంది. 'ఇదిలాఉంటే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (నియా) అభ్యర్థన మేరకు సిబిఐ ఆగష్టు 2, 2024న ఇంటర్‌పోల్ నుండి సబ్జెక్ట్‌కు వ్యతిరేకంగా ఒక రెడ్‌నోటీస్ జారీ చేసింది. వాంటెడ్ క్రిమినల్‌ను ట్రాక్ చేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు రెడ్‌నోటీస్‌ను జారీ చేసింది అని సిబిఐ ప్రకటన తెలియజేసింది. రెడ్‌నోటస్ ఆధారంగా రువాండాలోని కిగాలీలో అధికారులు లష్కరే తోయిబా ఉగ్రవాది, నిందితుడు సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌ను పట్టుకున్నారు. సల్మాన్ రెహ్మాన్‌ఖాన్‌ను భారత్‌కు పంపించినట్లు భారత్‌లో ఇంటర్‌పోల్ వ్యవహారాలను సమన్వయం చేసే నియమించబడిన ఏజెన్సీ అయిన సిబిఐ, ఎన్ఐఎ కు సమాచారం చేరింది. న్యాయపరమైన చర్యల అనంతరం అతడిని రువాండా నుండి భారత్‌కు గురువారం (నవంబరు 28న) గురువారం నాడు భారత్‌కు పంపించింది. ఇందులో సిబిఐ కోరిన ఇద్దరిని, మరొకరిని కేరళ పోలీసులు సౌదీ అరేబియా నుంచి భారత్‌కు రప్పించారు.

# ఎసిబికి చిక్కిన పిఆర్ ఎఇ

(మొదటి పేజీ తరువాయి)

కదారిగూడెం మాజీ సర్పంచ్ సతీష్ కాంట్రాక్ట్ బిల్లుల కోసం గత కొంత కాలంగా ఎఇ కార్తీక్ చుట్టు తిరుగుతున్నాడు. ఎఇ బిల్లుల ఫైల్ క్లియరెన్స్ చేయకపోగా రూ.5వేలు డబ్బులు డిమాండ్ చేశారు. దీనితో ఎసిబి అధికారులను ఆశ్రయించిన మాజీ సర్పంచ్ సతీష్ జడ్‌పి కార్యాలయానికి సమీపంలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం ఎఇ కార్తీక్‌కు రూ.5వేలు ఇస్తుండగా వల పన్ని పట్టుకున్నారు. అనంతరం జడ్‌పి కార్యాలయంలో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com